స్వర్ణాంధ్ర

తెలుగు దినపత్రిక

సంపాదకుడు : కె.బి.జి. తిలక్

భారత పౌరసత్వమే లేని ఝాన్సీ రెడ్డికి పీసీసీ పదవి ఎలా ఇస్తారు?



వరంగల్ : భారత పౌరసత్వమే లేని ఝాన్సీ రెడ్డి కి పీసీసీ ఉపాధ్యక్ష పదవి ఎలా ఇస్తారంటూ పాలకుర్తి కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో కోడలు ఎమ్మెల్యే అయితే అత్త పెత్తనం ఎక్కువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఝాన్సీ రెడ్డి వైఖరి మారకుంటే పాలకుర్తి నుంచే పతనం ప్రారంభం అవుతుందని అధిష్ఠానాన్ని హెచ్చరించారు. దశాబ్దాలుగా పార్టీ జెండా మోసి, సొంత ఖర్చులతో పార్టీని బతికించిన తమను ఝాన్సీ రెడ్డి పూర్తిగా పక్కన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. తీరు మార్చుకోకపోతే ఎన్నికల్లో ఓటమి ఖాయమని సీనియర్ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.

యుద్ధం ముగింపునకు 4.8 లక్షల కోట్ల డిమాండ్

దుబాయ్: యుద్ధం ముగించడానికి ఏం కావాలో తెలపాలని సౌదీ ప్రభుత్వం గురువారం హౌతీ తిరుగుబాటుదారులను కోరింది. 51 బిలియన్ డాలర్లు(సుమారు రూ.4.8 లక్షల కోట్లు) ఇవ్వడంతో పాటు తమను యెమెన్‌కు చట్టబద్ధమైన పాలకులుగా గుర్తించాలని వారు డిమాండ్ చేశారు.సౌదీ నేతృత్వంలో వైమానిక దాడులు, సుదీర్ఘ దిగ్బంధనం కారణంగా జరిగిన నష్టాలకు పరిహారంగా ఈ మొత్తాన్ని ఇవ్వాలని హౌతీలు డిమాండ్ చేశారు. అయితే హౌతీలపై మరింత బలమైన సైనిక పట్టు సాధించకుండా సమగ్ర ఒప్పందం చేసుకోవడానికి సౌదీ యువరాజు బిన్ సల్మాన్ సుముఖంగా లేరని సమాచారం.

R.N.I.No.APTEL/1999/1614 సంపుటి : 28 సంచిక 197 విజయవాడ 08 నవంబర్ 2026 ఆదివారం 10 పేజీలు వెల : 2 రూపాయలు swarna_tilak@rediffmail.com

బంగారం కొంటున్నారా ? తస్మాత్ జాగ్రత్త.. యాసిడ్ పరీక్షలోనూ దొరకని కొత్త కల్తీ



న్యూఢిల్లీ: బంగారం కొనుగోలుదారులు, నగల వ్యాపారులను ఆందోళనకు గురిచేస్తున్న కొత్త తరహా కల్తీ దందా వెలుగులోకి వచ్చింది. బంగారంలో రుథేనియం, ఇరిడియం, ఓస్మియం వంటి భార లోహాల సన్నని పొడిని కలిపి దాని బరువును కృత్రిమంగా పెంచుతున్నారు. ఈ కల్తీ బంగారం అసలైన బంగారంలా ఉండటమే కాకుండా సాధారణంగా చేసే యాసిడ్ పరీక్ష, టచ్‌స్టోన్(గీటురాయి) పరీక్షల్లోనూ దొరుకడం లేదు. నగలను తయారు చేసేందుకు బంగారాన్ని కరిగించినప్పుడు మాత్రమే అసలు మోసం బయటపడుతున్నది. ఈ కొత్త తరహా కల్తీని మార్కెట్లో 'గోల్డ్ పౌడర్'గా పిలుస్తున్నట్లు వ్యాపార వర్గాలు చెప్తున్నాయి.మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ సరాఫా మార్కెట్లో పనిచేస్తున్న పలువురు నగల తయారీ కళాకారులు బంగారం నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇండోర్ సిల్వర్, గోల్డ్ అండ్ జ్యువెలరీ ట్రేడర్స్ అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహించింది. బులియన్ వ్యాపారులు, మధ్యవర్తులు బంగారం కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించింది. 99.50 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం వ్యాపారానికే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్టు స్థానిక వ్యాపారవర్గాలు తెలిపాయి.

మూడేండ్లుగా భారీ లోహాల కల్తీ ఫిర్యాదులు

రుథేనియం, ఇరిడియం, ఓస్మియం వంటి లోహాలను బంగారంలో కలుపుతున్నారన్న ఫిర్యాదులు గత రెండు మూడేండ్లుగా వస్తున్నాయని వ్యాపారులు చెప్తున్నారు. వీటి సాంద్రత ఎక్కువగా ఉండటంతో తక్కువ పరిమాణంలో కలిపినా బంగారం మొత్తం బరువు పెరుగుతుంది. మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ మార్గాల ద్వారా ఈ కల్తీ పదార్థాలు భారత మార్కెట్లకు చేరుతున్నట్లు అనుమానిస్తున్నారు. వీటిని చైనాలో తయారు చేస్తున్నారన్న సందేహాలు కూడా ఉన్నప్పటికీ, వాటి మూలాలపై స్వతంత్రంగా నిర్ధారణ కాలేదు. సాధారణ యాసిడ్, గీటురాయి పరీక్షలతో పాటు పాతతరహా క్యారెట్ పరీక్షా యంత్రాలు కూడా ఈ కల్తీని గుర్తించడంలో విఫలమవుతున్నట్లు వ్యాపారులు చెప్తున్నారు. ఎక్స్రే ఫ్లోరోసెన్స్ (ఎక్స్ఆర్ఎఫ్) పరీక్షలు, ఎలక్ట్రాన్ మైక్రోస్కోపీ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులతో బంగారంలోని ఇతర లోహాల ఉనికిని గుర్తించే అవకాశం ఉన్నది. అందువల్ల బంగారం కొనుగోలు, విక్రయాల్లో నాణ్యతా పరీక్షలను మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఏర్పడింది.

వినియోగదారులు ఏం చేయాలి?

బీఐఎస్ హాల్‌మార్క్, ఆరు అంకెల గుర్తింపు సంఖ్య ఉన్న నగలనే కొనుగోలు చేయాలి.బీఐఎస్ కేర్ యాప్‌లో నంబరును నమోదు చేసి నగ వివరాలు, ప్రకటించిన స్వచ్ఛతను పరిశీలించాలి.నమ్మకమైన నగల దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.కొనుగోలు బిల్లును తప్పనిసరిగా తీసుకోవాలి.అనుమానం ఉంటే పరీక్షా కేంద్రంలో నాణ్యతను పరీక్షించాలి.

రాహుల్ హై టీ....పొలిటికల్ హీట్ ... కేంద్ర ప్రభుత్వంపై పోరాటం మరింత ఉధృతం

రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వంపై పోరాటాన్ని మరింతఉధృతంచేసేందుకుసిద్ధమవుతున్నారు.ఢిల్లీలోని తన నివాసంలో నిర్వహించిన హై-టీ సమావేశానికి సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, ఇండియా కూటమి నేతలు, విద్యార్థిసంఘాలు, పౌరసంఘ ప్రతినిధులు హాజరయ్యారు. ఓట్ల చోరీ ఆరోపణలు, ఎన్నికలసంఘంవ్యవహారంపై భవిష్యత్తు కార్యాచరణతో పాటు ఐదు రాష్ట్రాల ఎన్నికల వ్యూహాలపై చర్చించినట్లు సమాచారం.



కాంగ్రెస్ అగ్ర నేత చాలా కాలంగా తన రూట్ మార్చేశారు. ఆయన దూకుడునే రాజకీయంగా మార్చుకున్నారు. వీధి పోరాటాల నుంచి విశ్వవిద్యాలలో డిబేట్స్ చేస్తున్నారు. యూత్ తో ఇంటరాక్ట్ అవుతూనే జనంతోనూ కలసి అడుగులు వేస్తున్నారు. బహిరంగ సభలలో ప్రసంగాలు చేస్తూనే మీడియా ముందూ గట్టిగా సౌండ్ చేస్తున్నారు. ఇక ప్రధాని మోదీని తనతో చర్చకు రావాలని సవాల్ చేస్తున్నారు. ఇలా రాహుల్ గాంధీ ఏ ఒక్క అవకాశాన్ని ఏ ఒక్క నిమిషాన్ని కూడా మిస్ కాకుండా చేస్తున్న పోరు కాంగ్రెస్ శ్రేణులలో ఉత్సాహం నింపుతోంది.

అదే విధంగా ఇండియా కూటమికి పెద్దన్నగా కాంగ్రెస్ ని నాయకుడిగా రాహుల్ గాంధీని బలంగా నిలబెడుతోంది. ఎంతో మంది సీనియర్లు కాంగ్రెస్ బయటా మిత్ర పక్షాలలోనూ ఉన్నారు. అయితే ఇపుడు వారంతా రాహుల్ బాటలో నడుస్తున్నారు. ఢిల్లీలో రామ్ లీలా మైదానానికి మార్చ్ చేయడం అక్కడ భారీ బహిరంగ సభ నిర్వహించడం ద్వారా కాంగ్రెస్ వ్యూహాలు రాహుల్ ఎత్తుగడలు ఫలించాయి. కాంగ్రెస్ ఎక్కడా తగ్గేది లేదని ఎన్డీయేకు రాహుల్ స్పష్టం చేయగలిగారు.

హై టీతో ఫ్యూచర్ స్ట్రాటజీ :

ఇదిలా ఉంటే తాజాగా ఢిల్లీలోని తన సునేరీ బాగ్ నివాసంలో రాహుల్ గాంధీ హై-టీ పేరుతో వేడి తేనీటి విందుని ఏర్పాటు చేశారు. ఈ హై టీకి కాంగ్రెస్ సీనియర్లు అంతా హాజరయ్యారు. కాంగ్రెస్ అగ్ర నేత్రి సోనియా గాంధీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అలాగే ఇండియా కూటమికి చెందిన నేతలు, ఎంపీలు, అలాగే విద్యార్థి సంఘాల నాయకులు, వివిధ పౌర సంఘాలకు చెందిన ప్రతినిధులు కూడా హాజరు కావడం విశేషం. ఇలా అందరినీ ఒక చోట చేర్చి కేంద్రం మీద పోరాటానికి ఎన్నికల సంఘం విషయంలో ఓట్ల చోరీ మీద భవిష్యత్తు కార్యాచరణకు రాహుల్ గాంధీ రంగం సిద్ధం చేశారు.

ఓట్ల చోరీ అంటూ :

ఇప్పటికే దేశంలో ఓట్ల చోరీ జరిగింది అని ప్రతీ ఏడుగురు పౌరులలో ఒకరికి ఓటు హక్కు పోయింది అని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఓటు హక్కు అన్నది పౌరులకు ఇచ్చిన ప్రాధమిక హక్కుగా ఆయన చెప్పుకొచ్చారు. ఈ విషయంలో ఎన్నికల సంఘం తప్పుడు విధానాల వల్ల ఎంతో మందికి ఓట్లు లేకుండా పోయాయని ఆయన ఆక్షేపించారు. ఇప్పటికే ఈ అంశం మీద కాంగ్రెస్ సహా అంతా కలసి ఉద్యమించడం జరిగింది. ఇపుడు ఈ ఉద్యమాన్ని మరో రూపునకు తీసుకెళ్ళేందుకు చూస్తున్నారు. అందుకోసమే రాహుల్ గాంధీ నివాసంలో హైటీ సమావేశం జరిగింది అని అంటున్నారు.

రాజీనామా పైనే :

సీఎసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే అన్నది కాంగ్రెస్ విధానంగా ఉంది. అందుకే ఈ విషయంలో రాజీ పడడం లేదు, కాంగ్రెస్ ఒంటరిగా ఈ పోరు చేయడం లేదు, ఇండియా కూటమితో కలసి వస్తోంది. అలాగే పౌర సంఘాలను వెంట ఉంచుకుంటోంది. యూత్ విద్యార్థి సంఘాలతో కూడా కొత్త చెలిమి చేస్తోంది. అందుకే ఎన్నడూ లేని విధంగా రాహుల్ నివాసంలో వారికి కూడా ఆహ్వానం లభించింది. దాంతో రానున్న రోజులలో మరింత దూకుడుగా ఓట్ల చోరీ మీద పోరు సాగనుంది అని అంటున్నారు.

అయిదు రాష్ట్రాలలో :

ఇక మరి కొద్ది నెలలలో మొదలు కానున్న అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిచేందుకు తగిన రాజకీయ కార్యాచరణను రూపొందించే విషయం మీద కూడా ఈ హై-టీ మీటింగ్ లో డిస్కషన్ సాగింది అని అంటున్నారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి పై చేయి సాధించాలని చూస్తోంది. ఇక్కడ నుంచే ఎన్డీయేకి చెక్ పెడితే 2029 ఎన్నికల్లో గెలుపునకు దారులు సులువు అవుతాయన్నది కాంగ్రెస్ ఆలోచనగా ఉంది.

మొత్తానికి రాహుల్ గాంధీ గతానికి భిన్నంగా కొత్త వేదికలను నిర్మిస్తున్నారు. రాజకీయ నేతలకు భిన్నంగా కొత్త ట్రెండ్ లో వెళ్తున్నారు. అందుకే హై టీ వంటి కార్యక్రమాలు చోటు చేసుకుంటున్నాయని అంటున్నారు.

ఆమ్‌స్టర్‌డామ్‌లో మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్‌పై నిరసనకారుల దాడి



మైక్రోసాఫ్ట్ కొత్త డేటా సెంటర్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఆమ్‌స్టర్‌డామ్‌లో శుక్రవారం నిరసనలు హోరెత్తాయి. ఆందోళనకారులు నిర్మాణ స్థలంలోకి చొరబడ్డారు. కొందరు క్రేన్‌పైకి ఎక్కి మంటలు వచ్చే ఫ్లేర్లు వెలిగించారు. మరికొందరు పోలీసులతో ఘర్షణకు దిగారు.

ఐరోపా దేశాల్లో విస్తరిస్తున్న డేటా సెంటర్ల వ్యతిరేక ఉద్యమంలో భాగంగా ఈ నిరసనలు చేపట్టారు.'గిఫ్ టెగెన్‌గాస్' (వెనక్కి నెట్టండి) అనే నిరసన సంఘానికి చెందిన నాథన్ టిమ్మర్ స్థానిక ప్రసార సంస్థ ఏటీ5తో మాట్లాడారు. నిర్మాణాన్ని అడ్డుకునేందుకే ఆందోళనకారులు స్థలాన్ని ఆక్రమించుకున్నారని చెప్పారు.డేటా సెంటర్ల వల్ల సమాజానికి, పర్యావరణానికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేవరకు భారీ ప్రాజెక్టుల నిర్మాణాన్ని నిలిపివేయాలని ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో పలు ఐరోపా దేశాల్లో నిరసనలు, ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు."ఈ నిర్మాణం మాకు వద్దు. ఎవరికీ దీని అవసరం లేదు. దీన్ని కేవలం నాసిరకం ఏఐ కంటెంట్, ఏఐ యుద్ధాలు, డేటా నిఘా, మారణహోమాలకు మాత్రమే ఉపయోగిస్తారు. మాకు ఇవేవీ వద్దు" అని టిమ్మర్ అన్నారు. నిర్మాణాన్ని నిలిపివేసేవరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు.పాలస్తీనాకు మద్దతుగా నిలిచే కార్యకర్తలు కూడా ఆమ్‌స్టర్‌డామ్ నిరసనల్లో పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రానికి పోలీసులు నిర్మాణ స్థలం నుంచి ఆందోళనకారులను బయటకు పంపించారు. అయితే కొందరు అక్కడే ఉండిపోయారని స్థానిక మీడియా వెల్లడించింది. అక్రమంగా నిర్మాణ స్థలంలోకి ప్రవేశించారనే అనుమానంతో 150-200 మందిని అదుపులోకి తీసుకున్నట్లు డచ్ పోలీసులు శుక్రవారం సాయంత్రం తెలిపారు.

మైక్రోసాఫ్ట్ స్పందన ఇలా...

ఆమ్‌స్టర్‌డామ్‌లో నిరసనల విషయం తమ దృష్టికి వచ్చిందని మైక్రోసాఫ్ట్ తెలిపింది. "ఈ ప్రాజెక్టుపై ప్రజలకు బలమైన అభిప్రాయాలు ఉన్నాయని అర్థం చేసుకున్నాం. శాంతియుతంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కును గౌరవిస్తాం. అయితే చట్టవిరుద్ధమైన చర్యలను, ప్రజల భద్రతకు ముప్పు కలిగించే పనులను సమర్థించం" అని సంస్థ ప్రతినిధి వెల్లడించారు. 15 దేశాల్లో నిరసనలకు పిలుపు... అమెరికా మధ్యంతర ఎన్నికల తర్వాత డేటా సెంటర్లపై ఆంక్షలు విధిస్తామని హామీ ఇచ్చిన డెమోక్రాట్లు పెద్ద సంఖ్యలో ఎన్నికల్లో విజయం సాధించిన కొద్ది రోజులకే ఐరోపాలో ఈ ఆందోళన లు మొదలయ్యాయి.

డేటా సెంటర్లు భారీగా విద్యుత్తు, నీటిని వినియోగిస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా వీటికి వ్యతిరేకత పెరుగుతోంది.'స్టాప్ డర్టీ డేటా సెంటర్స్' పేరుతో శుక్ర, శనివారాల్లో జరిగే కార్యక్రమాల్లో 15 ఐరోపా దేశాలకు చెందిన పౌర సంఘాలు, స్థానిక ఉద్యమ సంస్థలు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. ఐర్లాండ్, పోలాండ్, డెన్మార్క్, ఫిన్లాండ్, స్పెయిన్, ఇటలీ, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, బ్రిటన్ తదితర దేశాల్లో నిరసనలు చేపట్టనున్నారు.'

'ఏఐపై ఉన్న ప్రచారాన్ని ప్రజాప్రతినిధులు నమ్ముతున్న తీరుకు, ప్రజల అభిప్రాయాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది" అని స్టాప్ డర్టీ డేటా సెంటర్స్ ఐరోపా సమన్వయకర్త ఓవెన్ ఎస్ట్రీ వ్యాఖ్యానించారు.జర్మనీలోని బెర్లిన్ శివార్లలో ఉన్న ఓ డేటా సెంటర్ ఎదుట శుక్రవారం 12 మంది నిరసన తెలిపారు. జర్మనీ అంతటా పర్యావరణ సమస్యలను పట్టించుకోకుండా డేటా సెంటర్ల నిర్మాణం సాగుతోందని, దీనికి అడ్డుకట్ట వేయాలని ఆందోళనకారుల ప్రతినిధి కారో వెబర్ అన్నారు. ఇది భవిష్యత్తుకు చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు.

పోలాండ్‌లోనూ నిరసనలు...

వార్సా పరిసర ప్రాంతాల్లో కొత్త డేటా సెంటర్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటిని వ్యతిరేకిస్తూ ఆయా ప్రాంతాల ప్రజలకు చెందిన దాదాపు 100 మంది శుక్రవారం పోలాండ్ పార్లమెంటు ఎదుట ఆందోళన చేపట్టారు.ఇటలీలోనూ డేటా సెంటర్ల పరిశ్రమ వేగంగా విస్తరిస్తుండగా, వాటికి వ్యతిరేకంగా స్థానిక ఉద్యమాలు కూడా పెరుగుతున్నాయి. ముఖ్యంగా డిజిటల్ మౌలిక సదుపాయాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న ఉత్తర ఇటలీలోని లోంబార్డీ ప్రాంతంలో వ్యతిరేకత ఎక్కువగా ఉంది. క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ సేవలకు అవసరమైన డేటా సెంటర్ల నిర్మాణం వేగంగా సాగుతోందని, అయితే ప్రజల అభిప్రాయాలు తీసుకోవడం, పర్యావరణ పర్యవేక్షణ మాత్రం అదే స్థాయిలో లేదని ఉద్యమకారులు ఆరోపిస్తున్నారు.అక్టోబరు 10న మిలాన్‌లోని పియాజ్జా డెల్లా స్కాలా వద్ద 1,000 మందికి పైగా ప్రజలు, దాదాపు 40 స్థానిక కమిటీల ప్రతినిధులు సమావేశమయ్యారు. ఇటలీలో డేటా సెంటర్లకు వ్యతిరేకంగా నిర్వహించిన తొలి జాతీయ స్థాయి నిరసనగా నిర్వాహకులు దీన్ని అభివర్ణించారు. కొత్త ప్రాజెక్టులకు తాత్కాలికంగా అనుమతులు నిలిపివేయాలని, ఈ పరిశ్రమ విస్తరణకు జాతీయ స్థాయిలో ప్రత్యేక విధానం రూపొందించాలని డిమాండ్ చేశారు. మిలాన్ పరిసర పట్టణాల్లో వరుసగా పెరుగుతున్న ఆందోళనలకు ఇది కొనసాగింపుగా నిలిచింది.

ఐరోపాలో భారీ పెట్టుబడుల అంచనా...

2026 నుంచి 2050 వరకు ఐరోపాలో డేటా సెంటర్లపై మొత్తం 5.6 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని పీడబ్ల్యూసీ తన 'గ్లోబల్ డేటా సెంటర్ ఔట్‌లుక్ 2026-50' నివేదికలో అంచనా వేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఈ రంగంలో వచ్చే పెట్టుబడుల్లో దాదాపు 18 శాతం.ఇదే సమయంలో అమెరికాలో డేటా సెంటర్లపై 15.1 లక్షల కోట్ల డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది.

అనంతపురం కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసుల లాఠీఛార్జ్

అనంతపురం జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉద్రిక్తంగా మారింది. కౌంటింగ్ ఏజెంట్ల విషయంలో నెలకొన్న వివాదం ఘర్షణకు దారితీయడంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులు హైఅలర్ట్ ప్రకటించారు.వివరాల్లోకి వెళ్తే, ఆత్మకూరు జడ్పీటీసీ ఓట్ల లెక్కింపులో భాగంగా వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి సోదరులైన రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నయనతరెడ్డి కౌంటింగ్ ఏజెంట్లుగా వ్యవహరించడం వివాదానికి కారణమైంది. వారు కౌంటింగ్ హాల్‌లో ఉంటే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే అవకాశం ఉందని టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆమె జిల్లా ఎస్పీ జగదీశ్ దృష్టికి తీసుకెళ్లారు.దీంతో అప్రమత్తమైన పోలీసులు సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించారు. అయితే, ఈ క్రమంలో ఇరువర్గాల మద్దతుదారులు వాగ్వాదానికి దిగి, పరస్పరం దాడులు చేసుకున్నారు. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు వెంటనే లాఠీచార్జ్ చేసి, గుంపును చెదరగొట్టారు. ప్రస్తుతం కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.

అభిషేక్ బెనర్జీ ఇంటిపై దాడి.. తనను చంపేందుకేనన్న టీఎంసీ ఎంపీ



తన నివాసంపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యకర్తలు దాడి చేశారని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ అభిషేక్ బెనర్జీ సంచలన ఆరోపణలు చేశారు. కోల్‌కతాలోని కాళీఘాట్‌లో ఉన్న తన ఇంటిపై శనివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగిందని తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా ఈ దాడికి పాల్పడ్డారని, తనను హత్య చేసేందుకే ఈ ప్రయత్నం జరిగిందని ఆయన ఆరోపించారు.శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో తన ఇంటి బయట 'దొంగ' అంటూ నినాదాలు చేయడంతో ఘర్షణ మొదలైందని అభిషేక్ తెలిపారు. బీజేపీ మద్దతుదారులు ఇటుకలు, రాళ్లతో టీఎంసీ కార్యకర్తలపై దాడి చేశారని, ఈ ఘటనలో పలువురు గాయపడ్డారని చెప్పారు. దాడికి రెండు రోజుల ముందు నుంచే బీజేపీ కార్యకర్తలు తన నివాసం వద్ద రెక్కీ నిర్వహించారని, గత ఆరు నెలల్లో తనపై ఇది ఏడో హత్యాయత్నం అని ఆయన 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు. "దాడి చేసిన వారిలో కొందరి వద్ద రివాల్వర్లు ఉన్నాయి. నన్ను చంపాలనే ఉద్దేశంతోనే వారు ప్రణాళిక ప్రకారం దాడికి పాల్పడ్డారు" అని ఆయన ఆరోపించారు.ఈ దాడిలో ఒక సహోద్యోగి బొటనవేలికి తీవ్ర గాయమైందని, ప్లాస్టిక్ సర్జరీ అవసరం కావచ్చని తెలిపారు. మరొకరికి కంటి కింద ఎముక విరిగిందని వివరించారు. ఈ హింస పోలీసుల సమక్షంలోనే

మిగతా 9వ పేజీలో

ధంతేరస్ రోజున యమదీపం ఎందుకు వెలిగిస్తారు?



ధంతేరస్ పండుగను ధన్వంతరి దేవుడు, లక్ష్మీదేవి, కుబేరుడి ఆరాధనకు ప్రత్యేకమైన రోజుగా భావిస్తారు. ఈ రోజున ప్రజలు తమ ఇళ్లలో సుఖసంతోషాలు, ఐశ్వర్యం, ఆరోగ్యం, శ్రేయస్సు కలగాలని ప్రార్థిస్తారు. అయితే ధంతేరస్‌కు మరో ముఖ్యమైన సంప్రదాయం కూడా ఉంది. అదే యమదీపదానం. మృత్యుదేవుడైన యమరాజు పేరు మీద ఇంటి బయట దీపం వెలిగించడం ఈ పండుగలో ఎంతో విశిష్టమైన ఆచారంగా కొనసాగుతోంది. హిందూ మత విశ్వాసాల ప్రకారం, ధంతేరస్ రోజు సాయంత్రం యమరాజు పేరు మీద దీపం వెలిగిస్తే కుటుంబ సభ్యులకు అకాల మరణ భయం తొలగి, దీర్ఘాయువు లభిస్తుందని నమ్ముతారు. ఈ సంప్రదాయాన్ని యమ దీపదానం లేదా యమ దీపక్ అని పిలుస్తారు. అయితే ఈ ఆచారం వెనుక ఒక ఆసక్తికరమైన పౌరాణిక కథ ఉంది.

యమదీపం వెలిగించడం వెనుక ఉన్న పౌరాణిక కథ ఇదే

పురాణ గాథల ప్రకారం.. ఒక రాజుకు కుమారుడు జన్మిస్తాడు. అయితే ఆ యువరాజు జాతకాన్ని పరిశీలించిన జ్యోతిష్యులు అతని జీవితంలో ఒక ప్రమాదం పొంచి ఉందని చెబుతారు. వివాహమైన నాలుగో రోజే పాము కాటు కారణంగా అతను మరణిస్తాడని జోస్యం చెబుతారు. ఈ విషయం తెలుసుకున్న రాజు, రాణి తీవ్ర ఆందోళనకు గురవుతారు. తమ కుమారుడిని ఆ ప్రమాదం నుంచి కాపాడేందుకు ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. కాలక్రమేణా యువరాజు పెరిగి పెద్దవాడై వివాహం చేసుకుంటాడు. జ్యోతిష్యులు చెప్పినట్లుగానే పెళ్లయిన నాలుగో రోజు రానే వస్తుంది. ఈ విషయం తెలుసుకున్న యువరాజు భార్య తన భర్త ప్రాణాలను కాపాడాలని నిర్ణయించుకుంటుంది.

దీపాల వెలుగుతో యముడిని అడ్డుకున్న యువరాణి

ఆ రోజు రాత్రి యువరాణి తన భర్తను నిద్రపోకుండా జాగ్రత్తపడుతుంది. రాజభవనం ప్రధాన ద్వారం వద్ద బంగారు, వెండి ఆభరణాలు, విలువైన వస్తువులను కుప్పగా పోస్తుంది. వాటితో పాటు ఇంటి నిండా దీపాలు వెలిగిస్తుంది. రాత్రంతా భర్తకు కథలు చెబుతూ, పాటలు పాడుతూ అతడిని మేల్కొని ఉండేలా చేస్తుంది. యువరాజు ప్రాణాలను తీసుకెళ్లేందుకు యమరాజు పాము రూపంలో అక్కడికి వస్తాడని కథనం. అయితే ద్వారం వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాల మెరుపులు, దీపాల ప్రకాశం కారణంగా యముడి కళ్లకు ఏమీ కనిపించదు. లోపలికి వెళ్లే మార్గం కనిపించకపోవడంతో అతను ద్వారం వద్దే ఉండిపోతాడు. మరోవైపు యువరాణి పాడుతున్న పాటలు, చెబుతున్న కథలు వింటూ రాత్రంతా గడుపుతాడు. చివరకు తెల్లవారుజామున యమరాజు అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోతాడు. దీంతో యువరాజు ప్రాణాలు నిలుస్తాయని పురాణ గాథ చెబుతుంది. ఈ కథ ఆధారంగానే ధంతేరస్ రోజున యమరాజు పేరు మీద దీపం వెలిగించే సంప్రదాయం ప్రారంభమైందని విశ్వసిస్తారు.

ధంతేరస్ రోజున యమదీపాన్ని ఎక్కడ వెలిగించాలి?

మత విశ్వాసాల ప్రకారం యమరాజు దక్షిణ దిశకు అధిపతి. అందుకే ధంతేరస్ రోజు సాయంత్రం ఇంటి ప్రధాన ద్వారం వెలుపల దక్షిణ దిశ వైపు దీపం వెలిగిస్తారు. ఈ దీపాన్ని యముడికి సమర్పిస్తూ కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, క్షేమం కోసం ప్రార్థిస్తారు. ఇలా చేయడం వల్ల యమధర్మరాజు అనుగ్రహం లభించి, కుటుంబానికి అకాల మరణ భయం తొలగుతుందని భక్తుల నమ్మకం. స్కంద పురాణంలో కూడా కార్తీక మాస కృష్ణ షష్ఠ త్రయోదశి సాయంత్రం ఇంటి బయట యముడి పేరుతో దీపదానం చేయడం గురించి ప్రస్తావన ఉన్నట్లు చెబుతారు. అందుకే లక్ష్మీదేవి, కుబేరుడి పూజలతో పాటు యమదీపదానానికి కూడా ధంతేరస్ రోజున ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు.

దీపావళి రోజు ఇంట్లో ఈ ప్రదేశాల్లో దీపాలు వెలిగించండి..
లక్ష్మీదేవి అనుగ్రహంతో అష్ట ఐశ్వర్యాలు..



హిందూ సంప్రదాయంలో దీపావళి పండుగకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. ఈ పర్వదినాన ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. దీపాల వెలుగులు చీకటిని తొలగించడమే కాకుండా, ఇంట్లో సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యం వెల్లివిరియాలని సూచిస్తాయి. అయితే వాస్తు శాస్త్రం ప్రకారం దీపావళి రోజున ఇంట్లో కొన్ని ప్రత్యేక ప్రదేశాల్లో దీపాలు వెలిగించడం శుభప్రదంగా భావిస్తారు. మరి 2026 నవంబర్ 8, ఆదివారం దీపావళి రోజున ఏయే ప్రాంతాల్లో దీపాలు వెలిగించాలి? వాటి వెనుక ఉన్న ఆధ్యాత్మిక విశేషాలేంటో తెలుసుకుందాం.ప్రధాన ద్వారం వద్ద రెండు దీపాలు: దీపావళి రోజున ఇంటి ప్రధాన ద్వారం ఇరువైపులా రెండు దీపాలు వెలిగించాలి. ఇలా చేయడం వల్ల లక్ష్మీదేవిని ఇంట్లోకి ఆహ్వానించినట్లు భావిస్తారు. గుమ్మం వద్ద రంగవల్లులు, పూలతోరణాలు అలంకరించి శుభ్రంగా ఉంచుకోవాలి. వాస్తు ప్రకారం వెలుగులతో నిండిన ప్రధాన ద్వారం ఇంట్లోకి సానుకూల శక్తి, ఐశ్వర్యం ప్రవేశించడానికి సంకేతంగా చెబుతారు. ఈశాన్య దిశలో దీపం: వాస్తు శాస్త్రంలో ఈశాన్య దిశను అత్యంత పవిత్రమైనదిగా పరిగణిస్తారు. దీనిని ఈశాన్య కోణం లేదా ఈశాన కోణం అని పిలుస్తారు. ఈ దిశలో దీపం వెలిగించడం వల్ల ఆధ్యాత్మిక చింతన, మనశ్శాంతి, జ్ఞానం పెరుగుతాయని నమ్ముతారు. పూజా మందిరం సమీపంలో ఈ దిశకు ప్రాధాన్యత ఇవ్వవచ్చు.ఉత్తర దిశలో దీపం: ఉత్తర దిశ సంపదలకు అధిపతి అయిన కుబేరుడికి సంబంధించిన దిశగా చెబుతారు. అందుకే దీపావళి రోజున ఇంటికి ఉత్తర దిశలో దీపం వెలిగించడం శుభప్రదంగా భావిస్తారు. ఇలా చేయడం వల్ల ఆర్థిక ఇబ్బందులు తొలగి, వృత్తి, వ్యాపారాల్లో అభివృద్ధి కలుగుతుందని భక్తుల విశ్వాసం.పూజా మందిరంలో ప్రధాన దీపం: దీపావళి రోజున లక్ష్మీ గణేశుల పూజ చేసే సమయంలో పూజా మందిరంలో ప్రధాన దీపాన్ని వెలిగించాలి. మట్టి ప్రమిద లేదా లోహపు దీపంలో నెయ్యి లేదా నూనె పోసి వెలిగించవచ్చు. దీపం జ్ఞానానికి, అజ్ఞానమనే చీకటిని తొలగించడానికి ప్రతీకగా భావిస్తారు.తూర్పు దిశలో దీపం: తూర్పు దిశ సూర్యోదయానికి, కొత్త ప్రారంభాలకు, ఆరోగ్యానికి సంకేతంగా చెబుతారు. ఈ దిశలో దీపం వెలిగించడం వల్ల ఇంట్లో ఉత్సాహం, అభివృద్ధి, సానుకూలత నెలకొంటాయని వాస్తు నమ్మకం.ఆగ్నేయ దిశలో దీపం: ఆగ్నేయ దిశను అగ్నిదేవుడికి సంబంధించిన దిశగా పరిగణిస్తారు. ఈ ప్రాంతంలో దీపం వెలిగించడం వల్ల ఇంట్లో శక్తి, చైతన్యం, సమతుల్యత ఉంటాయని విశ్వసిస్తారు.తులసి మొక్క దగ్గర దీపం: హిందూ సంప్రదాయంలో తులసి మొక్కను లక్ష్మీ స్వరూపంగా భావించి పూజిస్తారు. దీపావళి సాయంత్రం తులసి కోట దగ్గర దీపం వెలిగించడం వల్ల కుటుంబానికి శుభం కలుగుతుందని నమ్ముతారు. కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థిస్తారు.వంటగదిలో దీపం: వంటగది అన్నపూర్ణాదేవికి సంబంధించిన పవిత్ర ప్రదేశంగా భావిస్తారు. దీపావళి రోజున వంట పూర్తయిన తర్వాత సురక్షితమైన ప్రదేశంలో దీపం వెలిగించి అన్నపూర్ణాదేవిని స్మరించుకోవచ్చు. ఇంట్లో అన్నపానీయాలకు లోటు లేకుండా ఉండాలని ప్రార్థిస్తారు.కిటికీలు, బాల్కనీలలో దీపాలు: ఇంటి కిటికీలు, బాల్కనీలు, పెరట్లో కూడా దీపాలు వెలిగించవచ్చు. ఇలా చేయడం వల్ల ఇల్లు మొత్తం దీపకాంతులతో కళకళలాడుతుంది.

ఏ దిశలో దీపాలు వెలిగించకూడదు?

వాస్తు సంప్రదాయాల ప్రకారం సాధారణంగా దీపావళి దీపాలంకరణకు ఈశాన్యం, ఉత్తరం, తూర్పు దిశలకు ప్రాధాన్యత ఇస్తారు. ఆగ్నేయ దిశ కూడా అగ్ని తత్వానికి సంబంధించినది. అయితే నైరుతి దిశలో సాధారణ ఐశ్వర్య దీపాలను వెలిగించకూడదని కొన్ని వాస్తు పద్ధతులు సూచిస్తాయి. దక్షిణ దిశలో దీపం వెలిగించడానికి యమ దీపం అనే ప్రత్యేక సంప్రదాయం ఉంది. ఇది ధన త్రయోదశి రోజున ఆచరించే ఆచారం.ముఖ్యంగా దీపావళి సాయంత్రం లక్ష్మీ గణేశుల పూజ సమయంలో ప్రధాన దీపాన్ని వెలిగించి, అనంతరం ఇంటి ఇతర ప్రాంతాల్లో దీపాలు పెట్టుకోవాలి. ప్రమిదలు పగలకుండా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. అలాగే తెరలు, కాగితాలు, ఇతర మండే వస్తువులకు దూరంగా దీపాలను ఉంచాలి.

బెంగాల్‌లో దీపావళి రోజున లక్ష్మీదేవికి బదులుగా కాళీదేవిని ఎందుకు పూజిస్తారు?

భారతదేశంలో దీపావళి పండుగను ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా జరుపుకుంటారు. సాధారణంగా దీపావళి అంటే లక్ష్మీదేవి పూజ, దీపాల అలంకరణ, టపాసుల సందడి గుర్తుకొస్తాయి. అయితే పశ్చిమ బెంగాల్‌లో మాత్రం ఈ పండుగకు ప్రత్యేకమైన ఆధ్యాత్మిక విశిష్టత ఉంది. ఇక్కడ దీపావళి ప్రధాన రాత్రిని కాళీ పూజ లేదా శ్యామా పూజగా జరుపుకుంటారు. సంపదకు ప్రతీకగా భావించే లక్ష్మీదేవికి బదులుగా, శక్తి స్వరూపిణి అయిన మహాకాళిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారు. అసలు బెంగాల్‌లో దీపావళి రోజున కాళీదేవిని ఎందుకు పూజిస్తారు? ఈ సంప్రదాయం వెనుక ఉన్న చరిత్ర, తాంత్రిక విశేషాలు ఏమిటో తెలుసుకుందాం.



బెంగాల్‌లోదీపావళి రోజున మహాకాళిని ఎందుకు పూజిస్తారు?

బెంగాల్‌లో కాళీ పూజకు శతాబ్దాల చరిత్ర ఉంది. హిందూ సంప్రదాయంలో కాళీదేవిని ఆదిశక్తి స్వరూపంగా, దుష్టశక్తులను సంహరించే మహాశక్తిగా కొలుస్తారు. ముఖ్యంగా కార్తీక అమావాస్య రాత్రి అమ్మవారిని పూజించడం ఇక్కడ ప్రత్యేకమైన ఆచారం. ఈ రోజున కాళీదేవి తన ఉగ్రరూపంతో దుష్టశక్తులను నాశనం చేసి, భక్తులను కాపాడుతుందని ప్రజలు విశ్వసిస్తారు. దేశంలోని చాలా ప్రాంతాల్లో దీపావళి రోజున లక్ష్మీదేవి, వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కానీ బెంగాల్‌లో మాత్రం కాళీదేవి ఆరాధనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. అమావాస్య చీకటిలో వెలుగులు నింపే దీపాలతో పాటు అమ్మవారి విగ్రహాలను అందంగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తులు ఉపవాసాలు ఉండి, ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తూ అమ్మవారి అనుగ్రహం కోసం ప్రార్థిస్తారు.

నిశిత కాలంలో ప్రత్యేక పూజలు.. ఆకట్టుకునే పండాల్స్

బెంగాల్‌లో దీపావళి రాత్రి కాళీ పూజ అత్యంత వైభవంగా జరుగుతుంది. ముఖ్యంగా అర్ధరాత్రి సమయంలో వచ్చే నిశిత కాలాన్ని పూజలకు విశేషమైన సమయంగా భావిస్తారు. ఈ సందర్భంగా కోల్‌కతాతో పాటు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో భారీ పండాల్స్ ఏర్పాటు చేస్తారు. వాటిలో మహాకాళి విగ్రహాలను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

ధంతేరస్ రోజున బంగారం కొనాలా? వెండి కొనాలా? తక్కువ బడ్జెట్‌లో..

ఈ పూజల్లో సంప్రదాయబద్ధమైన తాంత్రిక ఆచారాలకు కూడా ప్రాధాన్యత ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ప్రతీకాత్మక బలి సమర్పించే సంప్రదాయం కనిపిస్తుంది. దీపాలు వెలిగించడం, మంత్రోచ్చారణలు, ప్రత్యేక హోమాలు వంటి ఆచారాలతో రాత్రంతా పూజలు నిర్వహిస్తారు. బెంగాల్ సంస్కృతిలో కాళీ పూజ ఒక ముఖ్యమైన ఆధ్యాత్మిక వేడుకగా నిలిచింది.

కాళీ చౌదాస్‌కు శ్యామా పూజకు సంబంధం ఏమిటి?

ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో కార్తీక కృష్ణ చతుర్దశిని కాళీ చౌదాస్‌గా జరుపుకుంటారు. ఈ రోజును మహాకాళి ఆరాధనకు సంబంధించిన పవిత్రమైన రోజుగా భావిస్తారు. మరోవైపు బెంగాల్‌లో కార్తీక అమావాస్య రాత్రి ప్రధానంగా కాళీ పూజ నిర్వహిస్తారు. దీనినే శ్యామా పూజ అని కూడా పిలుస్తారు.ఈ రెండు సంప్రదాయాల్లోనూ మహాకాళి ఆరాధన, తాంత్రిక పూజా విధానాలు ప్రధానంగా కనిపిస్తాయి. అయితే పూజ నిర్వహించే రోజు, ఆచారాలు ప్రాంతీయ సంప్రదాయాలను బట్టి మారుతూ ఉంటాయి. చతుర్దశి నుంచి అమావాస్య వరకు కొనసాగే ఈ ఆధ్యాత్మిక వేడుకలు శక్తి ఆరాధనకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తాయి. ఇలా దేశమంతటా దీపావళిని వెలుగుల పండుగగా జరుపుకుంటే, బెంగాల్‌లో మాత్రం మహాకాళి ఆరాధనతో ఈ పండుగకు ప్రత్యేక గుర్తింపు లభించింది.

దీపావళి ఐదు రోజులు ఎందుకు జరుపుకుంటారు?



మొదటి రోజు ధనత్రయోదశితో ప్రారంభమయ్యే ఈ పండుగ, చివరి రోజు భాయ్ దూజ్‌తో ముగుస్తుంది. మధ్యలో నరక చతుర్దశి, లక్ష్మీపూజ, గోవర్ధన పూజ వంటి ముఖ్యమైన ఆచారాలు ఉంటాయి. ప్రాంతాలను బట్టి పండుగ పేర్లు, ఆచారాల్లో కొంత మార్పు కనిపించినప్పటికీ, ఈ ఐదు రోజుల వేడుకల వెనుక ఉన్న భావం మాత్రం ఆనందం, శుభారంభం, ఐక్యతను చాటిచెబుతుంది. మరి ఆ ఐదు రోజులు ఏవి? వాటి వెనుక ఉన్న విశేషాలు ఏమిటో తెలుసుకుందాం.

1. మొదటి రోజు -- ధనత్రయోదశి (ధన్‌తేరస్)

దీపావళి వేడుకలు ధనత్రయోదశితో ప్రారంభమవుతాయి. ఈ రోజును ధన్‌తేరస్ అని కూడా పిలుస్తారు. సంపద, ఆరోగ్యం, శుభారంభాలకు ఈ రోజును ప్రతీకగా భావిస్తారు. ఈ సందర్భంగా చాలామంది ఇళ్లను శుభ్రం చేసి అలంకరిస్తారు. బంగారం, వెండి, కొత్త పాత్రలు లేదా ఇతర వస్తువులు కొనుగోలు చేయడం శుభప్రదమనే సంప్రదాయ నమ్మకం ఉంది.ధన్వంతరి దేవుడిని కూడా ఈ రోజున పూజిస్తారు. ఆయనను ఆయుర్వేద వైద్యానికి, ఆరోగ్యానికి సంబంధించిన దేవుడిగా భావిస్తారు. కొందరు లక్ష్మీదేవి, కుబేరుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సంపదతో పాటు ఆరోగ్యం కూడా జీవితంలో ముఖ్యమనే సందేశాన్ని ఈ రోజు గుర్తుచేస్తుంది.

2. రెండో రోజు -- నరక చతుర్దశి

దీపావళి వేడుకల్లో రెండో రోజును నరక చతుర్దశి లేదా ఛోటీ దీపావళి అంటారు. పురాణ కథల ప్రకారం, శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించి అతడి చెరలో ఉన్నవారికి విముక్తి కల్పించాడు. ఈ విజయానికి గుర్తుగా నరక చతుర్దశిని జరుపుకుంటారని విశ్వసిస్తారు.ఈ రోజున తెల్లవారుజామున నూనెతో తలంటుకుని స్నానం చేయడం, ఇళ్ల ముందు దీపాలు వెలిగించడం వంటి ఆచారాలు కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి, భయం నుంచి విముక్తికి ఈ పండుగ ప్రతీకగా నిలుస్తుంది. దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో నరక చతుర్దశికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది.

3. మూడో రోజు -- దీపావళి, లక్ష్మీపూజ

ఐదు రోజుల వేడుకల్లో మూడో రోజు ప్రధానమైన దీపావళి పండుగగా చాలాచోట్ల జరుపుకుంటారు. ఈ రోజున ఇళ్లను దీపాలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తారు. ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేసి, కుటుంబ సభ్యులంతా కలిసి లక్ష్మీదేవి, వినాయకుడికి పూజలు నిర్వహిస్తారు.లక్ష్మీదేవి సంపద, ఐశ్వర్యానికి ప్రతీకగా భావిస్తారు. వినాయకుడు విఘ్నాలను తొలగించి శుభారంభాన్ని కలిగిస్తాడని భక్తుల నమ్మకం. అందుకే ఇద్దరికీ పూజలు చేసి కుటుంబానికి సుఖసంతోషాలు, అభివృద్ధి కలగాలని కోరుకుంటారు. ఈ రోజున బంధుమిత్రులకు స్వీట్లు పంచడం, కొత్త దుస్తులు ధరించడం, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం వంటి సంప్రదాయాలు కూడా ఉన్నాయి.

4. నాలుగో రోజు -- గోవర్ధన పూజ

దీపావళి తర్వాతి రోజును చాలా ప్రాంతాల్లో గోవర్ధన పూజగా జరుపుకుంటారు. శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని ఎత్తి భారీ వర్షాల నుంచి గోకుల ప్రజలను, పశువులను రక్షించాడని పురాణ కథనం. ఈ సంఘటనను గుర్తుచేసుకుంటూ గోవర్ధన పర్వతానికి పూజలు చేస్తారు.ఈ రోజున అన్నకూట్ పేరుతో వివిధ రకాల ఆహార పదార్థాలను తయారు చేసి దేవుడికి నైవేద్యంగా సమర్పించే సంప్రదాయం కూడా ఉంది. ప్రకృతి, పశుసంపద, ఆహారం మన జీవితానికి ఎంత ముఖ్యమో గుర్తుచేసే వేడుకగా దీన్ని భావిస్తారు. కొన్ని ప్రాంతాల్లో ఇదే రోజును బలి పాడ్యమి లేదా కొత్త సంవత్సర ప్రారంభ వేడుకగా కూడా జరుపుకుంటారు.

5. ఐదో రోజు -- భాయ్ దూజ్

దీపావళి ఐదు రోజుల వేడుకల్లో చివరి రోజును భాయ్ దూజ్ అంటారు. ఈ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానుబంధాలకు ప్రతీకగా నిలుస్తుంది. ఈ రోజున సోదరీమణులు తమ సోదరులకు నుదుటిపై తిలకం దిద్ది, వారు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని ప్రార్థిస్తారు. సోదరులు తమ సోదరీమణులకు బహుమతులు ఇచ్చి ప్రేమను వ్యక్తం చేస్తారు.సోదరసోదరీమణుల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలపరిచే పండుగగా భాయ్ దూజ్‌ను జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో దీనిని భాయ్ టీకా లేదా యమ ద్వితీయ అని కూడా పిలుస్తారు. ఇలా ఐదు రోజుల దీపావళి వేడుకలు సంపద, ఆరోగ్యం, ధర్మం, ప్రకృతి పట్ల కృతజ్ఞత, కుటుంబ బంధాల ప్రాధాన్యతను తెలియజేస్తాయి.

దీపావళి రోజున హనుమంతుడిని ఎందుకు పూజిస్తారు?

దీపావళి అంటేనే వెలుగులు, ఆనందం, భక్తితో నిండిన పండుగ. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ పర్వదినానికి హిందూ సంప్రదాయంలో ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. పంచాంగం ప్రకారం కార్తీక మాసంలోని కృష్ణ పక్ష చతుర్దశి, అమావాస్య రోజులు దీపావళి వేడుకల్లో ముఖ్యమైనవిగా భావిస్తారు. ముఖ్యంగా దక్షిణ భారత సంప్రదాయంలో నరక చతుర్దశి రోజున తెల్లవారుజామున చేసే అభ్యంగన స్నానానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఈ రోజున లక్ష్మీదేవిని పూజించడంతో పాటు హనుమంతుడిని కూడా భక్తిశ్రద్ధలతో ఆరాధించే సంప్రదాయం కొన్ని ప్రాంతాల్లో కనిపిస్తుంది. అసలు దీపావళి సమయంలో హనుమంతుడిని ఎందుకు పూజిస్తారు?



శ్రీరాముడి వరం వల్లేనా?

పౌరాణిక విశ్వాసాల ప్రకారం రావణుడిని సంహరించిన అనంతరం 14 ఏళ్ల వనవాసాన్ని పూర్తి చేసుకుని శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చాడు. ఆయన రాకను పురస్కరించుకుని అయోధ్య ప్రజలు నగరమంతా దీపాలను వెలిగించి ఘనంగా స్వాగతం పలికారు. శ్రీరాముడి విజయానికి, అయోధ్యకు ఆయన తిరిగి రావడానికి గుర్తుగా కూడా దీపావళి జరుపుకుంటారని విశ్వాసం. శ్రీరాముడికి అత్యంత ప్రీతిపాత్రుడైన హనుమంతుడు తన స్వామి కోసం చేసిన నిస్వార్థ సేవ, అచంచలమైన భక్తికి మెచ్చిన శ్రీరాముడు అతనికి వరం ఇచ్చాడని ఒక పౌరాణిక కథనం చెబుతుంది. పవిత్రమైన దీపావళి రోజున తమతోపాటు హనుమంతుడిని కూడా భక్తులు పూజిస్తారని శ్రీరాముడు వరమిచ్చినట్లు చెబుతారు.

ప్రతికూల శక్తుల నుంచి రక్షణ

హనుమంతుడు దుష్టశక్తులను, భయాలను తొలగించే దేవుడిగా భక్తులు విశ్వసిస్తారు. నరక చతుర్దశి రోజున హనుమంతుడిని పూజించడం వల్ల ఇంట్లో ప్రతికూలత తొలగి, శాంతి, ప్రశాంతత నెలకొంటాయని ఆధ్యాత్మిక విశ్వాసం. అలాగే ఆరోగ్యం, ధైర్యం, ఆత్మవిశ్వాసం కలుగుతాయని భక్తులు నమ్ముతారు.

హనుమంతుడి జన్మదినంతో సంబంధం

దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలతో పాటు ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రసిద్ధ హనుమాన్ ఆలయాల్లో నరక చతుర్దశి రోజున హనుమంతుడి జన్మదిన వేడుకలను నిర్వహించే సంప్రదాయం ఉంది. అందువల్ల ఈ రోజు హనుమాన్ భక్తులకు మరింత పవిత్రమైనదిగా భావిస్తారు.

శివుడి రుద్ర అవతారంగా హనుమంతుడు

హనుమంతుడిని శివుని 11వ రుద్ర అవతారంగా భావించే సంప్రదాయం కూడా ఉంది. శ్రీరాముడు విష్ణువు అవతారంగా భావించబడటంతో, హనుమంతుడు శివాంశంతో శ్రీరాముడికి సేవ చేసినట్లు పౌరాణిక కథనాలు చెబుతాయి. అందువల్ల హనుమంతుడిని పూజించడం ద్వారా శివుడు, విష్ణువు ఇద్దరి అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసం.

శని దోషాల నుంచి ఉపశమనం

హనుమంతుడికి శని దేవుడితో కూడా ప్రత్యేకమైన పౌరాణిక సంబంధం ఉంది. రావణుడి చెర నుంచి హనుమంతుడు శనిదేవుడిని విడిపించాడని కథనం. అందుకు కృతజ్ఞతగా శని దేవుడు హనుమంతుడిని భక్తితో పూజించే వారికి తన దుష్ప్రభావాలు ఎక్కువగా ఉండవని వరమిచ్చాడని నమ్మకం. అందుకే శనివారం హనుమంతుడిని పూజించడం శని బాధల నుంచి ఉపశమనాన్ని ఇస్తుందని భక్తులు విశ్వసిస్తారు.ఈ విధంగా దీపావళి సమయంలో హనుమంతుడిని పూజించడం భక్తి, ధైర్యం, రక్షణకు ప్రతీకగా భావిస్తారు. హనుమంతుడి అనుగ్రహంతో ఇంట్లో శాంతి, సానుకూలత, శుభం నెలకొంటాయని విశ్వాసం.

దీపావళి రోజు తలంటు స్నానం ఎందుకు చేస్తారు?

దీపావళి పండుగ అనగానే దీపాల వెలుగులు, పూజలు, పిండి వంటలు, కొత్త బట్టలు గుర్తుకొస్తాయి. అయితే ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో దీపావళి రోజున తెల్లవారుజామునే నూనె స్నానం (తలంటు స్నానం) చేయడం ఒక ముఖ్యమైన సంప్రదాయంగా కొనసాగుతోంది. ముఖ్యంగా దక్షిణాది ఆచారాల్లో ఈ నూనె స్నానానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఈ సంప్రదాయం నరక చతుర్దశితో ముడిపడి ఉందని నమ్ముతారు. హిందూ పురాణాల ప్రకారం, శ్రీకృష్ణుడు నరకాసురుడు అనే రాక్షసుడిని సంహరించిన రోజును నరక చతుర్దశిగా జరుపుకుంటారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా భావించే ఈ రోజున ప్రజలు తెల్లవారుజామున నిద్రలేచి నూనెతో శరీరానికి మర్దన చేసుకుని స్నానం చేస్తారు. అనంతరం కొత్త బట్టలు ధరించి, భగవంతుడిని పూజించి దీపావళి వేడుకలను ప్రారంభిస్తారు.దీపావళి రోజు ఉదయాన్నే చేసే నూనె స్నానానికి ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక విశ్వాసం ఉంది. ఆ రోజున శరీరానికి రాసుకునే నూనెలో లక్ష్మీదేవి, స్నానం చేసే నీటిలో గంగాదేవి కొలువై ఉంటారని నమ్ముతారు. అందుకే దీపావళి రోజు తెల్లవారుజామున నూనె స్నానం చేయడం గంగానదిలో పవిత్ర స్నానం చేసినంత పుణ్యాన్ని అందిస్తుందని సంప్రదాయ విశ్వాసం.నూనెతో శరీరానికి మర్దన చేసి స్నానం చేయడం కేవలం ఆధ్యాత్మిక ఆచారంగానే కాకుండా శారీరక సంరక్షణలోనూ భాగంగా భావిస్తారు. నూనె మర్దన చర్మంలో తేమను నిలుపుకోవడానికి సహాయపడుతుంది. శరీరానికి విశ్రాంతిని కలిగించి, పండుగ రోజును ఉత్సాహంగా ప్రారంభించేందుకు ఉపకరిస్తుందని సంప్రదాయంగా భావిస్తారు. అయితే ఆరోగ్యపరమైన ప్రయోజనాలు వ్యక్తి శరీర స్వభావం, చర్మ పరిస్థితిని బట్టి మారవచ్చు. అంతేకాదు, నూనె స్నానం చెడును తొలగించి మంచిని ఆహ్వానించడానికి ప్రతీకగా కూడా భావిస్తారు. గతంలోని ప్రతికూలతలను విడిచిపెట్టి, కొత్త ఆశలు, సానుకూల ఆలోచనలతో జీవితాన్ని ప్రారంభించాలనే సందేశాన్ని ఈ ఆచారం అందిస్తుంది.అందుకే దీపావళి రోజు తెల్లవారుజామున నూనె స్నానం చేసి, కొత్త బట్టలు ధరించి, భగవంతుడిని పూజించడం అనేక కుటుంబాల్లో ఇప్పటికీ కొనసాగుతున్న సంప్రదాయంగా ఉంది. ఆధ్యాత్మిక విశ్వాసం, పౌరాణిక సంప్రదాయం, శారీరక శ్రేయస్సు..

కొచ్చి దాడి కేసులో అనూహ్య మలుపు.. బాధితుడైన డాక్టరేపైనే రేప్ కేసు



కొచ్చిలో నటి దాడి, దోపిడీ కేసు సంచలన మలుపు తిరిగింది. ఈ ఘటనలో దాడికి గురై బాధితుడిగా ఉన్న డాక్టరేపైనే పోలీసులు అత్యాచారం కేసు నమోదు చేశారు. నిందితురాలిగా ఉన్న నటి బంధువు ఒకరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. డాక్టర్ సదరు నటికి మత్తుమందు ఇచ్చి లైంగిక దాడికి పాల్పడ్డాడని తన ఫిర్యాదులో ఆరోపించారు.నవంబర్ 2న కొచ్చిలోని ఒక ఫ్లాట్‌లో తనపై దాడి, దోపిడీ జరిగిందని ఓ డాక్టర్ పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. తన అత్తకు వైద్యం అందించాలనే నెపంతో ఫ్లాట్‌కు పిలిపించి, తనను నిర్బంధించి, తీవ్రంగా కొట్టారని ఆయన పేర్కొన్నారు. సుమారు రూ.3 లక్షల విలువైన రెండు మొబైల్ ఫోన్లను దోచుకున్నారని ఫిర్యాదులో తెలిపారు. నిందితులు తనపై దాడి చేస్తూ, తనను చంపేస్తామని బెదిరించారని కూడా ఆయన వివరించారు.డాక్టర్ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నవంబర్ 4న భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో నటితో పాటు మొత్తం 12 మందిని నిందితులుగా చేర్చారు. దర్యాప్తులో భాగంగా నటితో సహా ముగ్గురిని అరెస్ట్ చేశారు.ఈ పరిణామాల మధ్య, నటి బంధువు డాక్టర్‌పై ఫిర్యాదు చేయడంతో కేసు కొత్త మలుపు తీసుకుంది. పోలీసులు రెండు కేసులపైనా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో అగ్నిప్రమాదం ... నాలుగు బోగీలకు మంటలు.. ప్రయాణికుల్లో తీవ్ర భయాందోళనలు

అమృత్‌సర్ నుంచి న్యూ జల్పాయ్‌గురి వెళుతున్న కర్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. రైలులోని నాలుగు బోగీలకు మంటలు వ్యాపించడంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అయితే ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం, గాయాలు సంభవించినట్లు సమాచారం లేదు.రైలు నంబర్ 12508 కర్మభూమి ఎక్స్‌ప్రెస్ అమృత్‌సర్ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే పంజాబ్‌లోని సరాయ్ బంజారా రైల్వే స్టేషన్ సమీపంలో మంటలు చెలరేగాయి. ఇంజిన్ నుంచి లెక్కిస్తే ఐదో బోగీలో తొలుత మంటలు కనిపించాయి. ఆ తర్వాత మరో మూడు బోగీలకూ వ్యాపించాయి.సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, అత్యవసర సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బోగీల నుంచి మంటలు, దట్టమైన పొగలు వెలువడుతున్న దృశ్యాలు బయటకు వచ్చాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగి ఉండొచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే ప్రమాదానికి కచ్చితమైన కారణం ఇంకా అధికారికంగా నిర్ధారణ కాలేదు. ఘటనపై రైల్వే అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

వేముల వాడలో హృదయవిదారక ఘటన

బతికుండగానే శ్మశానంకు తరలించిన కుటుంబ సభ్యులు..



ఇటీవల సమాజంలో చాలా అమానవీయ ఘటనలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. డబ్బుల కోసం ఎంతకైన దిగజారుతున్నారు. రక్త సంబంధాలు అని కూడా చూడటంలేదు. డబ్బుల కోసం ఎంతకైన దిగజారుతున్నారు. డబ్బుల విషయంలో గొడవలు పడి, హత్యలకు కూడా వెనుకాడటంలేదు. ఈ క్రమంలో కట్టుకున్న వారిపై, కన్నవారిపై దాడుల ఘటనలు ఎక్కువగా వార్తలలో ఉంటున్నాయి. పొరపాటున ఎవరైన ఆస్పత్రిలో చేరితో ఇక వారి వైద్యానికి డబ్బులు లేకుంటే వారి ప్రాణాలు గాల్లో కలవాల్సిందే. ఈ నేపథ్యంలో రాజన్న సిరిసిల్లాలోని వేముల వాడలో తీవ్ర విషాదకర ఘటన వెలుగులోకి వచ్చింది.రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ వైకుంఠధామంలో హృదయవిదారక ఘటన వెలుగులోకి వచ్చింది. చందుర్తి మండలం కిష్టంపేటకు చెందిన అమృత గత ఐదేళ్లుగా వేములవాడలో నివాసం ఉంటున్నారు. వారి బిడ్డ గత కొన్నేళ్లుగా జాండిస్ తో ఇబ్బందులు పడుతున్నాడు. ఇప్పటి వరకు రాకేష్ వైద్యం కోసం రూ.10 లక్షలు ఖర్చు చేసి అప్పులపాలయ్యారు.ఇక చేసిన అప్పులు తీర్చలేక, ఇంటి అద్దె చెల్లించలేని పరిస్థితిలో బతికుండగానే కుమారుడితో కలిసి శ్మశానవాటికకు చేరుకున్నారు. జాండీస్‌తో పాటు శ్వాస సంబంధిత సమస్యలతో తీవ్ర ఇబ్బందులు క్రమంగా తగ్గక పోగా మరీ ఎక్కువైంది. దీంతో శ్మశాన వాటికలోనే ఉంటున్నారు. ఈ ఘటన స్థానికంగా వార్తలలో నిలిచింది. దీనిపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం ఏదైన సాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రియుడి మోజులో భర్తను హతమార్చిన భార్య..

శవాన్ని ఎడ్లబండిపై తీసుకెళ్లి పడేసి ఇద్దరూ పరారీ



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో దారుణ హత్య వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడనే కారణంతో భార్య తన ప్రియుడితో కలిసి అతడిని హత్య చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. ఇంట్లోనే భర్తను హతమార్చిన భార్య, ఆమె ప్రియుడు.. అతడి మృతదేహాన్ని సంచిలో మూటకట్టి ఎడ్లబండిపై తరలించి గ్రామ శివారులో రోడ్డు పక్కన పడేసినట్లు సమాచారం. ఈ ఘటన భూపాలపల్లి మండలం గొల్లబుద్ధారం తండాలో జరిగింది. పోలీసులు, స్థానికులు వెల్లడించిన వివరాల ప్రకారం.. గొల్లబుద్ధారం తండాకు చెందిన అజ్మీర చందు నాయక్ (40), పావనికి 2014లో పెళ్లి జరిగింది. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.అయితే కొంతకాలంగా అదే ప్రాంతానికి చెందిన ధరావత్ సంతోష్‌తో పావనికి వివాహేతర సంబంధం కొనసాగుతున్నట్లు స్థానికులు వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న అజ్మీర చందు నాయక్.. ఆ విషయంలో తన భార్య పావనిని పలుమార్లు నిలదీయడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే భర్త తమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన పావని.. తన ప్రియుడు సంతోష్‌తో కలిసి అతడిని అంతమొందించేందుకు పథకం వేసినట్లు ప్రాథమిక విచారణలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ వ్యవహారంపై 3 రోజుల క్రితం గ్రామంలో పంచాయతీ నిర్వహించేందుకు పెద్దలు నిర్ణయించారు. వారిద్దరూ కలిసి స్థానిక సర్పంచ్ వద్దకు వెళ్లగా శుక్రవారం రోజున పంచాయతీ పెట్టేందుకు సమయం కేటాయించినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం బయటపడుతుందనే భయంతో నిందితులు ముందుగానే హత్యకు పాల్పడ్డారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట సమయంలో చందు నిద్రిస్తున్న వేళ పావని తన ప్రియుడు సంతోష్‌ను ఇంటికి పిలిపించుకున్నట్లు తెలుస్తోంది. ఇద్దరూ కలిసి చందుపై దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో అనుమానిస్తున్నారు.హత్య అనంతరం మృతదేహాన్ని సంచిలో మూటకట్టి ఎడ్లబండిపై తరలించినట్లు తెలుస్తోంది. చికెన్‌పల్లి సమీపంలోని రోడ్డు పక్కన మృతదేహాన్ని పడేసి అక్కడి నుంచి నిందితులు వెళ్లిపోయినట్లు సమాచారం. ఉదయం అటుగా వెళ్తున్న ప్రయాణికులు అనుమానాస్పదంగా ఉన్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనతో గొల్లబుద్ధారం తండాలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి.సమాచారం అందుకున్న భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, భూపాలపల్లి సీఐ శ్రీనివాస్, గణపురం సీఐ కరుణాకర్‌రావు, ఎస్సై పవన్‌తో పాటు పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు సంబంధించిన ఆధారాలను సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు నిందితులుగా అనుమానిస్తున్న పావని, సంతోష్‌ల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ హత్య వెనుక అసలు కారణాలు, నిందితుల పాత్ర, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల సమగ్ర దర్యాప్తులో వెల్లడికానున్నాయి. కట్టుకున్న భర్తనే భార్య హత్య చేసినట్లు వస్తున్న ఆరోపణలు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

భార్య హత్యాయత్నం వెనుక చాట్‌జీపీటీ.. ఓపెన్‌ఏఐపై కోర్టుకెక్కిన భర్త



అమెరికాలో ఒక సంచలనాత్మకమైన కేసు నమోదైంది. తన భార్య తనను హత్య చేయడానికి ప్రయత్నించిందని, ఈ కుట్రలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చాట్‌బాట్ అయిన చాట్‌జీపీటీ సాయం తీసుకుందని ఆరోపిస్తూ ఒక వ్యక్తి శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన ఓపెన్‌ఏఐ సంస్థపై దావా వేశాడు. ఈ కేసులో ఓపెన్‌ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్‌ను కూడా ప్రతివాదిగా చేర్చడం గమనార్హం.'బ్లూమ్‌బర్గ్' నివేదిక ప్రకారం.. నార్త్ కరోలినాకు చెందిన జేమ్స్ గేట్స్, తన భార్య చెరిల్ గేట్స్‌తో విడాకుల చర్చలు జరుగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. తనను విషం పెట్టి చంపేందుకు చెరిల్ ప్రయత్నించిందని, దీనికి సంబంధించిన పూర్తి ప్రణాళికను చాట్‌జీపీటీ సహాయంతో రూపొందించిందని జేమ్స్ తన ఫిర్యాదులో ఆరోపించారు.

చేతిరాత నోట్‌తో బయటపడిన కుట్ర

2025 సెప్టెంబర్‌లో, తీవ్ర అనారోగ్యానికి గురైన కొన్ని నెలల తర్వాత, జేమ్స్ తన భార్యకు చెందిన చేతిరాత నోట్‌ను కనుగొన్నారు. ఆ నోట్‌లో కొన్ని రకాల విషపదార్థాల పేర్లు, వాటిని ఎంత మోతాదులో ఇవ్వాలో రాసి ఉంది. ఆ నోట్ పైభాగంలో "చాట్‌జీపీటీ సంభాషణలన్నీ తొలగించు", "లాగ్ అవుట్ చేయి" వంటి సూచనలు ఉండటంతో జేమ్స్‌కు అనుమానం బలపడింది. అంతకుముందు జేమ్స్ గుండె సంబంధిత లక్షణాలు, తీవ్రమైన కడుపునొప్పి, బలహీనత, స్పృహ తప్పేంత గందరగోళంతో బాధపడినట్లు తెలిపారు. ఈ ఆధారాలతో ఆయన పోలీసులను ఆశ్రయించారు.

భార్యపై కేసు కొట్టివేత

జేమ్స్ ఫిర్యాదు మేరకు చెరిల్ గేట్స్‌పై హత్యాప్రయత్నం, ఆహారంలో విషం కలపడం వంటి అభియోగాలతో 2025లో కేసు నమోదైంది. అయితే, తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ ఈ ఏడాది ఏప్రిల్‌లో ప్రాసిక్యూటర్లు ఆమెపై కేసును కొట్టివేశారు. దీంతో జేమ్స్ గేట్స్ నేరుగా ఓపెన్‌ఏఐ సంస్థపైనే దావా వేశారు.

చాట్‌జీపీటీ ఎలా సాయం చేసిందంటే..

దావా ప్రకారం చెరిల్ తన వృత్తిపరమైన పనులకు, ఇంటి పనులకు సంబంధించిన ప్రశ్నలకు మొదట్లో చాట్‌జీపీటీని వాడేవారు. క్రమంగా తమ మధ్య ఉన్న విభేదాల గురించి చాట్‌బాట్‌తో చెప్పుకోవడం మొదలుపెట్టారు. "తన భర్త తనపై నిఘా పెట్టాడని, తమను వదిలేసి వెళ్లిపోతాడనే భ్రమలను, అపనమ్మకాన్ని చాట్‌జీపీటీ మరింత పెంచి, ఒక ఎకో ఛాంబర్‌లా పనిచేసింది" అని దావాలో పేర్కొన్నారు.అనంతరం ఒలియాండర్ మొక్క విషపూరితమా? అని ఆమె చాట్‌జీపీటీని అడిగినట్లు తెలుస్తోంది. తన భర్త ఆ ఆకులను తనకు తెలియకుండా తినిపించవచ్చని, ఆత్మరక్షణ కోసం సమాచారం అడుగుతున్నట్లు ఆమె చాట్‌బాట్‌ను నమ్మించింది. ఎంత మోతాదు ప్రాణాంతకం, దానిని ఎలా దాచాలి వంటి వివరాలను చాట్‌జీపీటీ ఆమెకు అందించినట్లు దావాలో పొందుపరిచిన స్క్రీన్‌షాట్లు చూపిస్తున్నాయి. ఒక దశలో.. "శవపరీక్షలో ఒలియాండర్ ఆనవాళ్లు బయటపడతాయా?" అని ఆమె అడగ్గా, "ఇది చాలా కీలకమైన ప్రశ్న – మీరు సరైన కారణంతోనే అడుగుతున్నారు" అని చాట్‌జీపీటీ సమాధానం ఇచ్చినట్లు స్క్రీన్‌షాట్‌లో ఉంది.

ఓపెన్‌ఏఐ స్పందన

ఈ కేసుపై స్పందించిన ఓపెన్‌ఏఐ, భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తామని తెలిపింది. ఈ కేసులో దర్యాప్తు చేస్తున్న అధికారులకు తాము సమాచారం అందించామని, ఆ యూజర్‌ను (చెరిల్ గేట్స్‌ను) తమ ప్లాట్‌ఫామ్ నుంచి నిషేధించామని ఒక ప్రకటనలో పేర్కొంది. గతంలో ఇలాంటి కేసుల్లో, చాట్‌బాట్‌లు సృష్టించే కంటెంట్ వాక్ స్వాతంత్ర్యం కిందకు వస్తుందని, వినియోగదారులు చేసే నేరాలకు తమకు ప్రత్యక్ష బాధ్యత లేదని ఏఐ కంపెనీలు వాదించాయి.

'నా భార్యను చంపలేదు.. మృతదేహాన్ని ముక్కలుగా చేశా..' కోర్టులో వ్యక్తి సంచలన వాంగ్మూలం



అమెరికాలో భారత సంతతికి చెందిన నరేష్ భట్ కేసు మరోసారి సంచలనంగా మారింది. తన భార్య మమతా కాఫ్లే భట్ ఆత్మహత్య చేసుకుందని.. ఆమె మరణించిన తర్వాత తాను మృతదేహాన్ని ముక్కలుగా చేసి చెత్తబుట్టలో పడేసేందుకు ప్రయత్నించానని నరేష్ కోర్టుకు చెప్పాడు. తాను ఇంటికి వెళ్లేలోపు రూమ్‌లో మంచం పక్కన నేలపై తన భార్య మమత అపస్మారక స్థితిలో పడి ఉందని.. ఆమె మాత్రలు, అత్యంత విషపూరితమైన పురుగుల మందును తాగిన తర్వాత ఆమె శరీరం చుట్టూ వాంతి ఉందని కోర్టుకు తెలిపాడు. మరోవైపు భార్యను హత్య చేసి.. ఆధారాలు మాయం చేసేందుకు ప్రయత్నించాడన్నది ప్రాసిక్యూషన్ ఆరోపిస్తోంది. ఈ కేసులో తాజాగా నరేష్ ఇచ్చిన వాంగ్మూలం చర్చనీయాంశంగా మారింది. ఈ కేసు వివరాలు ఇలా..నరేష్ భట్, మమతా కాఫ్లే భట్ దంపతులు. వీరు అమెరికాలోని వర్జీనియా రాష్ట్రం మనస్సాస్ పార్క్‌లో నివసించేవారు. మమత అక్కడ నర్సుగా పనిచేసేది. 2024 జూలై 30న తెల్లవారుజామున తన భార్య బెడ్‌రూమ్‌లో అపస్మారక స్థితిలో కనిపించిందని నరేష్ కోర్టులో చెప్పాడు. ఆమె చుట్టూ వాంతులు ఉన్నాయని, వాటిలో రక్తం, ఆహార పదార్థాలు, ట్యాబ్లెట్స్ క్యాప్సూల్స్ కనిపించాయని వివరించాడు. ఆమె దగ్గరే విషపూరితమైన సెల్ఫోస్ పురుగుల మందు ప్యాకెట్ కూడా తెరిచి ఉందన్నాడు. తాను చూసిన వెంటనే ఆమెను బతికించేందుకు దాదాపు గంటపాటు సీపీఆర్ సహా వివిధ ప్రయత్నాలు చేశానని తెలిపాడు. అయితే పరిస్థితి విషమించడంతో ఆమె చనిపోయిందని భావించినట్లు చెప్పాడు. ఆ సమయంలో పోలీసులకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించగా.. భయాందోళనకు గురయ్యానని సమాధానమిచ్చాడు.

మృతదేహాన్ని ముక్కలుగా చేసి..

భార్య మరణించిన తర్వాత ఏం చేయాలో తెలియక మొదట ఆమె మృతదేహాన్ని పోటోమాక్ నదిలో పడేయాలని భావించినట్లు నరేష్ కోర్టులో చెప్పాడు. ఇందుకోసం అవసరమైన వస్తువుల కోసం దుకాణాలకు కూడా వెళ్లినట్లు వివరించాడు. అనంతరం మృతదేహాన్ని చెత్త బుట్టలో వేయాలని ప్రయత్నించగా.. అది అందులో పట్టలేదని తెలిపాడు. దీంతో రంపం, కత్తుల సాయంతో మృతదేహాన్ని ముక్కలుగా చేయాలని ప్రయత్నించినట్లు అంగీకరించాడు. అయితే ముందుగా తాను ఆ పని పూర్తి చేయలేకపోయానని కోర్టులో చెప్పాడు. తరువాతి రోజు కూడా ఈ ప్రయత్నం కొనసాగించి మృతదేహాన్ని చెత్త సంచుల్లో ఉంచి డస్ట్‌బిన్‌లో పడేసినట్లు తన వాంగ్మూలంలో వివరించాడు.మరోవైపు నరేష్ తన భార్యను హత్య చేసి.. మృతదేహాన్ని మాయం చేశాడని ప్రాసిక్యూషన్ ఆరోపిస్తోంది. ఇంట్లోని బెడ్‌రూమ్, బాత్రూమ్‌లలో రక్తపు మరకలు కనిపించడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అంతేకాకుండా ఓ రంపంపై లభించిన రక్తం.. మమత రక్తం అయి ఉండే అవకాశం ఉందని ఫోరెన్సిక్ నిపుణులు కోర్టులో వెల్లడించారు. మమత కనిపించకుండా పోయిన తర్వాత ఆమెను వెతికేందుకు పోలీసులు అన్ని విధాలుగా ప్రయత్నించారు. అయితే ఇప్పటివరకు ఆమె మృతదేహం లభించలేదు. ఈ కేసులో నరేష్‌పై హత్య, మృతదేహాన్ని దాచడం, దానికి అవమానం కలిగించడం వంటి అభియోగాలు నమోదయ్యాయి. తాను నిర్దోషినని.. హత్య చేయలేదని నరేష్ వాదిస్తున్నాడు. ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోంది.

చంపిన స్నేహితుడి ఆత్మ వెంటాడుతోంది...

భయంతో పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు



థానే: నేరం చేసిన తర్వాత పోలీసుల నుంచి తప్పించుకోవచ్చు. కానీ తన మనసు నుంచి తప్పించుకోలేము. హత్య చేసిన తరువాత కలలోకి వచ్చి స్నేహితుడి ఆత్మ భయపెడుతుండడంతో నిందితుడు పోలీస్ స్టేషన్ లో లొంగిపోయాడు. ఈ సంఘటన మహారాష్ట్రలోని థానేలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పల్లవ్ అలియాస్ విశాల్ మధుకర్ కదమ్ (43), ప్రభు కర్కడే అనే ఇద్దరూ స్నేహితులు కలిసి తిరిగారు, కలిసి తాగారు. కానీ ఒక రాత్రి మద్యం మత్తులో వచ్చిన చిన్న గొడవ పెద్దదైంది. కోపంలో ప్రభు తన స్నేహితుడినే కొట్టి చంపేశాడు. అనంతరం శవాన్ని సంచిలో కట్టి కోపర్ లింక్ రోడ్ పక్కన గడ్డిలో పడేశాడు. పోలీసులకు దొరకనని అనుకున్నాడు. రెండు వారాల తర్వాత మోథా గ్రామంలో శవం దొరికింది. కానీ అప్పటికే ప్రభు మనసులో అసలైన శిక్ష మొదలైపోయింది. ప్రతి రాత్రి పల్లవ్ కలలోకి వచ్చేవాడట. "ఎందుకు చంపావు?" అని అడుగుతున్నట్లు అనిపించేదట. నిద్ర లేదు. శాంతి లేదు. భయంతో వణికిపోయాడు. చివరకు నవంబర్ 2న తట్టుకోలేక తానే విష్ణు నగర్ పోలీస్ స్టేషన్ కు వెళ్లాడు. "నేనే చంపాను. నన్ను అరెస్ట్ చేయండి. నా కలలోకి వచ్చి భయపెడుతున్నాడు" అని చెప్పి లొంగిపోయాడు. పోలీసులు భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 103(1) కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసు చెబుతున్న నిజం ఒక్కటే – తప్పు చేసిన తర్వాత శిక్ష కోర్టులో కాదు, ముందు మన మనసులోనే మొదలవుతుంది. మృతుడి ఆత్మకు శాంతి కలగడంతో పాటు నిందితుడి మనసుకు శిక్ష పడింది.

ఉదయం పోలీసులకు ఫిర్యాదు.. సాయంత్రానికి రక్తపాతం ... గగుర్పొడిచే క్రైం కథ

కుటుంబ వివాదాలు ఎంతటి విషాదానికి దారితీస్తాయో హైదరాబాద్‌లోని మీర్‌పేటలో జరిగిన జంట హత్యలు మరోసారి నిరూపించాయి. భర్త వేధిస్తున్నాడని, తన కుటుంబ సభ్యుల ప్రాణాలకు ముప్పు ఉందని ఓ మహిళ అదే రోజు ఉదయం పోలీసులను ఆశ్రయించింది. కానీ ఆమె భయపడినట్లుగానే సాయంత్రానికి ఘోరం జరిగిపోయింది. అత్త, బావమరిది కత్తి దాడిలో ప్రాణాలు కోల్పోగా.. మరో మహిళ తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. హైదరాబాద్ నగరంలో కుటుంబ కలహాలు ఎంతటి భయానక పరిణామాలకు దారితీస్తున్నాయో మీర్‌పేటలో వెలుగుచూసిన జంట హత్యల ఘటన ఆందోళన కలిగిస్తోంది. ఇంట్లో మొదలైన చిన్నపాటి వివాదాలు, అవమానాలు, పరస్పర గొడవలు చివరకు రెండు నిండు ప్రాణాలను బలిగొన్నాయి. ఈ ఘటనలో మరింత కలచివేసే అంశం ఏమిటంటే.. హత్యలు జరగడానికి కొన్ని గంటల ముందే బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించడం.పోలీసుల వివరాల ప్రకారం.. షరీఫ్‌నగర్‌కు చెందిన మహమ్మద్ సిద్ధిఖీ, నూర్ బేగం దంపతుల మధ్య గత కొంతకాలంగా తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్త వేధింపులు భరించలేక నూర్ బేగం నవంబర్ 4న పుట్టింటికి వెళ్లిపోయింది. అంతేకాకుండా అదే రోజు ఉదయం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన భర్త బెదిరింపులకు పాల్పడుతున్నాడని, తన కుటుంబ సభ్యుల ప్రాణాలకు ప్రమాదం ఉందని ఫిర్యాదు చేసింది.ఒకవైపు కుటుంబాన్ని కాపాడుకోవాలనే ఆందోళన.. మరోవైపు భర్త నుంచి ఎదురవుతున్న బెదిరింపులతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. అయితే, ఈ ఫిర్యాదు చేసిన కొద్ది గంటలకే పరిస్థితి దారుణంగా మారింది.

అవమానమే ఆగ్రహానికి కారణమైందా?

పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం.. పెద్దల సమక్షంలో తనను అవమానించారనే కోపంతో సిద్ధిఖీ తీవ్ర ఆగ్రహానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ కక్షతోనే ముగ్గురిని హత్య చేయాలని ముందుగానే పథకం వేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అదే రోజు సాయంత్రం అత్తింటికి చేరుకున్న సిద్ధిఖీ కత్తితో కుటుంబ సభ్యులపై విచక్షణారహితంగా దాడి చేశాడు.ఈ దాడిలో అత్త నిరంజన్ బి, బావమరిది మహమ్మద్ యూసుఫ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. యూసుఫ్ భార్య మహమ్మద్ రేష్మా (39) కూడా తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతోంది.ఈ ఘటనలో పోలీసుల దృష్టిని ఆకర్షిస్తున్న ప్రధాన అంశం ఉదయం అందిన ఫిర్యాదు, సాయంత్రం జరిగిన హత్యల మధ్య ఉన్న పరిణామాలు. బాధితురాలు తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని ముందుగానే హెచ్చరించినప్పటికీ, దాడిని అడ్డుకోలేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. ఫిర్యాదు అందిన తర్వాత తీసుకున్న చర్యలు, నిందితుడి కదలికలు, ఘటనకు ముందు జరిగిన పరిణామాలపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.జంట హత్యల ఘటనపై కేసు నమోదు చేసిన మీర్‌పేట పోలీసులు దర్యాప్తు చేపట్టి ప్రధాన నిందితుడు మహమ్మద్ సిద్ధిఖీని అరెస్ట్ చేశారు. అతడి నుంచి హత్యకు ఉపయోగించిన కత్తి, మారుతి వాగనార్ కారు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.కుటుంబ వివాదాలు, వ్యక్తిగత కక్షలు, ఆవేశపూరిత నిర్ణయాలు చివరకు ప్రాణాలను బలిగొంటున్నాయి. అయితే ఈ ఘటనలో మరోసారి ముందస్తు పోలీసు ఫిర్యాదుల ప్రాధాన్యత, ప్రాణహాని ఉందని బాధితులు చెప్పినప్పుడు తీసుకోవాల్సిన తక్షణ రక్షణ చర్యలపై చర్చ మొదలైంది. ఒక మహిళ వ్యక్తం చేసిన భయం నిజమై, ఒకే రోజు రెండు కుటుంబ సభ్యుల ప్రాణాలు గాల్లో కలిసిపోవడం తీవ్ర విషాదం.

PRINTED, PUBLISHED AND OWNED BY K.B.G.TILAK, PRINTED AT LAKSHMI OFFSET PRINTERS, CHUTTUGUNTA, VIJAYAWADA, AND PUBLISHED FROM VIJAYAWADA, D.NO.28-1-22, II FLOOR, SHAIK MOHIUDDEEN STREET, ARUNDELPET, VIJAYAWADA-520 002. EDITOR : K.B.G.TILAK. PH : 0866 - 6620870. R.N.I.NO.APTEL/1999/1614

ఎవరూ లెక్క చేయట్లేదు.. హైకమాండ్‌కు పీసీసీ చీఫ్ లేఖ



తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, నేతల మధ్య సమన్వయ లోపం మరోసారి ఢిల్లీకి చేరాయి. పార్టీని క్రమశిక్షణతో నడపాల్సిన పీసీసీ చీఫ్ పదవిలో ఉన్నప్పటికీ.. సీనియర్ నేతలు తనను ఏమాత్రం లెక్కచేయడం లేదన్న తీవ్ర అసహనం, నిస్సహాయతతో పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ఏఐసీసీ నాయకత్వానికి ప్రత్యేక నివేదికను పంపారు.ఢిల్లీలోని ఓ హోటల్లో రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మధ్య చోటుచేసుకున్న తీవ్ర వాగ్వాదం పార్టీ పరువును బజారున పడేసింది. ఈ వ్యవహారంపై వివరణ కోరేందుకు ఇద్దరు నేతలను గాంధీభవన్‌కు రావాల్సిందిగా పీసీసీ చీఫ్ ఆదేశించినప్పటికీ, వారు ఆయన పిలుపును బేఖాతరు చేస్తూ అసలు రాలేదని, స్వయంగా తన నాయకత్వానికే విలువ లేకుండా పోయిందని మహేష్ గౌడ్ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారు.పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ బాహాటంగా వివాదాలకు దిగిన నేతలను కూర్చోబెట్టి మాట్లాడేందుకు గాంధీభవన్‌కు రావాలని కోరినా ఇద్దరూ స్పందించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన మాటను సొంత పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలే వినకపోతే సంస్థాగతంగా పార్టీని ఎలా ముందుకు నడపగలమని, ఈ విషయంలో అధిష్ఠానమే జోక్యం చేసుకుని క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని ఆయన ఏఐసీసీ పెద్దలను కోరినట్లు సమాచారం.మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ విధానాలపై బహిరంగంగా తీవ్ర విమర్శలు గుప్పిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యవహారాన్ని కూడా మహేష్ గౌడ్ తన నివేదికలో ప్రముఖంగా ప్రస్తావించారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు పార్టీకి, రేవంత్ సర్కారు ప్రతిష్టకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని, ప్రభుత్వ పనితీరును స్పష్టంగా ఎమ్మెల్యేనే అనుమానించేలా మాట్లాడటం వల్ల విపక్షాలకు రాజకీయ ఆయుధాలు ఇచ్చినట్లవుతోందని నివేదికలో పేర్కొన్నారు.ఈ ఫిర్యాదుల పర్వంలో మహేష్ గౌడ్ ప్రదర్శించిన 'సెలెక్టివ్' వైఖరి ఇప్పుడు పార్టీ వర్గాల్లో కొత్త దుమారానికి తెరలేపింది. అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై వెంటనే లేఖ రాసిన పీసీసీ చీఫ్.. అంతకంటే తీవ్రస్థాయిలో నిత్యం పార్టీ నిర్ణయాలు, మంత్రివర్గ కూర్పు, ప్రభుత్వ తీరుపై బాహాటంగా అసంతృప్తి వెళ్లగక్కుతున్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరును నివేదికలో కనీసం ప్రస్తావించలేదు. బడా నేతలపై వేటు వేసే ధైర్యం లేక, కేవలం కొందరు నేతలను మాత్రమే టార్గెట్ చేస్తున్నారన్న విమర్శలు సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి.

తెలంగాణను కరువులోకి నెడుతున్న సీఎం రేవంత్ రెడ్డి..: టీ. జీవన్ రెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టుతో నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నప్పటికీ.. గత ప్రభుత్వానికి ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న రాజకీయ కక్షతోనే, జీవీ రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని కరువు కోరల్లోకి నెడుతున్నారని మాజీ మంత్రి, దీ-నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.. జగిత్యాలలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా పరిషత్ తొలి చైర్‌పర్సన్ దావ వసంత సురేష్‌తో పాటు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి దేవేందర్ రెడ్డిలతో కలిసి ఆయన మాట్లాడారు..

రాష్ట్రం ప్రస్తుతం తీవ్ర కరువుతో అల్లాడుతోందని.. చివరకు విద్యాసంస్థలను మూసివేసి ఆన్‌లైన్ తరగతుల వైపు మొగ్గుచూపే దుస్థితి నెలకొందని.. జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.. సముద్రం పాలవుతున్న 750 టీఎంసీల గోదావరి జలాలను మళ్లించే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ వచ్చారు. ఖజ= ఎంతో దూరదృష్టితో మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తిచేసి.. కరువు సమయంలోనూ సాగు.. తాగునీరు అందించేలా వ్యవస్థను నిర్మిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి మూడేళ్లు గడుస్తున్నా కనీస మరమ్మతులు కూడా పూర్తి చేయలేకపోయిందని ఎద్దవ చేస్తూ వచ్చారు..చీణూూ, కేంద్ర జల విద్యుత్ పరిశోధన సంస్థలు స్పష్టంగా నివేదిక ఇచ్చాయని ఆయన గుర్తుచేస్తూ వచ్చారు.

మేడిగడ్డలోని 7వ బ్లాక్‌కు మాత్రమే మరమ్మతులు అవసరమని.. అన్నారంలోని 6 బ్లాకులతో పాటు సుందిళ్ల బ్యారేజీలు నాణ్యతా ప్రమాణాల ప్రకారం.. స్థిరంగా ఉన్నాయని పేర్కొన్న విషయాన్ని సీఎం పరిశీలించాలన్నారు. కన్నెపల్లి పంపుహౌస్ దిగువన కేవలం రూ. 100 కోట్ల వ్యయంతో నెల రోజుల్లో కాఫర్ డ్యామ్ నిర్మిస్తే.. మేడిగడ్డ మరమ్మతులకు ఎలాంటి ఆటంకం కలగదని.. నెలకు 30 టీఎంసీల చొప్పున ఐదు నెలల్లో 150 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు వద్ద ఇసుక బస్తాలు వేసి నీటిని ఎత్తిపోసుకున్న మంత్రులు.. కన్నెపల్లి వద్ద మాత్రం ఎందుకు నిబంధనలు అడ్డు పెడుతున్నారని ప్రశ్నించారు. రైతు సంక్షేమంపై మాట్లాడుతూ.. రైతు భరోసా నిధులు జమయ్యాయని ప్రభుత్వం ఫేక్ మెసేజ్‌లు పంపుతోందని.. బ్యాంకుల వద్దకు వెళ్తే ఖాతాల్లో చిల్లిగవ్వ కనిపించడం లేదని మండిపడ్డారు. ఆరుతడి పంటలను ప్రోత్సహించేందుకు ఉద్యాన శాఖ వద్ద నిధులు లేవని.. చెప్పడం సిగ్గుచేటని,



రెయిన్ డ్రిప్ ఏర్పాటుకు ఎకరానికి రూ.30 వేల రాయితీతో పాటు నాణ్యమైన విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ.. జగిత్యాలలో పాత తహసీల్దార్ భవనాన్ని కూల్చివేసిన స్థలంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడంతో.. పక్కనే ఉన్న రెండు ఎకరాల విలువైన ప్రభుత్వ భూమి ఎలాంటి ఉపయోగం లేక ఖాళీగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త బస్టాండ్ వద్ద వివాదాస్పదంగా ఉన్న ఈ స్థలాన్ని నిషేధిత జాబితా నుంచి ఎలా తొలగిస్తారని జిల్లా కలెక్టర్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు దీ-నా పోరాడుతుందన్నారు.

మంత్రి శ్రీధర్ బాబు, ఎంపీ వంశీకృష్ణ మధ్య ముదురుతున్న వివాదం..

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి శ్రీధర్ బాబు మధ్య వివాదం మరింత ముదురుతోంది. మంథని నియోజకవర్గ కాంగ్రెస్‌లో చోటుచేసుకుంటున్న సస్పెన్షన్ల వ్యవహారం ఇప్పుడు పార్టీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకే తమను సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ ఎంపీ వంశీకృష్ణ అనుచరులు గాంధీభవన్‌లో పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు.మల్లారం గ్రామంలో నిరుపేద పిల్లలకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసే సేవా కార్యక్రమంలో పాల్గొన్నందుకు తమను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం ఏమిటని బాధిత నాయకులు ప్రశ్నించారు. ఈ మేరకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు లేఖ రాశారు. ఎలాంటి షోకాజ్ నోటీసులు జారీ చేయకుండా, తమ వివరణ తీసుకోకుండానే సస్పెన్షన్ విధించడం ఏంటని అభ్యంతరం వ్యక్తం చేశారు.మంథని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ తమకు సస్పెన్షన్ విషయాన్ని తెలియజేస్తూ.. మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకే ఈ చర్యలు తీసుకున్నట్లు చెప్పారని లేఖలో ఆరోపించారు. స్థానిక రాజకీయాలు, తప్పుడు సమాచారంతోనే తమపై కక్షపూరితంగా చర్యలు తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేస్తూ, కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న అసలైన కార్యకర్తలను సస్పెండ్ చేయడం సరికాదని వంశీకృష్ణ అనుచరులు పేర్కొన్నారు. ఇలాంటి చర్యల వల్ల పార్టీకి



నష్టం కలుగుతుందని, ప్రత్యర్థి పార్టీలకు రాజకీయంగా లాభం చేకూరుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.పార్టీ అధిష్ఠానం వెంటనే జోక్యం చేసుకుని తమపై విధించిన సస్పెన్షన్లను రద్దు చేయాలని, క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తలకు న్యాయం చేయాలని మహేశ్ కుమార్ గౌడ్‌ను కోరారు. ఈ ఫిర్యాదుతో మంథని కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి.

ఒక్క ఎకరం అమ్మినట్టు నిరూపించినా ఊడిగం చేస్తా: ప్రభుత్వానికి మాధవరం కృష్ణారావు సవాల్



కూకట్‌పల్లి భూముల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి బహిరంగ సవాల్ విసిరారు. కూకట్‌పల్లిలో తాము ఒక్క ఎకరం భూమి అమ్మినట్లు నిరూపిస్తే, వారి ఇంట్లో ఊడిగం చేయడానికి సిద్ధమని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము పోరాడి సాధించిన మియాపూర్ భూములపై కోర్టు ఆర్డర్ కాపీ రాకముందే ప్రభుత్వం వేలానికి సిద్ధమైందని మాధవరం ఆరోపించారు. హౌసింగ్ బోర్డుకు చెందిన భూములను కూడా ఇష్టానుసారంగా అమ్ముతున్నారని, ఇవన్నీ పేదలకు చెందినవని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శిస్తూ, ఆయనకు హైదరాబాద్ నగరంపై కనీస అవగాహన లేదని ఎద్దేవా చేశారు."చెరువుల అభివృద్ధికి రూ.50 కోట్లు ఖర్చు పెడుతూ, మరోవైపు వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అమ్మడం ఎంతవరకు సమంజసం?" అని మాధవరం ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేదలకు చెందిన భూముల అమ్మకం విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ చూస్తూ ఊరుకోబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై తన పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

కుర్చీలో ఆర్టీసీ డీఎం, నేలపై కార్మికులు.. మంత్రి పొన్నం సీరియస్

సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ (డీఎం) వ్యవహారశైలిపై తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. కార్మికులతో సమావేశమైన సమయంలో డీఎం కుర్చీలో కూర్చోగా, కార్మికులు నేలపై కూర్చున్నట్లుగా ప్రచారంలోకి వచ్చిన ఘటనపై ఆయన పూర్తిస్థాయి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, ఘటనకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ విషయంపై మంత్రి పొన్నం ప్రభాకర్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "సిద్దిపేట డిపోలో జరిగిన ఘటన నా దృష్టికి వచ్చింది. ఈ అంశంపై తక్షణమే ఆర్టీసీ ఎండీతో మాట్లాడి, సమగ్ర విచారణ జరిపించాలని ఆదేశించాను. విచారణలో బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు ఉంటాయి" అని తెలిపారు.ప్రజా పాలన ప్రభుత్వంలో కార్మికుల సంక్షేమానికి, వారి ఆత్మగౌరవానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. "ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర ఎంతో కీలకం. సంస్థ కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులను గౌరవంగా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉంది. వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా సహించే ప్రసక్తే లేదు" అని మంత్రి స్పష్టం చేశారు.కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా, అగౌరవంగా ప్రవర్తించే అధికారులపై భవిష్యత్తులో కఠిన చర్యలు తప్పవని పొన్నం ప్రభాకర్ గట్టిగా హెచ్చరించారు. అధికారులు తమ పరిధిలో కార్మికులతో గౌరవప్రదంగా, బాధ్యతాయుతంగా మెలగాలని ఆయన హితవు పలికారు.

60 టీఎంసీలు ఎత్తిపోయొచ్చు.. ప్రభుత్వం తీసుకుంది 18 టీఎంసీలే: రేవంత్ సర్కార్‌పై హరీశ్ ఫైర్



రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులకు ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలే కారణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. "ఇది అతివృష్టి కాదు.. అనావృష్టి కాదు.. రేవంత్ వృష్టి" అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా.. పంపులు నడిపి పొలాలకు నీటిని అందించలేని దుస్థితి నెలకొందని మండిపడ్డారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఆధారాలతో సహా ఎండగడతామని హెచ్చరించారు.దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే అవకాశం ఉన్నా.. ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలకే పరిమితమైందని హరీశ్‌రావు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నీటిని దిగువకు వదిలేస్తుంటే.. ఏపీ సీఎం చంద్రబాబు వాటిని ఒడిసిపట్టుకుంటున్నారని వ్యాఖ్యానించారు. శ్రీశైలంలో తగినంత నీరు ఉన్నా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడం లేదని విమర్శించారు. మరోవైపు చంద్రబాబు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని పేర్కొన్నారు.గ్లోబల్ వార్మింగ్, ఎల్‌నినో ప్రభావం ఉండొచ్చని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోలేదని హరీశ్‌రావు ఆరోపించారు. ఎన్నికల సమయంలో పంటల బీమాపై హామీలు ఇచ్చిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి వచ్చాక దాన్ని అమలు చేయడం మరిచిపోయారని విమర్శించారు. పంటల బీమా అమల్లో ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని అన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో కరవు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని గుర్తుచేశారు.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి ఉన్నా కనీసం క్యాబినెట్ సమావేశంలోనూ దీనిపై చర్చించకపోవడం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు.

ఎమ్మెల్సీని టార్గెట్ చేసిన డీప్‌ఫేక్ గ్యాంగ్.. రూ.5 కోట్లకు బేరం.. ఇంతలోనే షాకింగ్ ట్విస్ట్

హైదరాబాద్: సోషల్ మీడియాలో మార్ఫింగ్ ఫొటోలు, డీప్‌ఫేక్ వీడియోలు ప్రచారం చేస్తామంటూ తెలంగాణ ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్‌ను బెదిరించిన ముఠా గుట్టురట్టు అయ్యింది. ఎమ్మెల్సీ నుంచి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నించిన ముఠాలోని ఆరుగురు నిందితులను నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. ఎమ్మెల్సీ రాజకీయ, సామాజిక ప్రతిష్ఠకు భంగం కలిగించడంతో పాటు ప్రాణహాని చేస్తామని బెదిరించి తొలుత రూ.5 కోట్లు డిమాండ్ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.పోలీసుల వివరాల ప్రకారం.. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మొత్తం 14 మందికి పైగా కలిసి ఈ కుట్రకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్‌కి సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు, అభ్యంతరకరమైన డీప్‌ఫేక్ వీడియోలను సోషల్ మీడియాలో పెడతామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఇప్పటికే రూ.5 లక్షలు వసూలు చేయడంతో పాటు మరో రూ.5 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు.నవంబర్ 5వ తేదీన ఫాతిమా బేగం అలియాస్ రీమా మరో ఐదుగురితో కలిసి ఇబ్రహీంబాగ్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయానికి వెళ్లి నగదు అందుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న నార్సింగి పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పడి నగదు తీసుకుని వెళ్తున్న సమయంలో ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మరో నిందితుడు మహ్మద్ మొహ్సిన్ ఖాన్‌ను కూడా పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.4.70 లక్షల నగదు,



రెండు ఆటోలు, ఆరు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఏ-1తో పాటు ఏ-4 నుంచి ఏ-9, ఏ-14 వరకు మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.మార్ఫింగ్ ఫొటోలు, డీప్‌ఫేక్ వీడియోలతో బెదిరింపులకు పాల్పడితే డబ్బులు చెల్లించకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సైబరాబాద్ పోలీసులు ప్రజలకు సూచించారు. ఈ ఘటనపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఐవీఎఫ్ కేంద్రాలకు తెలంగాణ సర్కార్ బిగ్ షాక్.. తేడా వస్తే.. శాశ్వతంగా మూసివేత

రాష్ట్రంలో ఐవీఎఫ్ కేంద్రాల ముసుగులో జరుగుతున్న అక్రమాలు, దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధం అయింది. అక్రమాలకు పాల్పడే ప్రైవేట్ ఐవీఎఫ్ కేంద్రాలపై కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధం అయింది వైద్య ఆరోగ్య శాఖ. అండాల అక్రమ సేకరణ ముఠాతో సంబంధాలున్న అన్ని ప్రైవేట్ ఐవీఎఫ్ కేంద్రాలను శాశ్వతంగా సీజ్ చేసేందుకు సిద్ధం అయింది. అక్రమాల్లో భాగస్వాములైన వైద్యుల లైసెన్సులను శాశ్వతంగా రద్దు చేసే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నారు.గతంలో సృష్టి ఫర్టిలిటీ సెంటర్‌లో జరిగిన అక్రమాలను ప్రభుత్వం అరికట్టిందని, తాజాగా అండాల అక్రమ సేకరణకు పాల్పడుతున్న ముఠాను గుర్తించి పట్టుకున్నామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యశాఖ అధికారులు నిరంతర నిఘా, తనిఖీలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అండాల అక్రమ సేకరణ కేసుకు సంబంధించిన వివరాలను అధికారులు మంత్రికి వివరించారు.ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న వ్యక్తులు, సంస్థలపై సమగ్ర విచారణ జరిపి, దోషులకు చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. దర్యాప్తులో పోలీస్ శాఖకు ఆరోగ్యశాఖ అధికారులు పూర్తి సహకారం అందించాలని సూచించారు. అక్రమాలకు పాల్పడిన వైద్యులపై చర్యల విషయంలో స్టేట్ మెడికల్ కౌన్సిల్, నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం వారి లైసెన్సుల రద్దుకు సిఫారసు చేయాలని స్పష్టం చేశారు.సరోగసి, అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ చట్టాల అమలును మరింత పటిష్ఠం చేయడంపై మరింత దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ఈ చట్టాల అమలులో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీని ఆదేశించారు. దేశవ్యాప్తంగా అమలులో ఉన్న కేంద్ర చట్టాల పరిధిలోనే రాష్ట్ర స్థాయిలో అదనపు నియంత్రణ చర్యలు, మార్గదర్శకాలు రూపొందించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు.ప్రైవేట్ ఐవీఎఫ్ కేంద్రాల కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడే సంస్థలపై కఠినంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. ఐవీఎఫ్ చికిత్సలో ఉపయోగించే మెడిసిన్ తయారీ నుంచి అమ్మకాల వరకూ ప్రత్యేకంగా నిఘా ఉండాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులకు మంత్రి సూచించారు. సంతానలేమి సమస్యతో ఐవీఎఫ్ సేవలను ఆశ్రయించే దంపతులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న దోపిడీ, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉన్న సంతాన సాఫల్య చికిత్సా సేవలు పారదర్శకంగా, చట్టబద్ధంగా కొనసాగించేలా పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఐవీఎఫ్ సేవల విస్తరణ చర్యలు స్పీడప్ చేయాలని మంత్రి ఆదేశించారు.

దీపావళి వేళ సామాన్యులపై మరో బండ.. పెరిగిన కూరగాయల ధరలు

తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు దీపావళి పండక్కి ముందు పెరుగుతున్నాయి. నవంబర్ 8వ తేదీన దీపావళి పండుగ కాగా.. ముందే ధరలు ఎగబాకుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో పాటు ఏపీలో వరుస తుఫాన్లు అర్నబ్, మురసు ప్రభావంతో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. దీంతో కూరగాయల పంటకు నష్టం వాటిల్లడం, పంట ఉత్పత్తి తగ్గిపోవడంతో ధరలు ఎగబాకుతున్నాయి. దీంతో సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు పండగ వేళ షాక్ అవుతున్నారు.

టమాటా, పచ్చిమిర్చి వంటి నిత్యావసర కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. దీంతో కిలో కొనాల్సింది బదులు పావుకిలోతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం పెరుగుతోంది. వాతావరణ మార్పులు, పంట దిగుబడి తగ్గడం, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ధరల పెరుగుదలకు ప్రధాన కారణాలని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

ఒకప్పుడు రూ.500తో సంచులు నిండా కూరగాయలు ఇంటికి తెచ్చుకునే పరిస్థితి ఉండగా.. ఇప్పుడు అంతే మొత్తంతో చాలా తక్కువ పరిమాణంలో కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దళారుల దోపిడీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

హైదరాబాద్‌లో కూరగాయల రేట్లు ఇవే..

కూకట్‌పల్లిలోని మోడ్రన్ అండ్ మోడల్ రైతు బజార్‌లో కిలో టమాట రూ. 23, వంకాయ రూ.18, బెండకాయ రూ.45, పచ్చి మిర్చి రూ. 45, బజ్జి మిర్చి రూ. 55, కాకరకాయ రూ. 23, బీరకాయ రూ. 23, క్యాబేజీ రూ. 10, ఫ్రెంచ్ బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 35, గోబీపువ్వు రూ. 25, దొండకాయ రూ. 18 పలుకుతున్నాయి.


కిలో చిక్కుడుకాయ రూ. 35, గోరుచిక్కుడు రూ. 35, క్యాప్సికం రూ. 40, ఆలుగడ్డ రూ. 18, సొరకాయ రూ. 15, పొట్లకాయ రూ. 23, దోసకాయ రూ. 21, లోకల్ కీరా రూ. 18, ఇటాలియన్ కీరా రూ. 28, అలసందలు రూ. 23కి విక్రయిస్తున్నారు. బీట్ రూట్ రూ. 18, కంద రూ. 45, చామగడ్డ రూ. 35, చిలగడదుంప రూ. 35, ఉల్లిగడ్డ రూ. 40, ఉల్లిపొరక రూ. 55, గుమ్మడికాయ కిలో రూ. 25, పర్వల్ రూ. 28, పల్లికాయలు రూ. 55, పచ్చి చింతకాయలు రూ. 45, కరివేపాకు కిలో రూ. 80కే లభిస్తున్నాయి.

పచ్చి అరటికాయ ఒక్కొక్కటి రూ. 8 నుండి 9, ముల్లంగి రూ. 6 నుండి 8, మునగకాయ రూ. 6 నుండి 8, అలాగే మామిడికాయ రూ. 15 నుండి 20చ డజను నిమ్మకాయల ధర రూ. 50 నుండి 60 వరకు అమ్ముడవుతున్నాయి. పాత అల్లం కిలో రూ. 180, కొత్త అల్లం రూ. 120, వెల్లుల్లి రూ. 260, చింతపండు రూ. 160, పండు మిర్చి రూ. 80, ఉసిరి రూ. 43, ఎండు మిర్చి కిలో రూ. 280, బొప్పాయి కిలో రూ. 50, 200 గ్రాముల పుట్టగొడుగుల ప్యాకెట్ ధర రూ. 50కి విక్రయిస్తున్నారు.

విజయవాడలో రేట్లు ఇవే..

కిలో టామాట రూ.36, వంగ రూ.30, బెండ రూ.22, పచ్చిమిర్చి రూ.42, కాకర రూ.36, క్యాబేజీ రూ.24, క్యారెట్ రూ.45, దొండ రూ.24, బంగాళదుంప రూ.26, ఉల్లిపాయలు రూ.40, గోరుచిక్కుడు రూ.34, దోస రూ.26, సోర రూ.15, చిక్కుళ్లు రూ.60, బీర రూ.38, చామదుంప రూ.36, బీట్ రూట్ రూ.36, కీరదోస రూ.44, బీన్స్ రూ.85, క్యాప్సికం రూ.55,. అలసందలు రూ.40, చిలకడదుంప రూ.44, కొత్తిమీర రూ.42 పలుకుతున్నాయి.

తమిళ ఇండస్ట్రీ కన్నా తెలుగు ఇండస్ట్రీలోనే గౌరవం..!



ప్రస్తుతం చాలా మంది హీరోయిన్లు తెలుగు సినిమా ఇండస్ట్రీ గురించి మాట్లాడుతుండగా..ఒక సీనియర్ హీరోయిన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ముఖ్యంగా తెలుగు సినిమా ఇండస్ట్రీ తనకు ఎంతో ఇష్టమని చెప్పిన హీరోయిన్ సంగీత మాటలు తెలుగు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. హీరోయిన్ సంగీత గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. పెళ్లాం ఊరెళితే, ఖడ్గం వంటి సినిమాలతో ఆమె మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తన నటనతో పాటు అందంతో కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తెలుగులో మంచి అవకాశాలు అందుకున్న సంగీత, ఆ తర్వాత తమిళ సినిమాల్లో కూడా నటించారు. కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న ఆమె..ఇప్పుడు సెకండ్ ఇన్నింగ్స్‌లో భాగంగా మళ్లీ తెలుగు సినిమాల్లో నటిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా తమిళ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలో యాంకర్ సంగీతను ఒక ఆసక్తికరమైన ప్రశ్న అడిగారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం.. ఈ నాలుగు సౌత్ ఇండస్ట్రీలలో మీకు ఏ ఇండస్ట్రీ అంటే ఎక్కువ ఇష్టం అని ప్రశ్నించారు. దీనికి యాంకర్ వెంటనే తమిళ ఇండస్ట్రీ అని సమాధానం వస్తుందని భావించారు. కానీ సంగీత మాత్రం అందరినీ ఆశ్చర్యపరిచేలా తెలుగు ఇండస్ట్రీ అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. దాంతో యాంకర్ ఆశ్చర్యపోయి ఎందుకు తమిళ ఇండస్ట్రీ కాదు అని అడిగింది. అందుకు సంగీత తెలుగు ఇండస్ట్రీలో చాలా రెస్పెక్ట్ ఉంటుంది అని చెప్పింది. తాను తమిళ సినిమాలు చేసినప్పటికీ, తెలుగులోనే ఎక్కువ గౌరవం, అవకాశాలు, విలువ లభించాయని తెలిపారు. అంతేకాదు తను చెప్పే మాటలు చాలామందికి కోపం తెప్పియవచ్చు అని.. కానీ తనకు మాత్రం తెలుగు ఇండస్ట్రీ అంటేనే ఎక్కువ ఇష్టమని చెప్పుకొచ్చింది. తెలుగు ఇండస్ట్రీలో నటీనటులకు ఇచ్చే గౌరవం తనకు ఎంతో నచ్చుతుందని సంగీత చెప్పారు. తమిళ ఇండస్ట్రీలో కూడా సినిమాలు చేసినప్పటికీ, తెలుగు ఇండస్ట్రీలో పనిచేయడం తనకు ఎప్పుడూ ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తుందని వెల్లడించారు. ముఖ్యంగా తమిళ ఇండస్ట్రీ కన్నా తెలుగు ఇండస్ట్రీలోనే గౌరవం సంగీత చేసిన వ్యాఖ్యలు తెగ వైరల్ అవుతున్నా. మాటలు ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులను సంతోషపెడుతున్నాయి. ఇతర భాషల్లో సినిమాలు చేసినప్పటికీ, తెలుగు ఇండస్ట్రీ తనకు ఎంతో ప్రత్యేకమని సంగీత చెప్పడం అభిమానులకు ఆనందాన్ని కలిగిస్తోంది.

కమల్ హాసన్ బ్యానర్‌లో రజనీకాంత్-శ్రీలీల



కోలీవుడ్ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ -ధర్మన్- చిత్రానికి సంబంధించి వరుస క్రేజీ అప్‌డేట్లు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. -ఓ మై కడవులే-, -డ్రాగన్- వంటి వైవిధ్యమైన చిత్రాల ద్వారా దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అశ్విత్ మారిముత్తు దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొనగా తాజాగా యూనిట్ ప్రకటించిన అఫీషియల్ కాస్టింగ్ ప్రకటన ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సౌత్ ఇండియాలో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న యువ నటి శ్రీలీల.. రజనీకాంత్ చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. -ధర్మన్- చిత్రంలో కీలక పాత్ర పోషించడానికి ఆమె ఎంపికైనట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. చిత్ర నిర్మాణ సంస్థ కమలహాసన్ ఆధ్వర్యంలోని -రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్- సోషల్ మీడియా వేదికగా శ్రీలీలపై ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. -షి ఈజ్ గాట్ ది స్పార్క్.. షి ఈజ్ గాట్ ది పటాకా. వెల్కమింగ్ ది గార్జియస్ శ్రీలీల టూ ధర్మన్- అంటూ మేకర్స్ చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో శ్రీలీల పాత్ర ఏంటనే దానిపై మేకర్స్ ఇంకా ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోయినా? ఆమె ఎంట్రీ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. ఈ చిత్రంలో ఇప్పటికే స్టార్ హీరోయిన్ నయనతారతో పాటు షిమ్రాన్, రాశీ ఖన్నా వంటి ప్రముఖ తారలు కూడా నటిస్తున్నారు. ఒకే చిత్రంలో రజనీకాంత్ సరసన నయనతారతో పాటు శ్రీలీల వంటి క్రేజీ కాంబినేషన్ సెట్ కావడంతో అభిమానుల్లో సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరాయి. -తలైవర్ 173- వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న చిత్రంలో రజనీకాంత్ పూర్తిగా భిన్నమైన గెటప్‌లో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రజనీకాంత్ చేతికి రక్తంతో విభిన్నమైన షేడ్స్‌తో కనిపించడం విశేషం. ఈ చిత్రంలో ఆయన డాక్టర్ పాత్రలో నటిస్తున్నట్లు .. క్యారెక్టర్‌లో గ్రే షేడ్స్ ఉంటాయని తెలుస్తోంది. ఈ విజయం కూడా శ్రీలీలకు కీలకమైందే. అమ్మడు ఇప్పటికే వచ్చిన కొన్ని అవకాశాలు కాదనుకుని బాలీవుడ్ కి వెళ్లి ప్రతికూల జోన్ లోకి వెళ్లింది. ఇలాంటి సమయంలో ఏకంగా రజనీ సినిమాలో ఛాన్స్ అంటే ఎంతో గొప్పది. సినిమా సక్సెస్ అయితే వచ్చే గుర్తింపు ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది.

బాకీలు ఎగ్గొట్టిన మ్యూజిక్ డైరెక్టర్.. దేవుడికి కంప్లైంట్



ప్రముఖ డ్రమ్స్ కళాకారుడు శివమణి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. సాధారణంగా సెలబ్రిటీలు తిరుమలకు వచ్చినప్పుడు తమ సినిమాలు, వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడుతుంటారు. కానీ శివమణి మాత్రం ఓ మ్యూజిక్ డైరెక్టర్‌పై స్వామివారికే కంప్లైంట్ ఇచ్చానని చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. హైదరాబాద్‌కు చెందిన ఓ సంగీత దర్శకుడు మూడేళ్లుగా మ్యూజిషియన్లకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని ఆయన ఆరోపించారు. తిరుమలలో మీడియాతో మాట్లాడిన శివమణి, సంగీత కళాకారుల కష్టాన్ని ప్రస్తావించారు. ఒక పాట కోసం ఎంతోమంది మ్యూజిషియన్లు పనిచేస్తారని, వాళ్లకు రావాల్సిన పారితోషికం నిలిపివేయడం సరికాదని అన్నారు. మూడేళ్లుగా బాకీలు చెల్లించని సదరు మ్యూజిక్ డైరెక్టర్ నుంచి డబ్బులు ఇప్పించాలని వెంకటేశ్వరస్వామిని కోరుకున్నట్లు చెప్పారు. అయితే ఆ సంగీత దర్శకుడి పేరును మాత్రం బయటపెట్టలేదు. నార్మల్ గా ఒక పాట హిట్టయితే ఎక్కువగా సంగీత దర్శకుడికే పేరు వస్తుంది. కానీ దాని వెనుక వాయిద్య కళాకారులు, ఇతర టెక్నీషియన్ల కష్టం కూడా ఉంటుంది. అలాంటి వాళ్లకు మూడేళ్లుగా డబ్బులు అందలేదని శివమణి స్థాయి కళాకారుడు చెప్పడం హాట్ టాపిక్ గా మారింది. మరోవైపు శివమణి ప్రస్తుతం 'కర్మ బర్న్స్' పేరుతో ప్రత్యేకమైన మ్యూజిక్ కాన్సర్ట్‌లు నిర్వహిస్తున్నారు. వీటిలో కేవలం భక్తి గీతాలనే ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మూడు షోలు పూర్తి చేశామని, త్వరలో అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లోనూ ప్రదర్శనలు ఇవ్వబోతున్నామని చెప్పారు. కార్తీక మాసం సందర్భంగా అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని శ్రీవారిని ప్రార్థించినట్లు వివరించారు. ఇక భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న 'రామాయణ' సినిమా గురించి కూడా శివమణి రెస్పాండ్ అయ్యారు. ఏఆర్ రెహమాన్, హాలీవుడ్ సంగీత దర్శకుడు హన్స్ జిమ్మెర్‌తో కలిసి ఈ సినిమా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కోసం వర్క్ చేసినట్లు చెప్పారు. ఇక చిన్న వయసులోనే డ్రమ్మింగ్ మొదలుపెట్టి దేశంలోనే ప్రముఖ పర్కషన్ ఆర్టిస్టుల్లో ఒకరిగా ఎదిగారు శివమణి. ఏఆర్ రెహమాన్‌తో ఆయనకు దశాబ్దాల అనుబంధం ఉంది. రెహమాన్ సంగీతం అందించిన ఎన్నో సినిమాలతో పాటు దేశవిదేశాల్లో జరిగిన లైవ్ కాన్సర్ట్‌లలో శివమణి తన డ్రమ్మింగ్‌తో ఆకట్టుకున్నారు. హిందీ, తెలుగు, తమిళ సినిమాలకూ వర్క్ చేశారు. ప్రపంచవ్యాప్తంగా పేరున్న సంగీత కళాకారులతో కలిసి ప్రదర్శనలు ఇచ్చిన అనుభవం ఉంది.

డస్టీ రోజ్ శారీలో షాలిని అందాల సందడి



టాలీవుడ్‌లో 'అర్జున్ రెడ్డి' చిత్రంతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన టాలెంటెడ్ బ్యూటీ షాలిని పాండే తాజాగా తన గ్లామరస్ ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ముంబైలో జరిగిన రమేష్ తౌరాని దివాళీ పార్టీలో ఆమె ధరించిన ట్రెండీ శారీ లుక్ నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. మరోవైపు తనపై వస్తున్న ఫేక్ ఏఐ వీడియోలపై ఆమె తీవ్రంగా స్పందిస్తూ వార్నింగ్ ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది. ఈ విశేషాలు ఇప్పుడు చూద్దాం..

'లియోరా' శారీలో రాయల్ లుక్:

ప్రముఖ డిజైనర్ లేబుల్ 'ఫాల్సా' బ్రాండ్‌కు చెందిన 'లియోరా' ప్రీ-డ్రాప్డ్ ట్యూల్ క్రేప్ శారీలో షాలిని పాండే అద్భుతంగా మెరిసిపోయారు. డస్టీ రోజ్ లేదా బ్రౌన్ షేడ్‌లో ఉన్న ఈ సారీపై క్రిస్టల్, మెటాలిక్-థ్రెడ్ హ్యాండ్ ఎంబ్రాయిడరీ, క్లిష్టమైన లేస్ వర్క్ ఈ ఔట్‌ఫిట్‌కు రిచ్ లుక్‌నిచ్చాయి. ఇక ముంబై సెలబ్రిటీ పార్టీలో ఈ ట్రెండీ శారీతో ఆమె ఇచ్చిన పోజులు ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకున్నాయి.

ఫేక్ ఏఐ వీడియోలపై షాలిని సీరియస్:

సినిమాలతో పాటు వ్యక్తిగతంగానూ ఆమె ఇటీవల వార్తల్లో నిలిచారు. తనపై నెట్టింట సర్క్యులేట్ అవుతున్న ఫేక్ ఏఐ జనరేటెడ్ వీడియోపై షాలిని పాండే ఇటీవల తీవ్రంగా స్పందించారు. సాంకేతికతను మహిళలపై ఇలా దుర్వినియోగం చేయడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఇక ఆ క్లిప్ పూర్తిగా అబద్ధమని స్పష్టం చేస్తూ, దాన్ని ఎవరు డౌన్‌లోడ్ చేయవద్దని, షేర్ చేయకుండా వెంటనే రిపోర్ట్ చేయాలని ఆమె అభిమానులకు విజ్ఞప్తి చేశారు.


ఓటీటీలో సత్తా చాటుతున్న నటి:

సినిమాల పరంగా చూస్తే 'నిశ్శబ్దం', 'ఇడ్లీ కడై' వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఆడకపోయినా, ఓటీటీ వేదికగా షాలిని మంచి విజయాలు అందుకున్నారు. ఇక గతేడాది హిందీలో వచ్చిన క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'డబ్బా కార్టెల్'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవల విడుదలైన 'బండ్‌వాలే' సిరీస్‌లో మరియం పాత్రలో ఆమె నటనకు మంచి ప్రశంసలు దక్కాయి.

బాధ్యతగా నడుచుకోవాలని పిలుపు:

టెక్నాలజీని తప్పుదారి పట్టిస్తూ కొందరు చేస్తున్న ఇలాంటి సైబర్ నేరాలను ఎప్పటికీ సహించకూడదని షాలిని స్పష్టం చేశారు. సమాజంలో ఇలాంటి వాటిపై ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె కోరారు. ఇక ఒకవైపు ఫ్యాషన్ వరల్డ్‌లో ట్రెండీ లుక్స్‌తో అలరిస్తూనే, మరోవైపు సోషల్ ఇష్యూలపై ఆమె ధైర్యంగా గళం విప్పడం విశేషం. ఇక మొత్తానికి చూస్తే, అటు అందమైన ఫ్యాషన్ ఫోటోషూట్‌తో ట్రెండ్‌లో నిలుస్తూనే, ఇటు టెక్నాలజీ దుర్వినియోగంపై షాలిని పాండే తీసుకున్న ధైర్యమైన స్టాండ్ అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఇక గ్లామర్‌తో పాటు బాధ్యతగల నటిగా ఆమె మరోసారి తన గొప్పతనాన్ని చాటుకున్నారు..

మళ్లీ వోగ్ కవర్‌పై కత్రినా.. ఫ్యాన్స్‌కు స్పెషల్ ట్రీట్



ఎనిమిదేళ్ల తర్వాత వోగ్ ఇండియా కవర్‌పై మెరిసిన కత్రినా కైఫ్, ప్రసవానంతరం మహిళలు వెంటనే పాత శరీరాకృతికి రావాలనే ఒత్తిడిని తప్పుబట్టారు. బిడ్డ పుట్టిన తర్వాత తన శరీరాన్ని గౌరవిస్తూ, తనకు నచ్చిన వేగంతో ఫిట్‌నెస్ సాధిస్తానని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆమె ఫొటోషూట్, వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

బాలీవుడ్ అందాల నటి కత్రినా కైఫ్

ఎనిమిదేళ్ల విరామం తర్వాత ప్రముఖ 'వోగ్ ఇండియా' మ్యాగజైన్ నవంబర్-డిసెంబర్ 2026 సంచిక కవర్ పేజీపై మెరిసిపోయారు. భర్త వికీ కౌశల్‌తో కలిసి విహాన్ అనే బాబుకు జన్మనిచ్చిన తర్వాత ఆమె ఇచ్చిన ఈ లేటెస్ట్ ఫొటోషూట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. ప్రసవానంతరం మహిళల శరీరాకృతిపై సమాజం చూపే ఒత్తిడిని, 'బౌన్స్ బ్యాక్' సంస్కృతిని తిరస్కరిస్తూ కత్రినా ఇచ్చిన స్ట్రాంగ్ మెసేజ్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఆ విశేషాలు ఇప్పుడు చూద్దాం..

రాయల్ వింటేజ్ లుక్‌లో కత్రినా అల్టిమేట్ గ్లామర్:

ఈ ప్రత్యేక ఫొటోషూట్ కోసం ప్రముఖ స్టైలిస్ట్ రియా కపూర్ కత్రినాను అత్యంత ఎలిగెంట్‌గా తీర్చిదిద్దారు. ప్రసిద్ధ డిజైనర్లు అబు జానీ సందీప్ ఖోస్లా డిజైన్ చేసిన ఐవరీ పెవీ లక్నోవి, చిక్‌న్ కారీ అవుట్‌ఫిట్‌లో కత్రినా దేవకన్యలా మెరిసిపోయారు. దీనికి తోడు లేయర్డ్ ఆక్సిడైజ్డ్ సిల్వర్ జ్యువెలరీ, స్టేట్‌మెంట్ ఇయర్ రింగ్స్ మరియు పెద్ద రింగ్ జత చేయడంతో ఆమె లుక్ రాయల్ క్లాస్‌గా మారింది. ఇక నెటిజన్లు ఈ పిక్స్‌పై "హాట్ ఎలిగెన్స్", "ఎఫర్ట్‌లెస్ బ్యూటీ" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

బౌన్స్ బ్యాక్' సంస్కృతిపై కత్రినా స్ట్రాంగ్ కౌంటర్:

ప్రసవం తర్వాత మహిళలు వెంటనే పాత రూపానికి రావాలంటూ సమాజం తెచ్చే ఒత్తిడిపై కత్రినా ఘాటుగా స్పందించారు. "బౌన్స్ బ్యాక్ అవ్వాలా? ఎక్కడికి వెళ్లాలి? నా మనసులోని గాఢమైన కోరిక నెరవేరి నేను నా జీవితంలో ఒక అడుగు ముందుకు వేశాను.. అలాంటప్పుడు వెనక్కి ఎందుకు వెళ్తాను?" అని సూటిగా ప్రశ్నించారు. బాబు విహాన్ పుట్టిన క్షణాలు తమ జీవితంలో ఎంతో మధురమైనవని, తన శరీరానికి సరిపడే ఫిట్‌నెస్‌ను తన సొంత వేగంలో సాధిస్తానని ఆమె స్పష్టం చేశారు.

మహిళలపై పెరిగిన అందాల ఒత్తిడి:

ఇటీవల విక్టోరియా సీక్రెట్ షోలలో లేదా సెలబ్రిటీల ప్రసవానంతర రూపాలపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చలను కత్రినా తీవ్రంగా ఖండించారు. నాఓమి వోల్ఫ్ రాసిన 'ది బ్యూటీ మిత్' పుస్తకంలో చెప్పినట్లుగా, మహిళల సహజ మార్పులను తప్పుగా చిత్రీకరించడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఇక తన శరీరాన్ని గౌరవిస్తూ, ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా తన స్వంత శైలిలో ముందుకెళ్తానని కత్రినా చెప్పడం విశేషం.

బిజినెస్ అండ్ మదర్‌హుడ్ బ్యాలెన్స్:

ఒకవైపు నటన, మరోవైపు తన సొంత బ్యూటీ బ్రాండ్ 'కే బ్యూటీ' వ్యాపార బాధ్యతలను చూసుకుంటూనే, మరోవైపు తల్లిగా కొత్త ప్రయాణాన్ని సమర్థవంతంగా ఆస్వాదిస్తున్నట్లు కత్రినా పేర్కొన్నారు. ఇక తన పనికి, వ్యక్తిగత జీవితానికి మధ్య పర్ఫెక్ట్ బ్యాలెన్స్ వెతుక్కుంటూ సొంత నిబంధనలతో జీవించడమే తన జీవిత సూత్రమని వెల్లడించారు. ఇక మొత్తానికి చూస్తే, ఎనిమిదేళ్ల తర్వాత వోగ్ కవర్ పేజీపై మెరిసిన కత్రినా క్వీన్ కేవలం తన గ్లామర్‌తోనే కాకుండా, మదర్‌హుడ్ మరియు బాడీ పాజిటివిటీపై ఇచ్చిన మెసేజ్‌తో కోట్లాది మంది మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న ఆమె లేటెస్ట్ ఫొటోలు, నెటిజన్ల మనసులను అమితంగా దోచుకుంటున్నాయి.

రహస్యం బయటపెట్టిన భాగ్యశ్రీ.. ఆ టాలెంట్ కూడా ఉందా?



హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తనలోని మరో టాలెంట్‌ను బయటపెట్టారు. తాను కవిత్వం రాస్తానని, జీవితంలోని కష్టకాలంలో రాయడం తనకు ప్రశాంతతను ఇచ్చిందని ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించారు. ఇప్పటివరకు ఈ విషయాన్ని తనలోనే దాచుకున్నానని, ఏదో ఒకరోజు తన కవితలను అందరితో పంచుకుంటానని తెలిపారు.

సినీ ఆడియన్స్ కలల రాకుమారిగా..

తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకుంది భాగ్యశ్రీ. అందం, అభినయంతో.. నటనతో ఆకట్టుకుంటున్న ఈ ముద్దుగుమ్మ తొలిసారి మిస్టర్ బచ్చన్ సినిమా ద్వారా రవితేజ సరసన హీరోయిన్గా నటించి తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ కింగ్‌డమ్ చిత్రంలో నటించి.. పర్వాలేదనిపించుకున్న ఈమె.. రామ్ పోతినేని సరసన ఆంధ్ర కింగ్ తాలూకా చిత్రంలో కూడా తన నటనతో ఆకట్టుకుంది. కానీ ఈమెకు మంచి గుర్తింపును అందించింది మాత్రం అఖిల్ లెనిన్ మూవీ అనే చెప్పాలి. ఏకంగా రూ.100 కోట్ల క్లబ్లో చేరి సంచలనం సృష్టించింది ఈ సినిమా. ఈ సినిమాతో భాగ్యశ్రీ కి మంచి పేరు రావడమే కాకుండా ఇతర భాషల్లో కూడా వరుసగా అవకాశాలు తలుపు తడుతున్నాయి.

గ్లామర్ తో కట్టిపడేసిన భాగ్యశ్రీ బోర్సే..

ఇదిలా ఉండగా.. మరొకవైపు నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ గ్లామర్ ఫోటోలతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసిన ఈమె.. మరోసారి మరో ఔట్ ఫిట్ తో ఆడియన్స్ ముందుకు వచ్చింది. ఈ గ్లామర్ ఫోజులతో పాటు తనలో దాగి ఉన్న రహస్యాన్ని కూడా అభిమానులతో పంచుకుంది భాగ్యశ్రీ. ముందుగా భాగ్యశ్రీ ధరించిన అవుట్ ఫిట్ విషయానికి వస్తే.. బ్లాక్ హాల్టర్ నెక్ మ్యాక్సీ డ్రెస్ ధరించింది. పొడవైన లాంగ్ మ్యాక్సీ డ్రెస్ కి మధ్యలో తెల్లటి జిగ్జాగ్ ఆకారంలో ఉండేలా కాంట్రాస్ట్ రిక్ రాక్ ట్రిమ్ డిజైన్ ను బోర్డర్ గా అమర్చారు. ఈ వెకేషన్ డ్రెస్ కి తగ్గట్టుగా మెడలో సన్నని లేయర్ బ్లాక్ అండ్ గోల్డ్ చోకర్ నెక్లెస్ ను ధరించి తన క్యాజువల్ లుక్ ను ఆమె మరింత పర్ఫెక్ట్ గా మార్చుకుంది.

భాగ్యశ్రీ కవయిత్రి కూడానా..

ఇక ఈ బ్లాక్ కలర్ అవుట్ ఫిట్ తో పాటు ఆమె పంచుకున్న రహస్యం అభిమానులను ఒకింత సర్ప్రైజ్ చేసిందని చెప్పాలి. భాగ్యశ్రీ తన అధికారిక ఇంస్టాగ్రామ్ ద్వారా ఈ విధంగా క్యాప్షన్ జోడించింది. "ఒక రహస్యం బయటపెట్టే సమయం వచ్చింది. మీ అందరి నుండి నేను ఇన్ని రోజులు దాచిన ఈ రహస్యాన్ని ఇప్పుడు బయట పెట్టాల్సిన సమయం వచ్చిందని అనుకుంటున్నాను. నాలో నేను ఎప్పుడూ నాలోనే దాచుకున్న ఒక చిన్న భాగం కవిత్వం. నేను కవిత్వం రాస్తాను. నా స్నేహితుల ముందు నన్ను నేను గర్వంగా కవిని అని పిలుచుకుంటాను. జీవితంలోని కష్టకాలంలో సహజంగానే నాలో ఈ భాగాన్ని నేను కనుగొన్నాను

కవిత్వం నాకు ప్రశాంతతను ఇచ్చింది..

రాయడం నాకు ప్రశాంతతను ఇచ్చింది. జీవితంలోని అందాలను కనుగొనేలా చేసింది. కవిత్వం రాసేటప్పుడు నన్ను నేను స్వేచ్ఛగా జీవించాలనుకుంటాను. ప్రపంచాన్ని మరిచిపోయి నా హృదయం చెప్పేది వింటూ.. నేను ఎవరో నాకు గుర్తుచేసే ఒక గొప్ప రహస్యం ఇది.. అందుకే బహుశా ఏదో ఒక రోజు ఈ కవయిత్రి తనలోని ఒక భాగాన్ని బయట ప్రపంచంలోకి విడుదల చేస్తుంది. ఏదో ఒక రోజు నేను బయటకు చెప్పలేని ఎన్నో మాటలను మీ ముందుకు తీసుకొస్తాను. అప్పటివరకు ఈ చిన్న కవయిత్రి ఒక వాగ్దానం కోరుతోంది. దయగా, సౌమ్యంగా ఉండమని.. కచ్చితంగా మీ ముందుకు నాలోని టాలెంట్ను తీసుకొస్తాను". అంటూ ఈమె చేసిన క్యాప్షన్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నటన, అందమే కాదు ఈమెలో ఒక కవయిత్రి కూడా దాగి ఉందా అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు.

బంగ్లాదేశ్‌కు తిరిగొస్తా.. మరణమైనా స్వదేశంలోనే



బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా స్వదేశానికి తిరిగొచ్చేందుకు సిద్ధమవుతున్నారు. భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న ఆమె.. వచ్చే నెల బంగ్లాదేశ్‌కు వస్తానని స్పష్టం చేశారు. తన ప్రభుత్వ హయాంలో నిరసనకారులపై జరిగిన ప్రాణాంతక అణచివేతకు సంబంధించి అక్కడి ప్రత్యేక న్యాయస్థానం 2025లో ఆమెకు మరణశిక్ష విధించింది. అయినా స్వదేశానికి తిరిగి రావాలన్న నిర్ణయంలో మార్పు లేదని హసీనా తెలిపారు. 2024లో ప్రజా తిరుగుబాటుతో అధికారం కోల్పోయిన ఆమె.. అప్పటి నుంచి భారత్‌లోనే ఉంటున్నారు."మరణం నా విధి అయితే.. నా సొంత దేశంలో, నా ప్రజల మధ్యే చనిపోవడానికి ఇష్టపడతాను. అందుకే బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తాను. నా నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదు" అని అసోసియేటెడ్ ప్రెస్ (ఏపీ) వార్తాసంస్థకు ఈ-మెయిల్ ద్వారా ఇచ్చిన సమాధానంలో ఆమె పేర్కొన్నారు.గత వారం ఏపీ పంపిన ప్రశ్నలకు బుధవారం హసీనా సమాధానమిచ్చారు. భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు ఎలా తిరిగి వస్తారనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. అక్కడికి చేరుకున్న వెంటనే ఆమెను అరెస్టు చేసే అవకాశాలున్నాయి.

అరెస్టు చేసినా వెనక్కి తగ్గను...

"నేను తిరిగి వస్తే అరెస్టు చేయొచ్చని తెలుసు. జైలులో పెట్టొచ్చు, హింసించొచ్చు, చివరకు చంపేయొచ్చు. ఈ అవకాశాలన్నీ నాకు తెలుసు. అయినా నా ప్రజలు కష్టాలు పడుతుంటే దూరం నుంచి చూస్తూ జీవితాంతం గడపలేను" అని హసీనా చెప్పారు.2009 నుంచి 2024 వరకు ఆమె బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా పనిచేశారు. విద్యార్థుల నేతృత్వంలో సాగిన నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో ఆమె అధికారం కోల్పోయి భారత్‌కు వెళ్లిపోయారు.నిరసనకారులపై అణచివేతకు ఆదేశాలిచ్చారనే అభియోగాలపై బంగ్లాదేశ్ ప్రత్యేక న్యాయస్థానం 2025లో ఆమెకు మరణశిక్ష విధించింది. ఈ చర్యలు మానవత్వానికి వ్యతిరేకమైన నేరాలని తీర్పులో పేర్కొంది. ఆ అణచివేతలో వందల మంది చనిపోగా.. వేలాది మంది గాయపడ్డారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం దాదాపు 1,400 మంది ప్రాణాలు కోల్పోయారు.అయితే హసీనా తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. న్యాయస్థానం తీర్పును అంగీకరించలేదు. విచారణ చట్టబద్ధతపైనా ప్రశ్నలు లేవనెత్తారు.హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ పలుమార్లు భారత్‌ను కోరింది. అయితే ఆమెను అప్పగించేందుకు భారత్ అంగీకరించలేదు. డిసెంబరులో స్వదేశానికి వస్తానని హసీనా తొలిసారిగా ఆగస్టులో ప్రకటించారు.

పార్టీపై అణచివేత..

20 వేల మంది చనిపోయారన్న హసీనా... హసీనా అధికారం కోల్పోయిన తర్వాత నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వ బాధ్యతలు చేపట్టారు. 18 నెలల పాటు దేశ పాలన సాగించారు.యూనస్ పాలనలో ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో మాజీ ప్రధాని ఖలీదా జియా కుమారుడు, హసీనాకు చిరకాల రాజకీయ ప్రత్యర్థి అయిన తారిఖ్ రెహమాన్ ఘన విజయం సాధించి అధికారంలోకి వచ్చారు. ఈ ఎన్నికల్లో హసీనా పార్టీ అవామీ లీగ్ పోటీ చేయకుండా నిషేధం విధించారు.ప్రస్తుతం ఆ పార్టీ భవిష్యత్తు అనిశ్చితిలో పడింది. విస్తృతంగా కొనసాగుతున్న అణచివేతతో సీనియర్ నాయకులు అరెస్టవడం, మరికొందరు దేశం విడిచి వెళ్లడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2024 ఆగస్టు నుంచి ఇప్పటివరకు కనీసం 20 వేల మంది పార్టీ సభ్యులు హత్యకు గురయ్యారని హసీనా ఆరోపించారు. వేలాది మందిని అరెస్టు చేశారని, హింసించారని, మరికొందరు అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చిందని చెప్పారు. రాజకీయ అనుబంధం కారణంగా తమ మద్దతుదారులు ఇళ్లు, వ్యాపారాలు, జీవనోపాధి కోల్పోయారని పేర్కొన్నారు."దేశంలో సాధారణ రాజకీయ, ప్రజాస్వామిక వాతావరణం లేదు. మా పార్టీని అధికారులు పద్ధతి ప్రకారం అణచివేస్తున్నారు" అని హసీనా ఆరోపించారు.అయితే అరెస్టులు నిర్దిష్ట ఆరోపణల ఆధారంగానే జరుగుతున్నాయని బంగ్లాదేశ్ ప్రభుత్వం చెబుతోంది. ఇటీవలి నెలల్లో పౌర, రాజకీయ హక్కులపై దాడులు పెరిగాయంటూ హ్యూమన్ రైట్స్ వాచ్ సహా పలు హక్కుల సంఘాలు తారిఖ్ రెహమాన్ ప్రభుత్వాన్ని విమర్శించాయి.తన సురక్షిత రాక కోసం అమెరికా, భారత్ వంటి దేశాలు బంగ్లాదేశ్‌పై ఒత్తిడి తీసుకురావాలని ఆశిస్తున్నారా? అని ఏపీ అడిగిన ప్రశ్నకు హసీనా స్పందించారు. విదేశీ శక్తుల రక్షణ తనకు అవసరం లేదన్నారు."అన్ని దేశాలతో స్నేహం, సహకారానికి నేను విలువిస్తాను. ఎప్పుడూ అదే మా విదేశాంగ విధానం. అయితే నా సొంత దేశానికి తిరిగి రావడానికి ఏ విదేశీ శక్తి ఆశీస్సులూ నాకు అవసరం లేదు" అని స్పష్టం చేశారు.

తీవ్రవాద శక్తుల పెరుగుదలపై ఆందోళన...

యూనస్ తాత్కాలిక ప్రభుత్వ పాలనలో ఉదారవాద శక్తులను అణచివేసేందుకు కొన్ని తీవ్రవాద సంస్థలు ప్రయత్నించడంపై అంతర్జాతీయ హక్కుల సంఘాలు, స్వతంత్ర పరిశీలకులు గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. మైనారిటీ వర్గాలూ బెదిరింపులు ఎదుర్కొన్నట్లు ఆరోపించాయి. అయితే ఈ ఆరోపణలను యూనస్ ప్రభుత్వం ఖండించింది.ప్రస్తుత దేశంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణిస్తోందంటూ ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయి. తన 15 ఏళ్ల పాలనలో తీవ్రవాద సంస్థల పట్ల కఠినంగా వ్యవహరించిన హసీనా.. బంగ్లాదేశ్‌లో మితవాద వ్యతిరేక శక్తుల ప్రభావం పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు.ఈ అంశాలపై వ్యాఖ్యానించాలని ఏపీ కోరగా.. బంగ్లాదేశ్ ప్రధానమంత్రి కార్యాలయ మీడియా విభాగం స్పందించలేదు.మరోవైపు గురువారం తర్వాత బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ స్పందించారు. భారత్‌తో ఉన్న అప్పగింత ఒప్పందం ప్రకారం హసీనాను తమకు అప్పగించాలని కోరుతున్నట్లు చెప్పారు. స్వదేశానికి రావడానికి ఆమెకు పాస్‌పోర్టు లేదా ఇతర ప్రయాణ పత్రాలు అవసరమన్న వాదనలను తోసిపుచ్చారు."హసీనాను మాకు అప్పగించాలని కోరుతున్నాం. ఆమెను అప్పగిస్తారు. ఆమె ఉగ్రవాది. పరారీలో ఉన్న వ్యక్తి. భారత్, బంగ్లాదేశ్ మధ్య అప్పగింత ఒప్పందం అమల్లో ఉంది" అని యునైటెడ్ న్యూస్ ఆఫ్ బంగ్లాదేశ్ వార్తాసంస్థతో ఆయన పేర్కొన్నారు

ఇజ్రాయెల్ రాజకీయాల్లో కీలక పరిణామం..

అరబ్ పార్టీల మద్దతుతో ప్రధానిగా ఆర్మీ మాజీ చీఫ్ ఐసెన్‌కోట్



ఇజ్రాయెల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ దక్కకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటుపై అనిశ్చితి కొనసాగుతోంది. ఈ తరుణంలో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బాధ్యతను ఎవరికి అప్పగించాలో ఆదివారం నాడు వెల్లడించనున్నట్లు ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్ ప్రకటించారు. ప్రతిపక్ష నేత, ఆర్మీ మాజీ చీఫ్ గాడీ ఐసెన్‌కోట్‌కు అత్యధిక మంది ప్రతినిధుల మద్దతు లభించిన నేపథ్యంలో అధ్యక్షుడి ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఫలించిన అధ్యక్షుడి సంప్రదింపులు

ఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ దక్కకపోవడంతో అధ్యక్షుడు హెర్జోగ్ గురువారం వివిధ రాజకీయ పార్టీలతో రెండో రోజు సంప్రదింపులు జరిపారు. అనంతరం ప్రతిపక్ష నేత ఐజెన్‌కోట్‌కు 67 మంది సభ్యులు, నెతన్యాహుకు 46 మంది సభ్యుల మద్దతు ప్రకటించారు. ఏడుగురు సభ్యులు తటస్థంగా ఉండిపోయారు. 19 సీట్లను గెలిచిన అరబ్ పార్టీలు ఐజెన్‌కోట్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించాయి.అధ్యక్షుడు హెర్జోగ్ మాట్లాడుతూ. "సంప్రదింపుల ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, చట్టప్రకారం ప్రభుత్వం ఏర్పాటు చేసే సామర్థ్యం ఎవరికి ఉందో నిర్ణయించే అధికారం నాకు ఉంది. కానీ వివిధ పక్షాల మధ్య ఉన్న విభేదాలు, విటోల వల్ల ఇది ఎంతవరకు సాధ్యమనేది స్పష్టంగా లేదు. అందుకే కొందరు పార్టీ నాయకులతో వ్యక్తిగతంగా మాట్లాడి త్వరలోనే ఒక నిర్ణయానికి వస్తాను" అని పేర్కొన్నారు.ఐసెన్‌కోట్ నేతృత్వంలోని 'యాషార్' పార్టీ గురువారం స్పందిస్తూ "ఇజ్రాయెల్ ప్రజలు మార్పును కోరుకున్నారు. నిష్ప్రమిస్తున్న ప్రధాని నెతన్యాహు, ఆయన ప్రభుత్వంపై పూర్తి అపనమ్మకాన్ని వ్యక్తపరిచారు. ప్రజలందరి కోసం పనిచేసే జాతీయ అత్యవసర ప్రభుత్వాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలి" అని పిలుపునిచ్చింది.

చక్రం తిప్పనున్న అరబ్ పార్టీలు

ఈ ఎన్నికల్లో అరబ్ మెజారిటీ ఉన్న రెండు కూటములు ఏకంగా 19 సీట్లు గెలుచుకుని చారిత్రక విజయం సాధించాయి. ఐజెన్‌కోట్ కూటమి వీరి మద్దతు తీసుకుంటే ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈ రెండు అరబ్ కూటములు కూడా ఐజెన్‌కోట్‌కే మద్దతు పలికాయి.ఇజ్రాయెల్‌లో ఓట్ల లెక్కింపు పూర్తి.. నెతన్యాహు పార్టీకే అధిక్యం.. కానీ అరబ్ పార్టీలతో కలిసి ప్రతిపక్షం షాకిస్తుందా?ఇది చదివారా:ఇజ్రాయెల్‌లో ఓట్ల లెక్కింపు పూర్తి.. నెతన్యాహు పార్టీకే అధిక్యం.. కానీ అరబ్ పార్టీలతో కలిసి ప్రతిపక్షం షాకిస్తుందా?అయితే, ఐజెన్‌కోట్ కూటమిలోని 'ఇజ్రాయెల్ బైతేను' పార్టీ నేత అవిగ్డోర్ లీబర్‌మాన్ మాత్రం అరబ్ పార్టీల మద్దతుతో ఏర్పడే ప్రభుత్వంలో చేరేది లేదని స్పష్టం చేశారు. అక్టోబర్ 7, 2023 నాటి దాడిని ఖండించినప్పటికీ, హమాస్‌ను అధికారికంగా 'ఉగ్రవాద సంస్థ'గా ధ్రువీకరించడానికి అరబ్ పార్టీలు నిరాకరించడమే ఇందుకు కారణమని ఆయన పేర్కొన్నారు.

అల్ట్రా-ఆర్థోడాక్స్ పార్టీల వైఖరి

గత ఐదు ఎన్నికల్లో నెతన్యాహుకు మద్దతుగా నిలిచిన అల్ట్రా-ఆర్థోడాక్స్ పార్టీ 'యునైటెడ్ తోరా జుడాయిజం'.. ఈసారి ఎవ్వరికీ మద్దతు ఇవ్వడానికి నిరాకరించి తటస్థంగా ఉండిపోయింది. ఆ పార్టీ నుంచి ఈ ఎన్నికల్లో ఏడుగురు విజయం సాధించారు.మరొక ఆర్థోడాక్స్ పార్టీ 'షాస్'తో కలిసి, మతపరమైన విద్యార్థులకు సైనిక సేవల నుంచి మినహాయింపును కొనసాగించాలని ఈ పార్టీ డిమాండ్ చేస్తోంది. గాజా, లెబనాన్, ఇరాన్‌లలో యుద్ధాల కారణంగా సాధారణ పౌరులు సైనిక సేవలు అందిస్తున్న వేళ, ఈ మినహాయింపులపై దేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఐజెన్‌కోట్ కూడా ఈ మినహాయింపులను రద్దు చేయాలనే పట్టుదలతో ఉన్నారు.విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. యునైటెడ్ తోరా జుడాయిజం పార్టీ నెతన్యాహును పెచ్చరించడానికే ఈ వ్యూహాన్ని అమలు చేస్తోందని, చివరికి నెతన్యాహు ప్రభుత్వం ఏర్పాటు చేస్తే అందులో భాగస్వామి అయ్యే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.ఇజ్రాయెల్ నిబంధనల ప్రకారం.. అధ్యక్షుడు ఆహ్వానించే అభ్యర్థికి ప్రభుత్వం ఏర్పాటుకు 28 రోజుల గడువు ఉంటుంది. అవసరమైతే దీనిని మరో 14 రోజులు పొడిగిస్తారు. ఆయన ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడంలో విఫలమైతే మరొకర్ని ఆహ్వానిస్తారు.ప్రస్తుతం 120 సీట్లు ఉన్న ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో నెతన్యాహు కూటమికి 53 సీట్లు ఉండగా, ఐజెన్‌కోట్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమికి 48 సీట్లు ఉన్నాయి. అరబ్ పార్టీల 19 సీట్లు ఇప్పుడు ఇజ్రాయెల్ భవిష్యత్తు రాజకీయాన్ని నిర్ణయించనున్నాయి.

ట్రంప్‌పై తిరుగుబావుటా...

మధ్యంతరఎన్నికల్లోఓటమితోసొంతపార్టీనుంచేవిమర్శలు...ఓటమికిఅధ్యక్షుడివిధానాలే కారణమనిఆరోపణలు



వాషింగ్టన్: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఘోర పరాజయం నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సొంత పార్టీ నేతలే తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ ఫలితాలు అధ్యక్షుడి నాయకత్వానికి ప్రజలు ఇచ్చిన తిరస్కారమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఓ సీనియర్ రిపబ్లికన్ నేత ఈ ఓటమిని అత్యంత తీవ్రస్థాయి విపత్తుగా అభివర్ణించారు. పార్టీ ఓటమికి ట్రంప్ విధానాలు, ఆయన వ్యవహారశైలే కారణమని ఆరోపించారు.డెమోక్రటిక్ పార్టీ ప్రతినిధుల సభతోపాటు సెనెట్‌లోనూ ఆధిక్యం సాధించింది. టెక్సాస్, కాన్సాస్, దక్షిణ కరోలినా వంటి సంప్రదాయ రిపబ్లికన్ రాష్ట్రాల్లోనూ డెమోక్రాట్లు విజయాలు నమోదు చేశారు. దీంతో పార్టీ నేతల్లో తొలుత కనిపించిన దిగ్భ్రాంతి క్రమంగా ట్రంప్‌పై అసంతృప్తిగా మారింది. టెక్సాస్‌కు చెందిన ప్రముఖ రిపబ్లికన్ లాబీయిస్టు బిల్ మిల్లర్ మాట్లాడుతూ.. ఈ ఓటమికి ట్రంప్ తప్ప మరెవరూ బాధ్యులు కాదని వ్యాఖ్యానించారు. ఇది అధ్యక్షుడిని ప్రజలు పూర్తిగా తిరస్కరించినట్లేనని, ఫలితాలు ఊహించని స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు.

ఇరాన్ యుద్ధం, సుంకాలపై ఆగ్రహం

ట్రంప్ విధానాలు ఓటర్లను పార్టీకి దూరం చేశాయని రిపబ్లికన్ వ్యూహకర్తలు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్‌తో యుద్ధం, దిగుమతి సుంకాలు, వలసలపై కఠిన చర్యలు ప్రజల్లో అసంతృప్తిని పెంచాయని అంటున్నారు. యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెరగడం, ద్రవ్యోల్బణం, జీవనవ్యయం వంటి అంశాలు ఎన్నికల్లో ప్రభావం చూపాయని పేర్కొంటున్నారు. మిన్నెసోటా రిపబ్లికన్ వ్యూహకర్త గ్రెగ్ పెప్పిన్ మాట్లాడుతూ.. పార్టీ ప్రచారంలో వరుస తప్పిదాలు జరిగాయని, పలు రాష్ట్రాల్లో ఓటర్లు అధ్యక్షుడి విధానాలను తిరస్కరించారని అన్నారు. మరోవైపు, వైట్‌హౌస్‌కు సన్నిహితంగా ఉన్న ఓ వ్యక్తి కూడా ఇరాన్ యుద్ధం, సుంకాలు, వలసలపై ప్రభుత్వ వైఖరి కలిసి పార్టీకి రాజకీయంగా నష్టం కలిగించాయని పేర్కొన్నారు.

మాగాలో అంతర్యుద్ధం

మధ్యంతర ఎన్నికల్లో పరాజయం నేపథ్యంలో ట్రంప్‌కు సొంత రాజకీయ శిబిరం నుంచే వ్యతిరేకత ఎదురవుతున్నది. ట్రంప్‌కు బలమైన మద్దతుదారులుగా ఉన్న మాగా(మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) వర్గానికి చెందిన పలువురు ప్రముఖులు ఇప్పుడు ఆయన విధానాలనే తప్పుబడుతున్నారు. ఇరాన్‌తో యుద్ధం, స్వేచ్ఛావాద ఓటర్లను దూరం చేసుకోవడం, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకపోవడం పార్టీ ఓటమికి కారణమని విమర్శిస్తున్నారు. ప్రముఖ రైట్‌వింగ్ వ్యాఖ్యాత అలెక్స్ జోన్స్ ట్రంప్‌పై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఆయన డెమోక్రాట్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ట్రంప్‌తో వందశాతం యుద్ధం చేస్తున్నా అని ప్రకటించారు.

చెత్తబుట్టను చూసి పారిపోయిన రోబో

24 గంటల డ్యూటీలో చైనాలో వింత ఘటన



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు రోబోటిక్స్ రంగాల్లో మానవుడి స్థానాన్ని రోబోలే భర్తీ చేస్తున్నాయన్న ప్రచారం జరుగుతున్న విపరీతంగా జరుగుతున్న సమయంలో.. చైనాలో జరిగిన ఒక ఆసక్తికర ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తూ వస్తోంది. నిరంతరం ఎలాంటి అలసట లేకుండా పనిచేస్తాయనుకున్న రోబోలు.. 24 గంటల షిఫ్ట్ డ్యూటీ నిర్వహించలేక మధ్యలోనే చేతులెత్తేశాయట.. ఒకటి చెత్తబుట్టను చూసి అక్కడి నుంచి పారిపోగా.. మరొకటి పని చేయడకుండా అలాగే ఉండిపోయిందట...

ఈ విచిత్ర ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది..చైనాలోని షాంఘై నగరంలో ప్రముఖ రోబోట్ సంస్థ ఎజిబాట్, తమ అత్యాధునిక సాంకేతికతను చెక్ చేసేందుకు ఒక వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారట.. శుహుయ్ ప్రాంతంలోని ఓ రియల్ కన్వీనియన్స్ స్టోర్‌లో 6 జి 2 హ్యూమనాయిడ్ రోబోలను 24 గంటల పూర్తిగా షిఫ్ట్ ఉద్యోగంలో పెట్టారట.. ం

"బోట్స్ నెవర్ క్లాక్ అవుట్ పేరుతో ఈ ఛాలెంజ్‌ను నవంబర్ 2 ఉదయం 10 గంటల నుంచి నవంబర్ 3 ఉదయం వరకు కొన్ని సోషల్ మీడియాల్లో లైవ్‌స్ట్రీమ్ కూడా చేశారు.ఈ సమయంలో రోబోలు లంచ్ రద్దీతో పాటు సాయంత్రం వేళల్లో కస్టమర్ల రద్దీ, రాత్రి షిఫ్ట్‌లు, ఉదయం టిఫిన్స్ సమయాల్లో పనులు చేయాల్సి వచ్చింది. మొత్తం 24 గంటల్లో ఈ 6 రోబోలు కలిసి దాదాపు 1,730 పనులను పూర్తి చేశాయట.. వీటిలో 683 సార్లు కస్టమర్స్‌కి నమస్కరిస్తూ స్వాగతం పలకడం.. 369 సార్లు వస్తువులను ఇవ్వడం, 147 కప్పుల కాఫీ తయారు చేయడంతో పాటు 126 హాట్-ఫుడ్ ఆర్డర్లు చేయడంతో పాటు 277 సార్లు షెల్ఫ్‌లలో సరుకులను అటుఇటు పెట్టడం.. 128 సార్లు టేబుల్స్ శుభ్రం చేయడం వంటి పనులు చేశాయి..

పనులు చురుగ్గానే చేసినట్లు నిపించినా.. ఫైనల్ రిజల్ట్ సమయంలో సంస్థకు ఊహించని షాక్ తగిలింది.. ట్రయల్ రన్‌లో ఆరింటిలో నాలుగు రోబోలు మాత్రమే బాగా పని చేశాయి. రెండు రోబోలు పూర్తిగా ఫెయిల్ అయ్యాయి..నైట్ షిఫ్ట్‌లో పనులు చేస్తున్న రోబోకు ఒక్కసారిగా చెత్తతో నిండిన డస్ట్‌బిన్ కనిపించాయి. అది చూడగానే అయోమయానికి గురైన ఆ రోబో.. మార్గం తప్పి స్టోర్ తలుపుల నుంచి బయటకు నడుచుకుంటూ వెళ్లిపోయిందట. తిరిగి తన పని ప్రదేశానికి రాకుండా ఉండిపోయిందట. దీంతో చెత్తను చూసి రోబో ఉద్యోగం వదిలి పారిపోయిందంటూ నెటిజన్లు సరదాగా కామెంట్లు కూడా చేశారు. ఇప్పుడు ఈ రోబోలకు సంబంధించిన వింత వింత విశేషాలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

టూరిజం ముసుగులో కరాచీ వద్ద ఉగ్రవాదులకు

పాకిస్థాన్ స్కూబా డైవింగ్‌లో శిక్షణ.. సంచలన నివేదిక



2008 నవంబరు 26న ముంబయి నగరంలోకి సముద్ర మార్గంలో చొరబడిన లష్కరే తొయిబా ఉగ్రవాదులు.. మారణ హోమానికి తెగబడ్డారు. మళ్లీ అలాంటి తరహా దాడులకు పాక్ ఉగ్రవాదులు ప్రయత్నిస్తున్నారు. అందుకోసం వీరికి పాకిస్థాన్ టూరిజం ముసుగులో మెరైన్ శిక్షణ ఇస్తున్నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. కరాచీకి సమీపంలోని ప్రముఖ పర్యాటక కేంద్రంలో ఈ శిక్షణ కొనసాగుతోంది. అక్కడ ఛార్నా దీవిలోని స్కూబా డైవింగ్ కోసం పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. ఉగ్రవాదులకు ఇక్కడ శిక్షణ కొనసాగుతోంది.టూరిజం ముసుగులో ఉగ్రవాదులకు ప్రముఖ పర్యాటక ప్రాంతంలో స్కూబా డైవింగ్, కాంబ్యాట్ స్విమ్మింగ్, నీటి అడుగున చేపట్టే ఇతర సైనిక తరహా యాక్టివిటీస్‌లో పాకిస్థాన్ శిక్షణ ఇస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. సముద్ర మార్గం గుండా దాడులకు కుట్ర పన్నుతోన్న పాక్ ఉగ్రవాద సంస్థ ' లష్కరే తొయిబా ' (గ్రూప) కరాచీకి కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఛార్నా దీవి వద్ద ఈ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు ఆధారాలు బయటపడ్డాయి. శిక్షణ పొందుతున్న ఈ బృందాన్ని 'దావా మెరైన్ వింగ్' లేదా 'సదా-ఎ-హుర్రియత్' అని నిఘా సంస్థలు పిలుస్తున్నాయి.గతంలో పాక్ ఆక్రమిత కాశ్మీర్ (గ్రాశీ)లోని మంగ్లా డ్యామ్‌లో, అలాగే కొన్ని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్లలో నిర్మించిన స్విమ్మింగ్ పూల్స్‌లో లష్కరే ఉగ్రవాదులు శిక్షణ పొందినట్లు తేలింది. వీటిలో కొన్నింటిని భారత్ గతంలో క్షిపణులు, బాంబులతో ధ్వంసం చేసింది. ప్రస్తుతం కరాచీ వద్ద పర్యాటకం పేరుతో గడపడానికి వచ్చిన టూరిస్ట్‌లుగా నటిస్తూ శిక్షణ పొందుతున్నారు. లష్కరే తొయిబాకు అనుబంధంగా పనిచేసే 'పాకిస్థానీ మార్కజీ ముస్లిం లీగ్' (గ్రూవీమీ) సభ్యులు వీరికి శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు.

లష్కరే మెరైన్ వింగ్

26/11 ముంబయి దాడుల సమయంలో లష్కర్ ఉగ్రవాదులు సముద్ర మార్గం ద్వారానే నగరంలోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. 2008 నుంచి చిన్నపాటి మెరైన్ వింగ్‌ను నిర్వహిస్తున్న ఈ సంస్థ.. ఇప్పుడు సముద్రం ద్వారా భారీ దాడులు జరపేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయితే భారత రక్షణ, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు ఈ పరిణామాలపై పూర్తి అప్రమత్తతో ఉన్నాయని, సముద్ర మార్గంలో వచ్చే ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాయని నిఘా వర్గాలు తెలిపాయి.గతేడాది పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ భూభాగం మురిద్కేలో ఉన్న లష్కర్ ప్రధాన కార్యాలయంతో పాటు నియంత్రణ రేఖ సమీపంలో ఉన్న తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను క్షిపణి దాడులతో భారత సైన్యం ధ్వంసం చేసింది.

కశ్మీర్‌లో కౌంటర్ ఇంటెలిజెన్స్ సోదాలు

సోషల్ మీడియా ద్వారా యువతను తీవ్రవాదం వైపు మళ్లించి, నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్న లష్కర్ మాడ్యూల్‌ను గుర్తించిన కౌంటర్ ఇంటెలిజెన్స్ కశ్మీర్ (జ×ఖ).. బుద్గామ్, శ్రీనగర్, బిజ్‌బెహరా, అనంత్‌నాగ్‌లోని మట్టన్, పుల్వామాలోని ఒక గ్రామంలో సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో అనేక అనుమానాస్పద డిజిటల్ పరికరాలు, పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.విచారణలో భాగంగా 22 ఏళ్ల గ్రాడ్యుయేట్ మహమ్మద్ యాసిన్ మీర్ ఇంట్లో కూడా తనిఖీలు చేపట్టారు. పాకిస్థాన్ పౌరురాలైన యాసిన్ తల్లి తబస్సుమ్ గతేడాది ఏప్రిల్ 29న ఆ దేశానికి వెళ్లి తిరిగి రాలేదు. ఆమెకు వీసా నిరాకరించారా లేదా ఆమె ఉద్దేశపూర్వకంగా రాలేదా అనేది స్పష్టం కాలేదు. అయితే ఆమె తన కుమారుడితో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని, ఆ కోణంలో కూడా సీఐకే లోతుగా విచారణ జరుపుతోంది.

పవన్ కల్యాణ్ కు తప్పుడు నివేదికలు ఇస్తున్నారా?



మున్సిపల్ ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థులు భారీ విజయాన్ని సాధించారు అయినా సరే జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాత్రం స్పందించలేదు. ఫలితాలపై ఆయన మౌనంగానే ఉన్నారు. అందుకు గల కారణాలపై పార్టీలోనూ, రాజకీయంగా చర్చజరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో జనసేన పార్టీ సాధించిన విజయంపై పవన్ కల్యాణ్ ఒక ప్రకటనను విడుదల చేశారు. ఈవీఎం, బ్యాలెట్ ఏదైనా విజయం కూటమిదేనని ప్రకటనలో పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయిన ప్రతిపక్షాలు ఈవీఎంలపై విమర్శలు చేశాయని, అయితే ఇప్పుడు బ్యాలెట్ పద్ధతిలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రజలు కూటమికి అఖండ విజయాన్ని అందించి ప్రతిపక్షాల విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ విజయం కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలపై పట్టణ ఓటర్లు ఉంచిన నమ్మకానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

100శాతం స్ట్రయిక్ రేట్ పై హర్షం వ్యక్తం చేసినా...

జనసేన పార్టీ పోటీ చేసిన అన్ని స్థానాల్లోనూ రెండు మేయర్ స్థానాలు, పదిహేను మున్సిపల్ చైర్మన్, 3 నగర పంచాయతీ స్థానాలు కలిపి మొత్తం 20 చోట్ల విజయం సాధించి 100 శాతం స్ట్రయిక్ రేట్ రిపీట్ చేయడంపై పవన్ కల్యాణ్ సంతోషం వ్యక్తం చేస్తూ, పట్టణ ఓటర్ల ఆదరణ ఎంతో అమూల్యమైనదని కొనియాడారు.కూటమి అభ్యర్థుల గెలుపునకు రాత్రింబవళ్లు శ్రమించిన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు మరియు తమపై నమ్మకం ఉంచిన ఓటర్లకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అయితే ఒకింత ఆయనకు ఈ స్థానిక సంస్థల ఎన్నికలు తలనొప్పిగా మారాయని చెప్పాలి. సొంత పార్టీ క్యాడర్, జనసైనికుల నుంచి కొంత అసంతృప్తి ఎదురయింది. అనేక ప్రాంతాల్లో రెబెల్స్ పోటీ చేయడం తోపాటు కూటమిలోని మిత్ర పక్ష పార్టీలే అభ్యర్థులుగా బరిలోకి దిగడం జనసేన ఖరారయిన అభ్యర్థులు గెలిచినా టెన్షన్ పెట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రెబెల్స్ బరిలో దిగి..

కొన్ని చోట్ల తమకు బలమున్న అభ్యర్థులను కూడా ఎంపిక చేయకపోవడాన్ని పవన్ కల్యాణ్ దృష్టికి కొందరు తీసుకెళ్లతున్నారు. పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలోనే కూటమి అభ్యర్థులు కాకుండా, రెబెల్స్ గెలవడాన్ని కూడా కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. తన సొంత నియోజకవర్గంలోనూ అభ్యర్థుల ఎంపిక సరైన తీరిలో జరగలేదన్న అసహనంతో పవన్ కల్యాణ్ ఉన్నారని తెలిసింది. అలాగే ఆదోని మున్సిపల్ కార్పొరేషన్ విషయంలో బలమున్న నేతను ఎంపిక చేయకపోగా, అది టీడీపీకి వదిలేయడం, జనసేన రెబల్ అభ్యర్థి గెలవడాన్ని కూడా కొందరు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకొచ్చారు. పవన్ కల్యాణ్ ను కొందరు కావాలనే తప్పుదోవ పట్టిస్తున్నారని, బలమైన , గెలిచే స్థానాలు కాకుండా, అభ్యర్థుల ఎంపికలోనూ వారి ఇష్టమొచ్చినట్లు వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ గెలుపుపై మాట్లాడినా అభ్యర్థుల ఎంపిక, జనసేన రెబెల్స్ గెలవడం వంటి అంశాలను సీరియస్ గా తీసుకున్నారని తెలిసింది.

సింహాచలం ఆలయంలో కొత్త రూల్ అమలు.. ఇకపై డ్రెస్‌కోడ్ తప్పనిసరి, లేకపోతే దర్శనానికి అనుమతించరు

విశాఖపట్నం జిల్లా సింహాచలం అప్పన్న ఆలయంలో కొత్త రూల్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. సింహాచలం క్షేత్ర పవిత్రత, ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని పరిరక్షించే ఉద్దేశంతో శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానాన్ని దర్శించుకునే భక్తులందరికీ సాంప్రదాయ దుస్తుల నియమావళిని (డ్రెస్ కోడ్) అమలు చేస్తున్నట్లు ఆలయ ఈవో వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. మన సనాతన ధర్మ సంస్కృతి, సంప్రదాయాలు, దైవ సన్నిధి పట్ల భక్తి ప్రపత్తులను ప్రతిబింబించేలా భక్తులు ఆలయ మర్యాదలను గౌరవించాలని ఈవో విజ్ఞప్తి చేశారు. శ్రీ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు నిర్దేశించిన వస్త్రధారణ నిబంధనలను పాటించాలని సూచించారు.పురుషులు ధోతీతో పాటు అంగవస్త్రం (కండువా), కుర్తా--పైజామా లేదా సంప్రదాయబద్ధమైన ఫార్మల్ షర్ట్ ప్యాంట్ ధరించి ఆలయంలోనికి ప్రవేశించవచ్చు. మహిళలు చీర, లంగావోణీ (హాఫ్ శారీ) లేదా దుపట్టాతో కూడిన చుడీదార్‌లను మాత్రమే అనుమతిస్తారు. షార్ట్స్ (నిక్కర్లు), టీ-షర్టులు, స్లీవ్‌లెస్ టాప్స్, మోడ్రన్ వెస్టర్న్ దుస్తులు ధరించి వచ్చే భక్తులకు ఆలయ ప్రాంగణంలోనికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదన్నారు. అంతేకాదు సింహాచలం ఆలయంలో స్వామివారి నిత్య కల్యాణం, తదితర ఆర్జిత సేవల్లో పాల్గొనే పురుష భక్తులు తప్పనిసరిగా ధోతీ--అంగవస్త్రం లేదా సాంప్రదాయ కుర్తా--పైజామా ధరించాలన్నారు.ఆర్జిత సేవల్లో పాల్గొనే మహిళా భక్తులు చీర, లంగావోణీ లేదా తప్పనిసరిగా దుపట్టా ధరించిన చుడీదార్‌లతో మాత్రమే సేవలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. చిన్నపిల్లలు కూడా సంప్రదాయబద్ధమైన దుస్తులను ధరించాలని, పెద్ద పిల్లలు దేవస్థానం నిర్దేశించిన నియమావళిని తప్పకుండా పాటించాలని సూచించారు. ఆలయ అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రమని, ఆలయ పవిత్రతను కాపాడటంలో ప్రతి ఒక్క భక్తుడూ భాగస్వామ్యం కావాలని, సిబ్బందికి, భద్రతా విభాగాలకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఈవో కోరారు. దుస్తుల నిబంధనలపై భక్తులందరికీ అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తామన్నారు.

లంచం కేసులో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారి అరెస్ట్

ఏలూరులో ఓ ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) ఏలూరు ప్రాంతీయ కార్యాలయంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఎ. సీతారామచంద్రమూర్తి, రూ. 30,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు.ఏలూరు జిల్లా నవాబుపేట కాలనీకి చెందిన మత్తె బాబీ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు కార్యాలయంపై దాడులు నిర్వహించారు.

శుక్రవారం సాయంత్రం 5:55 గంటల సమయంలో ఏలూరు పవర్‌పేట రోడ్డులోని ఏపీపీసీబీ కార్యాలయంలో సీతారామచంద్రమూర్తి లంచం తీసుకుంటుండగా అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఏలూరు ఏసీబీ రేంజ్ కార్యాలయంలో అవినీతి నిరోధక చట్టం-2018 సెక్షన్ 7 కింద కేసు నమోదు చేశారు.నిందితుడు సీతారామచంద్రమూర్తి 2007లో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్‌గా విధుల్లో చేరారు. వరంగల్, హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ వంటి పలు ప్రాంతాల్లో పనిచేసిన ఆయన, 2025 జనవరిలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్‌గా పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఆయన ఏలూరులో విధులు నిర్వర్తిస్తున్నారు.

దూసుకొస్తున్న మరో అల్పపీడనం

ఈ జిల్లాల్లో భారీ వర్షాలు - తాజా హెచ్చరికలు



ఏపీని వరుస తుఫాన్లు వెంటాడుతున్నాయి. ఆర్నాబ్, మురుసు తుఫాన్ల నుంచి పూర్తిగా కోలుకోక ముందే మరోసారి వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వెల్లడించింది. ఈ క్రమంలోనే.. తూర్పు తెలంగాణ, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర కోస్తాంధ్ర ప్రాంతాలపై గురువారం ఏర్పడిన ఉపరితల ఆవర్తనం స్థిరంగా కొనసాగు తోంది. ప్రస్తుతం సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఈ ఆవర్తన ప్రభావంతో రాగల మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తోంది. వాతావరణ శాఖ మరో కీలక సమాచారం వెల్లడించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో 13న అల్పపీడనం ఏర్పడుతుందని ప్రకటించింది. అది పశ్చిమ వాయవ్యంగా పయనించి 15 నాటికి నైరుతి బంగాళాఖాతంలో ప్రవేశించనుందని పేర్కొంది. అయితే ఈ వాయుగుండం బలపడు తుందా..తమిళనాడు తీరం దిశగా వస్తుందా అనేది స్పష్టత రావాల్సి ఉంది. అయితే వాయు గుండం గా బలపడిన తర్వాత నైరుతి బంగాళాఖాతంలోకి వచ్చే సమయంలో తమిళనాడు, ఏపీ లోని దక్షిణ కోస్తా, రాయలసీమల్లో వర్షాలు కురుస్తాయని తెలిపారు. శనివారం పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. తెలంగాణలో కూడా అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.కాగా.. నవంబర్ 12 నుండి 18 వరకు తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ రోజు నుంచి కోస్తాంధ్ర – రాయలసీమ: అల్లూరి సీతారామరాజు, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కృష్ణా, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశముందని వెల్లడించారు. అదే విధంగా తెలంగాణ జిల్లాలైన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ఆకాశం మేఘావృతమై ఉండి, సాయంత్రం లేదా రాత్రి వేళల్లో ఈదురుగాలులతో కూడిన జల్లులు కురిసే అవకాశముంది.

‘ఉక్కుపాదంతో అణచివేస్తాం’

సీజేఐపై కేరళ కాంగ్రెస్ పోస్ట్‌కు సుప్రీంకోర్టు ధిక్కార నోటీసు



ప్రధాన న్యాయమూర్తి (జజీ×) జస్టిస్ సూర్య కాంత్‌ను లక్ష్యంగా చేసుకుని కేరళ కాంగ్రెస్ కమిటీ సోషల్ మీడియాలో పెట్టిన వివాదాస్పద పోస్ట్‌పై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. భావప్రకటనా స్వేచ్ఛను ఆయుధంగా వాడుకుని న్యాయపాలనలో జోక్యం చేసుకోలేరని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. "తీర్పులను విమర్శించే హక్కు ఎప్పుడూ ఉంటుంది, కానీ న్యాయపరిపాలన ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి భావప్రకటనా స్వేచ్ఛను ఆయుధంగా వాడకూడదు" అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. న్యాయస్థానాల అధికారాలను దిగజార్చేందుకు జరిగే ఎలాంటి ప్రయత్నాన్నైనా ఉక్కుపాదంతో అణచివేయాల్సిన అవసరం ఉందని కోర్టు పేర్కొంది. ఈ మేరకు కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీకి కోర్టుధిక్కార నోటీసులు జారీ చేసింది.

రాజ్యాంగమే గొప్పది


రాజ్యాంగ ఔన్నత్యాన్ని పునరుద్ఘాటిస్తూ "రాజ్యాంగమే అత్యున్నతమైనది. ఏ వ్యక్తి గానీ, రాజకీయ సంస్థ గానీ దానికంటే ఉన్నతస్థానంలో లేరు" అని కోర్టు స్పష్టం చేసింది. సోషల్ మీడియా పోస్ట్‌పై వచ్చిన ఫిర్యాదును ఆధారంగా చేసుకుని సుప్రీంకోర్టు సుమోటాగా పిటిషన్ నమోదు చేసింది. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పేర్కొన్న ప్రకారం.. అక్టోబర్ 13న ప్రధాన న్యాయమూర్తికి సీనియర్ లాయర్ వినీత్ జిందాల్ అందించిన ఫిర్యాదును అక్టోబర్ 30న రిట్ పిటిషన్‌గా నమోదు చేసింది.అలాగే, అక్టోబర్ 12న సాయంత్రం రాహుల్ గాంధీ, ఇతర నాయకులు సుప్రీంకోర్టు ప్రాంగణంలో నిర్వహించిన నిరసన ఎలాంటి అనుమతి లేకుండా జరిగిందా? దానివల్ల లాయర్లు, కక్షిదార్లు, లేదా కోర్టు సిబ్బంది రాకపోకలకు ఏదైనా ఆటంకం కలిగిందా? అనే అంశంపై కూడా అధికారులతో దర్యాప్తు చేయించాలని కూడా ఆ ఫిర్యాదులో కోరారు.

కాంగ్రెస్ వివరణ

అక్టోబర్ 12న కేరళ కాంగ్రెస్ అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో సీజేఐని ఉద్దేశించి పెట్టిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అయి తీవ్ర విమర్శలకు దారితీసింది. దాంతో ఆ పోస్టును డిలీట్ చేసిన పార్టీ, దాన్ని ప్రచురించిన బాధ్యున్ని పదవి నుంచి తొలగించింది. ఈ వివాదంపై కేపీసీసీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్ మాట్లాడుతూ... పార్టీ హైకమాండ్‌తో ఎలాంటి సంప్రదింపులు జరుపకుండా ఆ వివాదాస్పద పోస్ట్ పెట్టారని వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీకి న్యాయవ్యవస్థ నిష్పాక్షికతపై ఎలాంటి విభేదాలు లేవని ఆయన స్పష్టం చేశారు.

ఏఐ బుడగ పేలుతోందా?

ఒక్కరోజే రూ.లక్షల కోట్ల సంపద ఆవిరి



మానవ చరిత్రలోనే అత్యంత పెద్ద సాంకేతిక విప్లవంగా భావించిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఇప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను తీవ్ర భయాందోళనలోకి నెట్టివేస్తోంది. ఏఐ ఆధారితప్రాజెక్టులు, ఉత్పత్తులలో దిగ్గజ సాంకేతిక సంస్థలు వేల బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టినప్పటికీ.. వాటి నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోవడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా మారింది. ఏఐ రంగంలో ఊహించిన స్థాయిలో లాభాలు లేకపోవడంతో అంతర్జాతీయ మార్కెట్లలో ఏఐ ఆధారిత షేర్ల భారీ అమ్మకాలు మొదలై.. అమెరికా, చైనా, దక్షిణ కొరియా వంటి దేశాల స్టాక్ మార్కెట్లను కుదిపేస్తున్నాయి.

ఒక్కరోజే ఊడ్చిపెట్టుకుపోయిన 2.5 ట్రిలియన్ డాలర్లు

అమెరికా షేర్ మార్కెట్లో ఏఐ టెక్నాలజీ షేర్ల సూచీ అయిన 'నాస్‌డాక్ 100' గురువారం ఒక్కరోజే ఏకంగా 6 శాతం పతనమైంది. మార్చి 2020 తర్వాత ఒకే రోజులో నమోదైన అతిపెద్ద పతనం ఇది. అమెరికా మార్కెట్లో గురువారం ఒక్కరోజే 2.5 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడిదారుల సంపద ఆవిరైపోగా.. అందులో దాదాపు ట్రిలియన్ డాలర్లు కేవలం ఏఐ ఆధారిత టెక్ దిగ్గజాలదే కావడం గమనార్హం. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఓపెన్ ఏఐ, ఎన్‌విడియా, మెటా వంటి సంస్థల షేర్లు 25 శాతం వరకు పడిపోయాయి.

ఊగిసలాడుతున్న చైనా, దక్షిణ కొరియా

ఏఐ మోడళ్లను శిక్షణ ఇవ్వడానికి, డేటా సెంటర్లు, చిప్స్ తయారీకి వేల కోట్ల డాలర్లు ఖర్చు చేస్తున్నప్పటికీ.. దానికి తగ్గట్టుగా రెవెన్యూ జెనరేట్ చేసే స్పష్టమైన రోడ్ మ్యాప్ ఏ కంపెనీ దగ్గర లేకపోవడం పెట్టుబడిదారుల నమ్మకాన్ని దెబ్బతీసింది. ఏఐ హార్డ్‌వేర్, సెమీకండక్టర్ రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టిన చైనాలోని స్టార్టప్స్, షేర్ మార్కెట్లు కూడా గత కొన్ని రోజులుగా పతన బాటలో పడ్డాయి.

ఏఐ ఆధారిత చిప్స్ సప్లైకి ప్రధాన కేంద్రంగా ఉన్న దక్షిణ కొరియా మార్కెట్లో గురువారం అమ్మకాల ఒత్తిడి కారణంగా ఏకంగా 20 నిమిషాల పాటు ట్రేడింగ్‌ను నిలిపివేయాల్సి వచ్చింది. శామ్‌సంగ్, ఎస్కే హైనిక్స్ వంటి సంస్థల షేర్లు విపరీతంగా క్షీణించాయి.

భారత్‌పై పడే ప్రభావం ఎంత?

సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, బిజినెస్ ప్రాసెస్ ఔట్ సోర్సింగ్(బీపీవో) సేవల కేంద్రంగా ఉన్న భారత్, ఫిలిప్పీన్స్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల ఐటీ సేవల రంగానికి ఇది తాత్కాలిక సవాలుగా మారే అవకాశం ఉందనడంలో సందేహం లేదు. రాబోయే రోజుల్లో ఏఐ ప్రాజెక్టులు ఆర్థికంగా స్థిరమైన ఫలితాలు ఇవ్వకపోతే.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత తీవ్రమైన మాంద్యంలోకి జారుకునే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

8 ఏళ్ల క్రితం ప్రేమ పెళ్లి.. ఇప్పుడు పొరుగింటి కుర్రాడితో ఎఫైర్..

చివరకు రైలు కింద ఇద్దరూ మృతి



ప్రియుడితో కలిసి ఓ వివాహిత రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. కర్ణాటకలోని మండ్య నగర శివారులో శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం.. బెంగళూరుకు చెందిన సహనా (25) ఎనిమిదేళ్ల కిందట ఆటో డ్రైవర్ వీరేశ్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. ఈ దంపతులకు ఆరేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు ఉన్నారు. వీరు బెంగళూరులోని మదనాయకనహళ్లిలో నివసిస్తున్నారు. అదే ప్రాంతంలో పొరుగున ఉండే రాహుల్‌తో సహనాకు పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం వీరేశ్‌కు తెలియడంతో భార్యాభర్తల మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. దీనిపై కుటుంబ పెద్దలు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.ఇదే విషయంపై సోమవారం కూడా సహనా దంపతుల మధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. దీంతో మంగళవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. మండ్యా జిల్లాలోని గున్నాయకనహళ్లిలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది.

సహనా అమ్మమ్మ ఇంటికి వెళ్లిన విషయం తెలుసుకున్న రాహుల్ గురువారం అక్కడికి చేరుకున్నాడు. ఇద్దరూ కలిసి వీరేశ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయాలని అనుకున్నారు. కానీ ఇంతలోనే అనూహ్య ఘటన చోటుచేసుకుంది.మండ్య శివారులోని ఇందువాల ప్రాంతం వీసీ ఫామ్ రైల్వే గేట్ సమీపంలో కదులుతున్న రైలులో నుంచి కిందపడి సహనా, రాహుల్ మృతిచెందారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాలను మిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై మండ్య రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇద్దరూ ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయినప్పటికీ మరణాలకు దారితీసిన పరిస్థితులు, ఇతర కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ కు రాహుల్ గాంధీ, ఖర్గే-భేటీ.. నిర్ణయాలు



హైదరాబాద్ మరో కీలక సమావేశానికి వేదికగా నిలుస్తోంది. పలువురు ప్రముఖులు ఈ సమ్మిట్ కు తరలి వస్తున్నారు. హెచ్ఐసీసీలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరగనున్న భారత్ సమ్మిట్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. సదస్సు జరిగే మూడు రోజుల్లో ఏదో ఒక రోజు ఆయన హాజరై కీలక ఉపన్యాసం చేస్తారని వెల్లడించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో జరగనున్న ఈ సదస్సుకు వంద దేశాలకు చెందిన 450 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ ప్రతినిధుల్లో పారిశ్రామిక వేత్తలతో పాటుగా పలు ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన అగ్ర నాయకులు ఉన్నారు. ఏఐ, డిజిటల్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, ఆర్థికాభివృద్ధి, ద్వైపాక్షిక సంబంధాలు, గ్లోబల్ పార్టనర్‌షిప్ అనే అంశాలపైన ఈ సదస్సులో ప్రధానంగా చర్చించనున్నారు.


అగ్రనేతల పర్యటనలు

కాగా, కాంగ్రెస్ చీఫ్ ఖర్గే సైతం ఈ సమ్మిట్ లో పాల్గొనేందుకు రానున్నారు. పార్టీ ముఖ్య నేతలతో భేటీ కానున్నారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితులపైన సమీక్షతో పాటుగా కీలక దిశా నిర్దేశం చేసే ఛాన్స్ ఉందని తెలుస్తోంది. అదే విధంగా ప్రధాని నరేంద్ర మోదీ డిసెంబరు రెండో వారంలో రాష్ట్ర పర్యటనకు రానున్నారు. వరంగల్ విమానాశ్రయంతోపాటు సమ్మక్క-సారక్క గిరిజన యూనివర్సిటీకి ఆయన శంకుస్థాపన చేయనున్నారు. మొదటి దశలో సుమారు రూ.550 కోట్ల అంచనాతో గిరిజన యూనివర్సిటీ భవన నిర్మాణ పనులు చేపట్టనున్నారు. అలాగే, రూ.700కోట్ల వ్యయంతో నిర్మించిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీని ప్రధాని ప్రారంభించనున్నారు. రూ. 2,250 కోట్లతో నిర్మించిన వరంగల్-కరీంనగర్(ఎన్‌హెచ్563) జాతీయ రహదారిని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం, వరంగల్‌లో పార్టీ కార్యకర్తలతో నిర్వహించే బహిరంగసభకు ప్రధాని హాజరవుతారని బీజేపీ వర్గాలు తెలిపాయి. దీంతో.. అగ్ర నేతల పర్యటనలతో తెలంగాణలో కొత్త రాజకీయ వ్యూహాలు ఆసక్తిగా మారుతున్నాయి.

నేను అడ్డుకోకుంటే ఇజ్రాయెల్ ఉండేది కాదు: ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌ను అణుబాంబు తయారు చేయకుండా తాను అడ్డుకోవడం వల్లే ఇజ్రాయెల్, మొత్తం పశ్చిమాసియా ఈ రోజు మనుగడలో ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో శుక్రవారం ఆయన ఒక పోస్ట్ పెట్టారు. "నేను ఇరాన్‌ను అణ్వాయుధం పొందకుండా ఆపకపోయి ఉంటే ఇజ్రాయెల్, నిజానికి పశ్చిమాసియా మొత్తం ఈ రోజు ఉండేవి కావు. ఈ విషయాన్ని ఎవరూ చెప్పడానికి ఇష్టపడరు, కానీ ఇది నిజమని అందరికీ తెలుసు!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ట్రంప్ చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా తాను అధ్యక్షుడిగా లేకపోతే ఇజ్రాయెల్ ఉనికిలో ఉండేది కాదని పలు సందర్భాల్లో చెప్పారు. ఇరాన్ తన అణు కార్యక్రమంపై ఒక కొత్త ప్రతిపాదనను అమెరికాకు అందించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్‌పై మరోసారి సైనిక దాడులు చేయాలా? వద్దా? అనే అంశంపై ట్రంప్ ప్రభుత్వం సమీక్షిస్తోంది. "మొత్తం దేశాన్ని నాశనం చేయడం నాకు ఇష్టం లేదు, కానీ బహుశా నేను అలా చేయాల్సి రావచ్చు" అని గురువారం ట్రంప్ విలేకరులతో అన్నారు. ఈ విషయంపై జాతీయ భద్రతా బృందంతో సమావేశాలు జరుగుతున్నాయని సీనియర్ అధికారులు ధ్రువీకరించారు. ఇరాన్ అణు సామర్థ్యాలను దెబ్బతీసే లక్ష్యంతో 2025, 2026 సంవత్సరాల్లో అమెరికా, ఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌లోని అణు, సైనిక కేంద్రాలపై భారీ దాడులు చేశాయి. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌తో పాటు, అమెరికా సైనిక స్థావరాలున్న గల్ఫ్ దేశాలపై దాడులకు పాల్పడింది. ఇదే సమయంలో, 2026 చివరి నాటికి ఇజ్రాయెల్‌కు ఏటా అందిస్తున్న 3.8 బిలియన్ డాలర్ల సైనిక సహాయాన్ని నిలిపివేయనున్నట్టు ట్రంప్ ఇటీవల ప్రకటించడం గమనార్హం. ఇది సహాయం నుంచి భాగస్వామ్యానికి మారడమేనని ఇజ్రాయెల్ అధికారులు వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు కాంగ్రెస్‌లోని రెండు సభల్లో ఆధిక్యం సాధించారు. ఇరాన్‌తో వివాదమే రిపబ్లికన్ల ఓటమికి కొంత కారణమని కొందరు విశ్లేషిస్తున్నారు. ఈ రాజకీయ పరిణామాల మధ్య, ఇరాన్‌ను నిలువరించడం తన ఘనతగా ట్రంప్ పదేపదే ప్రచారం చేసుకుంటున్నారు.

యెమెన్‌లో మార్కెట్‌పై వైమానిక దాడులు.. 30 మంది మృతి



నైరుతి యెమెన్‌లోని ఓ మార్కెట్‌పై శుక్రవారం వైమానిక దాడులు జరిగాయి. ఈ ఘటనలో కనీసం 30 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో ఎనిమిది మంది గాయపడ్డారు. ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ తిరుగుబాటుదారుల ఆరోగ్య శాఖ అధికార ప్రతినిధి అనీస్ అల్‌సబాహి ఎక్స్ వేదికగా ఈ వివరాలు వెల్లడించారు. సౌదీ అరేబియా మద్దతు ఉన్న ప్రభుత్వ బలగాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య మళ్లీ పోరు మొదలైన తర్వాత చోటుచేసుకున్న అత్యంత ప్రాణాంతక దాడుల్లో ఇది ఒకటి కానుంది. తైజ్ ప్రావిన్సులోని అల్-వజియా ప్రాంతంలో ఈ దాడులు జరిగాయి. ఈ ఘటనకు ఎవరు కారణమనే విషయంలో యెమెన్ ప్రభుత్వ బలగాలు, హౌతీ తిరుగుబాటుదారులు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. అయితే, ఇరు వర్గాల వాదనలను అసోసియేటెడ్ ప్రెస్ స్వతంత్రంగా నిర్ధారించలేకపోయింది. తైజ్ ప్రావిన్సులో ఎక్కువ భాగం హౌతీల ఆధీనంలో ఉంది. ప్రావిన్సు రాజధానిని కూడా వారు దిగ్బంధించారు. అక్కడే సౌదీ మద్దతు ఉన్న యెమెన్ ప్రభుత్వం, దాని బలగాలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అల్-మసీరా ప్రసారం చేసిన దృశ్యాల్లో దాడి జరిగిన ప్రాంతం నుంచి దట్టమైన పొగ పైకి ఎగసిపడటం కనిపించింది. మార్కెట్‌లోని ఓ భవనం దెబ్బతింది. అందులో ఉన్న క్యాన్లలోని ఆహార పదార్థాలు చెల్లాచెదురయ్యాయి. వాహనాలు ధ్వంసమయ్యాయి. పండ్ల పెట్టెలు, శిథిలాలు మార్కెట్ ప్రాంతమంతా పడి ఉన్నాయి.

దాడిపై పరస్పర ఆరోపణలు...

ఈ దాడికి హౌతీలే కారణమని తైజ్‌లోని యెమెన్ ప్రభుత్వ అనుబంధ అధికారులు ఆరోపించారు. ఆ ప్రాంతంలో ఎలాంటి వైమానిక దాడులు జరగలేదని స్పష్టం చేశారు. అయితే, తైజ్ ప్రావిన్సులోని అల్-వజియా ప్రాంతంలో ఉన్న అల్-హదారా మార్కెట్‌పై ఉదయం 7 గంటల సమయంలో మూడు వైమానిక దాడులు జరిగాయని హౌతీ సైనిక ప్రతినిధి యహ్యా సరియా వెల్లడించారు. ఈ దాడులకు సౌదీ అరేబియా కారణమని ఆరోపించారు. ఖమీస్ ముషైత్ వైమానిక స్థావరం నుంచి యుద్ధ విమానాలు బయలుదేరాయని, ఉదయం 8 గంటల సమయంలో తైజ్ ప్రావిన్సును విడిచిపెట్టాయని పేర్కొన్నారు. అయితే, తన వాదనలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపలేదు. ఈ ఆరోపణలపై స్పందించాలని కోరుతూ చేసిన విజ్ఞప్తులకు సౌదీ అరేబియా సమాచార మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించలేదు. దాడి సమయంలో మార్కెట్‌లో ఎంతమంది ఉన్నారనే విషయం స్పష్టంగా తెలియలేదు. అయితే, అరబ్ దేశాల్లో చాలా ప్రాంతాలకు శుక్రవారం సెలవు కావడంతో ఆ రోజు మార్కెట్లు రద్దీగా ఉంటాయి. రద్దీగా ఉండే మార్కెట్‌పై దాడి జరిగినట్లు ప్రావిన్సు మీడియా కార్యాలయం ఫేస్‌బుక్ ప్రకటనలో అంగీకరించింది. ఈ ఘటనలో ప్రాణనష్టం సంభవించిందని తెలిపింది. అయితే, మృతుల సంఖ్యను వెల్లడించలేదు. హౌతీలు విచక్షణారహితంగా క్షిపణి దాడులు చేస్తున్నారని, బాలిస్టిక్ క్షిపణులను కూడా ప్రయోగిస్తున్నారని మీడియా కార్యాలయం ఆరోపించింది. ఈ దాడులు పౌరుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని పేర్కొంది. మార్కెట్లు, జనావాస ప్రాంతాలకు రక్షణ కల్పించాలని స్పష్టం చేసింది.

గతంలోనూ తీవ్ర దాడులు...

గత నెలలో దక్షిణ ప్రావిన్సు షబ్వాలోని ఓ సైనిక శిబిరంపై హౌతీలు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేశారు. ఈ ఘటనలో కనీసం 75 మంది సైనికులు మృతి చెందగా, దాదాపు 200 మంది కొత్తగా చేరిన సైనికులు గాయపడ్డారు. అప్పట్లో ఆ శిబిరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు హౌతీలు అంగీకరించారు. అంతకుముందు సెప్టెంబరులో దేశ ఉత్తర ప్రాంతంలోని ఓ జైలుపై సౌదీ అరేబియా దాడి చేసిందని హౌతీలు ఆరోపించారు. అల్-జౌఫ్ ప్రావిన్సు రాజధాని హజ్మ్‌లో ఉన్న ఆ జైలు.. సంకీర్ణ దళాల వైమానిక దాడులతో కూలిపోయిందని, ఈ ఘటనలో కనీసం 23 మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. దక్షిణ యెమెన్‌లోకి ప్రవేశించేందుకు వ్యూహాత్మకంగా కీలకమైన తైజ్‌పై హౌతీలు సెప్టెంబరులో దాడులు ముమ్మరం చేశారు. అంతకుముందు ఎర్ర సముద్రంలో నౌకాయాన నియంత్రణకు కీలకమైన మొఖా ఓడరేవు నగరాన్ని వేగంగా స్వాధీనం చేసుకున్నారు. అది తైజ్‌కు దాదాపు 130 కిలోమీటర్ల దూరంలో ఉంది. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన యెమెన్ ప్రభుత్వ ఆధీనంలోని తైజ్ నగరాన్ని హౌతీలు చుట్టుముట్టడాన్ని మరింత కట్టుదిట్టం చేశారు. దీంతో అక్కడి పౌరుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. నగరంలోకి రాకపోకలను హౌతీలు అడ్డుకోవడంతో ప్రజలు తాగునీరు, ఆహారం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తైజ్ చుట్టుపక్కల కొండ ప్రాంతాల్లో హౌతీలను అడ్డుకునేందుకు ప్రభుత్వ బలగాలు ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా నగరానికి తూర్పు వైపున వారికి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతోంది. తైజ్ నగరాన్ని స్వాధీనం చేసుకుంటే దక్షిణాన ఉన్న ఏడెన్, లహ్జ్ ప్రాంతాల వైపు ముందుకు వెళ్లేందుకు హౌతీలకు మార్గం సుగమమవుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే, తైజ్‌ను స్వాధీనం చేసుకోవడం అంత సులభం కాదని నిపుణులు గతంలో అభిప్రాయపడ్డారు.

ఇరాన్ అణు రహస్యాలు చెబితే
రూ.166 కోట్లు.. అమెరికా సంచలన ఆఫర్



ఇరాన్ అణు కార్యక్రమంపై కీలక సమాచారం అందించిన వారికి 20 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 166 కోట్లు) వరకు భారీ రివార్డును అమెరికా ప్రకటించింది. శుక్రవారం యూఎస్ సెంట్రల్ కమాండ్ ఈ సంచలన ప్రకటన విడుదల చేసింది. సమాచారం అందించిన వారికి అవసరమైతే పునరావాసం కూడా కల్పిస్తామని స్పష్టం చేసింది. అమెరికా విదేశాంగ శాఖకు చెందిన 'రివార్డ్స్ ఫర్ జస్టిస్' కార్యక్రమం కింద ఈ ఆఫర్‌ను ప్రకటించారు. ఇరాన్ అణు కేంద్రాలు, వాటిలో ఉపయోగించే పరికరాలు, ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్న శాస్త్రవేత్తలు, ఇతర సిబ్బంది వివరాలు అందించాలని కోరారు. సిగ్నల్ లేదా టోర్ ఆధారిత చానెల్ ద్వారా ఈ సమాచారాన్ని రహస్యంగా పంపవచ్చని సూచించారు. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) నిబంధనలను ఇరాన్ ఉల్లంఘిస్తోందని, దీనివల్ల సెంట్రిఫ్యూజ్‌ల వంటి కీలక పరికరాల ఉత్పత్తి, నిల్వలపై పర్యవేక్షణ లేకుండా పోయిందని అమెరికా విదేశాంగ శాఖ ఆరోపించింది. మరోవైపు, ఈ ప్రకటనకు ముందు ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్ బీచ్‌లో మాట్లాడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మనం ఇరాన్‌పై దాడి చేయకపోయి ఉంటే, ఈ రోజు ఇజ్రాయెల్ ఉండేది కాదు. వారికి అణ్వాయుధాలు చిక్కి ఉంటే తప్పకుండా వాడేవారు" అని ఆయన అన్నారు. గత ఎనిమిది నెలల ఘర్షణతో ఇరాన్ ఆర్థికంగా, సైనికంగా తీవ్రంగా దెబ్బతిన్నదని, ఇప్పుడు ఒప్పందం కోసం ఆరాటపడుతోందని ట్రంప్ పేర్కొన్నారు. మధ్య ఇరాన్‌లోని 'పికాక్స్ మౌంటెన్' వంటి ఒకటి రెండు ప్రాంతాలపై ఇంకా దృష్టి సారించాల్సి ఉందని ఆయన తెలిపారు. అయితే, ట్రంప్ ఆరోపణలను ఇరాన్ అధికారులు ఖండించారు. 'పికాక్స్ మౌంటెన్'కు అణు కార్యకలాపాలతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ సంక్షోభాన్ని చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి టెహ్రాన్ సిద్ధంగా ఉందని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఇటీవలే స్పష్టం చేయడం గమనార్హం.

పారగ్వే అధ్యక్షుడి పదవికి ఎసరు.. ఇంటికే పరిమితమైన పెనా



పారగ్వే అధ్యక్షుడు శాంటియాగో పెనాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వంతో సంబంధాలున్న యునో బ్యాంకు కుప్పకూలిన వ్యవహారంలో ఆయన పాత్రపై తీవ్ర ఆరోపణలు రావడంతో సెనేట్ ఆయనను పదవి నుంచి తొలగించింది. విశ్వాసద్రోహం, అధికార దుర్వినియోగం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం పదవిని వాడుకోవడం వంటి ఆరోపణలపై శుక్రవారం ఆయనను గృహనిర్బంధంలో ఉంచారు. శనివారం ఉదయం ప్రాసిక్యూటర్ల ఎదుట హాజరయ్యే వరకు అసున్సియోన్‌లోని తన నివాసంలోనే ఉండాలని ఆదేశించారు. బ్యాంకు కుప్పకూలడంతో దేశంలోని 60 లక్షల మందిలో దాదాపు సగం మంది తమ పొదుపు సొమ్మును తీసుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యవహారం పారగ్వే ఆర్థిక వ్యవస్థతో పాటు రాజకీయాలను కుదిపేసింది. సెనేట్‌లో హాజరైన 44 మంది సభ్యులూ పెనాను పదవి నుంచి తొలగించేందుకు అనుకూలంగా ఓటేశారు. 1989లో జనరల్ ఆల్ఫ్రెడో స్ట్రోస్నర్ 35 ఏళ్ల నియంతృత్వ పాలన ముగిసిన తర్వాత అభిశంసన ద్వారా పదవి కోల్పోయిన రెండో పారగ్వే అధ్యక్షుడిగా పెనా నిలిచారు. సెనేట్ తీర్పు వెలువడగానే పార్లమెంటు వెలుపల పెద్ద సంఖ్యలో గుమిగూడిన ప్రజలు ఆనందంతో నినాదాలు చేశారు. బ్యాంకులో డబ్బులు చిక్కుకుపోయిన ఖాతాదారులు, పదవీ విరమణ చేసినవారు, విద్యార్థులు పారగ్వే జాతీయ జెండాలు పట్టుకుని పాటలు పాడారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. 'మళ్లీ నియంతృత్వం రావద్దు' అంటూ నినదించారు. బ్యాంకింగ్ నియంత్రణ సంస్థలు యునో బ్యాంకును మూడు రోజుల క్రితమే తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రకంపనలు మొదలయ్యాయి. దశాబ్దానికి పైగా కాలంలో ఎన్నడూ లేనంత రాజకీయ సంక్షోభం నెలకొంది.

గృహనిర్బంధంలో పెనా.. కార్వాలో అరెస్టుకు ఆదేశాలు...

విశ్వాసద్రోహం, పలుకుబడిని అడ్డుపెట్టుకుని ప్రయోజనాలు పొందడం, ప్రభుత్వ పదవిని వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకోవడం వంటి అభియోగాలను పెనా ఎదుర్కొంటున్నారు. వీటిలో తీవ్రమైన నేరాలకు గరిష్ఠంగా పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. యునో బ్యాంకుకు ప్రజాధనాన్ని మళ్లించేందుకు పెనా తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకున్నారని పార్లమెంటు సభ్యులు ఆరోపిస్తున్నారు. వందల కోట్ల డాలర్ల ప్రభుత్వ నిధులను బ్యాంకుకు మళ్లించడంతో పాటు, ప్రమాదకరమైన రుణాల మంజూరును నియంత్రణ సంస్థలు పట్టించుకోకుండా చేశారని విమర్శిస్తున్నారు. అయితే, తాను ఎలాంటి తప్పు చేయలేదని పెనా చెబుతున్నారు. శుక్రవారం రాత్రి ఆయన నివాసం చుట్టూ పోలీసులు మోహరించారు. బయట ప్రజలు జెండాలు పట్టుకుని గుమిగూడారు. తెల్లవారే వరకు అక్కడే ఉండి పెనా తప్పించుకోకుండా చూస్తామని ప్రకటించారు. యునోగా మారిన ఆర్థిక సంస్థను గతంలో నడిపిన కార్లోస్ కార్వాలోను అరెస్టు చేయాలని ప్రాసిక్యూటర్లు ఆదేశించారు. 2023లో పెనా ఆయనను సెంట్రల్ బ్యాంకు గవర్నర్‌గా నియమించారు. అయితే కార్వాలోను పోలీసులు అదుపులోకి తీసుకున్నారా లేదా అన్నది వెంటనే తెలియరాలేదు. ఉపాధ్యక్షుడు పెడ్రో అలియానా శుక్రవారం అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. 2028 ఆగస్టు వరకు ఆయన పదవిలో కొనసాగనున్నారు. "ఈ రోజు మన చేతుల్లోకి వచ్చిన పారగ్వేలో అత్యవసరంగా పరిష్కరించాల్సిన సమస్యలు ఎన్నో ఉన్నాయి" అని అలియానా అన్నారు. బ్యాంకు వ్యవహారంలో ఆయనపైనా విచారణ కొనసాగుతోంది. ఖాతాదారుల సొమ్మును తిరిగి చెల్లించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం వంటి సవాళ్లు ఆయన ముందున్నాయి. తీర్పు వెలువడటానికి ముందు పెనా ప్రజలకు వీడ్కోలు సందేశం ఇచ్చారు. తన ఉనికి మరింత విభేదాలకు, అస్థిరతకు కారణం కావడం తనకు ఇష్టం లేదన్నారు. "ఈ రోజు సమాధానాల కోసం ఎదురుచూస్తున్న వారి ఆవేదనను విస్మరించకుండా, కృతజ్ఞతతో వీడ్కోలు చెబుతున్నాను" అని ఆయన రాశారు. ప్రజల్లో ఆగ్రహం రోజురోజుకూ పెరుగుతోంది. శుక్రవారం సెనేట్‌లో చర్చలు సాగుతున్న సమయంలోనే ఖాతాదారులు తమ నిలిచిపోయిన సొమ్మును తిరిగి ఇవ్వాలని, బ్యాంకు వైఫల్యానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అసున్సియోన్ నగరంలో ప్రదర్శన నిర్వహించారు. 'శాంటీ పెనా.. టకుంబు జైలుకు వెళ్లాలి' అంటూ నినాదాలు చేశారు. యునో వ్యవస్థాపకుడు, మాజీ సీఈవో మిగెల్ వాజ్క్వెజ్ ప్రస్తుతం ఆ జైలులోనే ఉన్నారు. "ఇది ప్రజల నమ్మకానికి జరిగిన భారీ ద్రోహం. అధ్యక్షుడు ప్రజలను అపహాస్యం చేశారు" అని ప్రభుత్వ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న యినాల్ లోపెజ్ అన్నారు. ఆయన పనిచేస్తున్న సంస్థ ఉద్యోగుల పెన్షన్ నిధులు కూడా యునో బ్యాంకులో ఉన్నాయి.

ఖాతాల్లో నిలిచిన సొమ్ము.. పెరుగుతున్న ఆగ్రహం...

నియంత్రణ సంస్థలు యునో బ్యాంకును తమ ఆధీనంలోకి తీసుకున్న తర్వాత ఖాతాదారులు నగదు తీసుకోలేకపోయారు. పొదుపు సొమ్మును వాడుకోలేకపోయారు. కార్డులతో కొనుగోళ్లు చేయడం కూడా సాధ్యం కాలేదు. డిజిటల్ బ్యాంకింగ్ సేవలందించిన యునో.. తక్కువ ఆదాయం ఉన్నవారిని, బ్యాంకు ఖాతాలు లేనివారిని ఆకర్షించేందుకు సూపర్ మార్కెట్లలో కొనుగోళ్లపై భారీ రాయితీలు ప్రకటించింది. దీంతో 10 లక్షల మందికి పైగా పారగ్వే ప్రజలు తొలిసారిగా ఆ బ్యాంకులో ఖాతాలు తెరిచినట్లు యునో వెల్లడించింది. ఈ బ్యాంకు స్పాన్సర్‌గా వ్యవహరించిన పారగ్వే జాతీయ ఫుట్‌బాల్ జట్టులోని ఆటగాళ్లు కూడా తమ సొమ్మును తీసుకోలేకపోతున్నామని చెబుతున్నారు. ఈ ఏడాది ప్రపంచకప్‌లో జర్మనీపై సంచలన విజయం సాధించిన సమయంలోనూ యునో ఆ జట్టుకు స్పాన్సర్‌గా ఉంది. బ్యాంకు వైఫల్యం ప్రభావం ఖాతాదారులకే పరిమితం కాలేదు. యునో బ్యాంకుపై ఆధారపడి పనిచేసిన రైడ్‌హెయిలింగ్ యాప్ మూతపడింది. దీంతో 3 వేల మంది డ్రైవర్లు ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వ విద్యుత్ సంస్థకు చెందిన ప్రజాపనుల ప్రాజెక్టుల కోసం ఇంటర్-అమెరికన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, తైవాన్ నుంచి తీసుకున్న 2.1 కోట్ల డాలర్ల రుణం కూడా యునో బ్యాంకులోనే చిక్కుకుపోయిందని సంస్థ తెలిపింది. ఈ వారం పారగ్వే బాండ్లు అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో అత్యధిక నష్టాలను చవిచూశాయి. డాలర్‌తో పోలిస్తే దేశ కరెన్సీ గ్వారానీ విలువ కూడా పడిపోయింది. గురువారం నుంచి కొందరు ఖాతాదారులకు సొమ్ము తిరిగి చెల్లించడం మొదలైంది. తొలుత కోటి గ్వారానీల (సుమారు 1,500 డాలర్లు) వరకు డిపాజిట్ చేసినవారికి చెల్లింపులు ప్రారంభించారు. సుమారు 35 వేల డాలర్ల వరకు ఉన్న డిపాజిట్లకు బీమా రక్షణ ఉంది. ఇది యునో ఖాతాదారుల్లో 97 శాతం మందికి వర్తిస్తుందని సెంట్రల్ బ్యాంకు తెలిపింది. యునో వైఫల్యం ఒక ప్రత్యేక ఘటన మాత్రమేనని, దేశంలోని ఇతర బ్యాంకింగ్ వ్యవస్థ సురక్షితంగానే ఉందని స్పష్టం చేసింది. యునో ఉన్నతాధికారులపై మరో కేసులో ప్రాసిక్యూటర్లు 27 మందిపై అభియోగాలు నమోదు చేశారు. వీరిలో వాజ్క్వెజ్ కూడా ఉన్నారు. విశ్వాసద్రోహం, మోసానికి ప్రయత్నించడం వంటి నేరాలు ఇందులో ఉన్నాయి. వాజ్క్వెజ్‌తో పాటు ఆరుగురు మాజీ డైరెక్టర్లను విచారణ పూర్తయ్యే వరకు జైలులో ఉంచాలని న్యాయమూర్తి ఆదేశించారు. మరో ఇద్దరిని ఎలక్ట్రానిక్ పర్యవేక్షణ పరికరాలు ధరించి ఇళ్లలోనే ఉండాలని ఆదేశించారు. వాజ్క్వెజ్‌కు చెందినట్లు భావిస్తున్న ఖరీదైన కార్లు, ఓ విలాసవంతమైన పడవ, రెండు చిన్న విమానాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాధనంతో ఎదిగిన బ్యాంకు...


కొన్నేళ్లలోనే యునో పారగ్వేలో డిపాజిట్ల పరంగా అతిపెద్ద బ్యాంకుల్లో ఒకటిగా ఎదిగింది. ఈ ఎదుగుదలకు 80 కోట్ల డాలర్లకు పైగా ప్రజాధనం ఊతమిచ్చింది. దేశంలోని పెద్దల్లో మూడింట రెండొంతుల మందికి పైగా ఈ బ్యాంకులో ఖాతాలు తెరిచారు. జాతీయ ఫుట్‌బాల్ స్టేడియం నుంచి వీధి వ్యాపారుల బ్యాంకు కార్డుల వరకు ఎక్కడ చూసినా యునో లోగో కనిపించేది. పెనాకు యునో హోల్డింగ్ కంపెనీలో వాటా ఉండటాన్ని అభిశంసన తీర్మానంలో ప్రస్తావించారు. గత ఏడాది ఒత్తిడి రావడంతో ఆయన ఆ వాటాను విక్రయించారు. బ్యాంకును నియంత్రించే సెంట్రల్ బ్యాంకు గవర్నర్‌గా కార్వాలోను నియమించడంపైనా ప్రశ్నలు లేవనెత్తారు. చట్టపరమైన పరిమితులను దాటి ప్రభుత్వ పెన్షన్ నిధి నుంచి 35.5 కోట్ల డాలర్లను యునో బ్యాంకులో డిపాజిట్ చేయించారని కూడా పార్లమెంటు సభ్యులు ఆరోపించారు. యునో ఆర్థిక పరిస్థితిపై అనుమానాలు పెరుగుతున్నప్పటికీ, ఉన్నతస్థాయి రాజకీయ సంబంధాల కారణంగా ఆ బ్యాంకుపై నియంత్రణ సంస్థలు తగిన పర్యవేక్షణ చేయలేకపోయాయని విశ్లేషకులు చెబుతున్నారు. "పెనా హయాంలో సెంట్రల్ బ్యాంకు విశ్వసనీయతను, తటస్థతను కోల్పోవడం మొదలైంది. యునో బ్యాంకు కీలకంగా ఉన్న వ్యాపార వర్గానికి మేలు చేసేలా నియంత్రణ చర్యలను సడలించారు" అని అసున్సియోన్ జాతీయ విశ్వవిద్యాలయంలో రాజకీయ సిద్ధాంతాల ప్రొఫెసర్ జోస్ టోమస్ శాంచెజ్ అన్నారు. యునోపై నియంత్రణ సంస్థలు విచారణ ప్రారంభించాయంటే బ్యాంకు మూతపడుతుందని అర్థం కాదని పెనా గత నెలలో విలేకరులతో చెప్పారు. ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయంటూ మీడియాపైనా విమర్శలు చేశారు. బ్యాంకు మూతపడటానికి కొన్ని వారాల ముందు వరకు ఆయన దానికి మద్దతుగా మాట్లాడారు

రాజకీయ గురువు కార్టెస్‌తో విభేదాలే కొంపముంచాయా?

అక్టోబరు చివర్లో అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్‌తో సమావేశమై వాషింగ్టన్‌లో మిత్రుడిగా గుర్తింపు పొందిన పెనా.. కొద్ది రోజుల వ్యవధిలోనే సొంత ఇంటికే పరిమితమయ్యారు. ఆయన రాజకీయ పతనం అత్యంత వేగంగా సాగింది. మంగళవారం తెల్లవారుజామున అధికారులు యునో బ్యాంకును తమ ఆధీనంలోకి తీసుకున్నారు. గురువారం మధ్యాహ్నానికి పెనా రాజీనామాకు సిద్ధమయ్యారు. అప్పటికే ఆయనకు చెందిన కన్జర్వేటివ్ కొలరాడో పార్టీ కూడా ఆయనకు దూరమైంది. పార్టీ అధినేత, మాజీ అధ్యక్షుడు హొరాసియో కార్టెస్ ఈ పరిణామాల్లో కీలకంగా వ్యవహరించారు. పెనాకు ఆయన చాలాకాలంగా రాజకీయ గురువుగా ఉన్నారు. అయితే శుక్రవారం సెనేట్ అభిశంసన తీర్మానాన్ని ఆమోదించడంతో పెనా పదవి కోల్పోయారు. రాజీనామాను సెనేట్ ఆమోదించి ఉంటే ఆయనకు లభించే చట్టపరమైన రక్షణ కూడా ఇప్పుడు దక్కలేదు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థలో గతంలో ఆర్థికవేత్తగా పనిచేసిన పెనా రాజకీయ ఎదుగుదలకు కార్టెస్ కీలకంగా నిలిచారు. పొగాకు వ్యాపారవేత్త అయిన కార్టెస్.. పెనాను ఆర్థిక మంత్రిగా నియమించడంతో పాటు రెండుసార్లు అధ్యక్ష పదవికి మద్దతిచ్చారు.

అధ్యక్షుడైన తర్వాత మాత్రం కార్టెస్ ప్రభావం నుంచి బయటపడేందుకు పెనా ప్రయత్నించారని విశ్లేషకులు చెబుతున్నారు. సొంత రాజకీయ బలాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించారు. ప్రజాధనంతో వేగంగా విస్తరించిన యునో బ్యాంకు ఈ వ్యూహంలో కీలకంగా మారింది. "ఇదొక షేక్స్‌పియర్ నాటకం లాంటిది. తనకు రాజకీయంగా అండగా నిలిచిన గురువునే పక్కకు తప్పించాలని పెనా ప్రయత్నించారు. అయితే ఆయన నిర్మించుకున్న రాజకీయ పునాది చాలా బలహీనంగా ఉంది" అని పారగ్వే పరిశోధనా సంస్థ డెమోస్ డైరెక్టర్ మిగెల్ కార్టర్ వ్యాఖ్యానించారు. పెనాకు వ్యతిరేకంగా కార్టెస్ ఎదురుదాడికి దిగారు. సెప్టెంబరులో కార్టెస్‌కు మద్దతిచ్చే సెనేటర్లు యునో బ్యాంకు అనుబంధ సంస్థలకు ఇచ్చిన ప్రమాదకర రుణాలపై సెంట్రల్ బ్యాంకును బహిరంగంగా ప్రశ్నించడం ప్రారంభించారు. ఈ వారం యునో బ్యాంకు కుప్పకూలడంతో పెనా రాజకీయ పట్టు కూడా సడలిపోయింది. గతంలో అవినీతి ఆరోపణలపై అమెరికా ట్రెజరీ శాఖ ఆంక్షలు విధించిన కార్టెస్.. చివరకు తన రాజకీయ శిష్యుడైన పెనాను పదవి నుంచి తొలగించాలని బహిరంగంగా పిలుపునిచ్చారు. "పెనా రాజకీయ పతనానికి కార్టెసే చివరి దెబ్బ కొట్టారు. పెనాకు అండగా నిలిచే సొంత రాజకీయ బలం లేకపోవడంతో ఆయన ఒంటరిగా మిగిలిపోయారు" అని బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయంలో పారగ్వే వ్యవహారాల నిపుణుడు ఆండ్రూ నిక్సన్ అన్నారు.

వైట్‌హౌస్‌లో ట్రంప్ దీపావళి ... అధ్యక్షుడికి 'హనుమాన్ చాలీసా' బహుమతి





అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లోని తన అధికారిక కార్యాలయం ఓవల్ ఆఫీస్‌లో దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నిన్న జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ భారతీయ-అమెరికన్ పారిశ్రామికవేత్తలు, సీఈఓలు, ఆయన ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ స్వయంగా దీపం వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకకు అమెరికాలోని భారత రాయబారి వినయ్ మోహన్ క్వాత్రా, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ డైరెక్టర్ జయ్ భట్టాచార్య వంటి ప్రముఖులు హాజరయ్యారు. వీరితో పాటు మైక్రాన్ టెక్నాలజీ సీఈఓ సంజయ్ మెహ్రోత్రా, ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ, ప్రముఖ చెఫ్ వికాస్ ఖన్నా, సోషల్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ కమిషనర్ అర్జున్ మోదీ కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు.

ట్రంప్‌కు హనుమాన్ చాలీసా బహూకరణ

ఈ కార్యక్రమంలో ఒక ఆసక్తికరమైన సంఘటన చోటుచేసుకుంది. ప్రముఖ పారిశ్రామికవేత్త, జీఓక్యూఐఐ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు విశాల్ గోండల్, అధ్యక్షుడు ట్రంప్‌కు 'హనుమాన్ చాలీసా' పుస్తకాన్ని బహూకరించారు. ఈ విషయాన్ని ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. "ధైర్యం, భక్తి, శక్తి కోసం కోట్లాది మంది పఠించే తులసీదాస్ రచించిన హనుమాన్ చాలీసాను అధ్యక్షుడికి బహుమతిగా ఇవ్వడం గౌరవంగా భావిస్తున్నాను" అని ఆయన పేర్కొన్నారు. దీపాలు వెలిగించినప్పుడు, భారత్-అమెరికా మధ్య స్నేహం వర్ధిల్లాలని, చీకటిపై వెలుగు విజయం సాధించాలని తాను ప్రార్థించినట్లు గోండల్ తెలిపారు.

శాంతి, శ్రేయస్సు, ఆరోగ్యం ప్రపంచమంతటా వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో ధల్లా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ సీఈఓ రూబీ ధల్లా, న్యాక్ సిస్టమ్స్ వ్యవస్థాపకుడు రాజీవ్ శర్మ, కేశవం డీసీ ప్రెసిడెంట్ విశ్వజిత్ మల్లంపాటి వంటి పలువురు వ్యాపారవేత్తలు కూడా పాల్గొన్నారు.

వైట్‌హౌస్‌లో దీపావళి వేడుకలను జరపడం 2003లో అప్పటి అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ హయాంలో ప్రారంభమైంది. అయితే, 2009లో బరాక్ ఒబామా వైట్‌హౌస్‌లో స్వయంగా దీపం వెలిగించిన తొలి అధ్యక్షుడిగా నిలిచారు. అప్పటి నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ట్రంప్ హయాంలో ఈ వేడుకలను ఓవల్ ఆఫీస్‌లో నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఎన్నికలు ఎంత దుర్మార్గంగా నిర్వహించవచ్చో చంద్రబాబు చేసి చూపించారు

అనంతపురం:ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడంలో చంద్రబాబు కొత్త చరిత్ర సృష్టించారని అనంతపురం జిల్లా వైయస్ఆర్‌సీపీ నేతలు ధ్వజమెత్తారు. ఎన్నికలు స్వేచ్ఛగా జరిగేలా చూడాల్సిన ప్రభుత్వం.. ప్రజలు ఓటు వేయకుండా, అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకుని ఎన్నికల ప్రక్రియనే నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఎన్నికలను ఇంత దుర్మార్గంగా కూడా నిర్వహించవచ్చని చంద్రబాబు ప్రభుత్వం చేసి చూపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.అనంతపురం జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలపై వైయస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైయస్ఆర్‌సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్, మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రక్రియను అధికార దుర్వినియోగంతో నిర్వీర్యం చేసి, ప్రజల ఓటు హక్కును, అభ్యర్థుల పోటీ హక్కును కాలరాశారని వారు ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన వ్యవస్థలే అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం దురదృష్టకరమని పేర్కొంటూ, ఎన్నికల పేరుతో చోటుచేసుకున్న పరిణామాలను మీడియా సమావేశంలో ఎండగట్టారు.

ఎన్నికలు కాదు.. ప్రజాస్వామ్యాన్ని అడ్డుకునే ప్రక్రియ : డాక్టర్ సాకే శైలజానాథ్

ఎన్నికలను ఇంత దుర్మార్గంగా కూడా నిర్వహించవచ్చని చంద్రబాబు చేసి చూపించారు. ప్రజలు ఓటు వేయకుండా, అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం నుంచి పోలింగ్ కేంద్రాల్లో వైయస్ఆర్‌సీపీ ఏజెంట్లను కొట్టి బయటకు పంపడం వరకు ఎన్నికల ప్రక్రియనే నిర్వీర్యం చేశారు. 22 అర్బన్ లోకల్ బాడీల్లో పోటీ లేకుండా చేయడం, 84 జెడ్పీటీసీలు, 2,198 ఎంపీటీసీల్లో పోటీ లేకుండా చేయడం ప్రజాస్వామ్య చరిత్రలోనే చీకటి అధ్యాయం. పోలీసు, రెవెన్యూ అధికారులను ఉపయోగించి ఇళ్ల వద్దకు వెళ్లి మహిళలను సైతం భయభ్రాంతులకు గురిచేయడం, బైండ్‌ఓవర్ల పేరుతో వైయస్ఆర్‌సీపీ కార్యకర్తలను పోలీస్ స్టేషన్లలో కూర్చోబెట్టడం, పోలింగ్ కేంద్రాల్లో అధికార పార్టీకి ఒక న్యాయం.. ప్రతిపక్షానికి మరో న్యాయం చేయడం ద్వారా భయానక వాతావరణం సృష్టించారు.

ఈ పరిస్థితుల్లో పేదలు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు తమ ఓటు హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఎన్నికల కౌంటింగ్ సమయంలోనూ వైయస్ఆర్‌సీపీ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి. పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు జరిగిన ప్రతి పరిణామాన్ని ప్రజల ముందుంచాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని నమ్ముకున్న మనం భయపడాల్సిన అవసరం లేదు. ఎన్నికలను ప్రజలకు దూరం చేసి, వ్యవస్థలను భయపెట్టి, ప్రలోభపెట్టి నడిపించే రాజకీయాలకు కాలమే తీర్పు చెబుతుంది. రాబోయే రోజుల్లో కాలం ఇచ్చే తీర్పుకు అందరూ సిద్ధంగా ఉండాలి.

కౌంటింగ్‌లోనూ అక్రమాలకు తావిస్తే ప్రజలే తేల్చుతారు : తలారి రంగయ్య

మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ వరకు కనీవినీ ఎరుగని అక్రమాలు జరిగాయి. బలంగా గెలిచే వైయస్ఆర్‌సీపీ నాయకులను పోలీస్ స్టేషన్లలో కూర్చోబెట్టడం, కౌంటింగ్ కేంద్రాల్లో వైయస్ఆర్‌సీపీ ఏజెంట్లను కొట్టడం, రౌండ్‌వారీ కౌంటింగ్ వివరాలు వెల్లడించకపోవడం, పోస్టల్ బ్యాలెట్ల సంఖ్య చెప్పకపోవడం, రీకౌంటింగ్‌లో అధికార పార్టీకి ఒక న్యాయం.. వైయస్ఆర్‌సీపీకి మరో న్యాయం చేయడం జరిగింది. కళ్యాణదుర్గంలో ఎస్ఆర్ కంపెనీకి సంబంధించిన వ్యక్తులు ఐదారు వాహనాల్లో 50--60 మందితో పోలింగ్ కేంద్రాల్లోకి రావడం, శెట్టూరు, బెస్తరపల్లి, మాగలపల్లి, గుద్దెల్ల, విట్లంపల్లి, మాణిరేవు ప్రాంతాల్లో చోటుచేసుకున్న పరిణామాలపై కలెక్టర్, ఆర్డీవో, డీఎస్పీలకు ఫిర్యాదు చేసినా చర్యలు లేకపోవడం దారుణం.ప్రజలు వేసిన ప్రతి ఓటును తగ్గకుండా, ప్రతి బండిల్‌ను పక్కన పెట్టకుండా న్యాయంగా లెక్కిస్తే వైయస్ఆర్‌సీపీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు గెలుస్తారు.

కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఏజెంట్లు, ప్రజలు కౌంటింగ్ కేంద్రాలను వదిలి వెళ్లకూడదు. పోలీసులు, కలెక్టర్, ఎస్పీ, ఎన్నికల అధికారులు చేతులెత్తేసిన పరిస్థితి రాకూడదు. ఎన్నికలను పోలీసుల నుంచి కాపాడాలి.. ప్రజలను కొద్దిమంది పోలీసు అధికారుల నుంచి కాపాడాలి అనే పరిస్థితి రావడం సిగ్గుచేటు. కళ్యాణదుర్గాన్ని ఎస్ఆర్ కంపెనీకి అప్పగించినట్లుగా వ్యవహరించడాన్ని సహించేది లేదు.

ప్రజల ఓటు హక్కును, ఎన్నికల ఫలితాలను కాపాడే బాధ్యత అందరిదీ.కొద్దిమంది పోలీసు అధికారుల నుంచి ప్రజలను కాపాడాల్సిన పరిస్థితి రావడం సిగ్గుచేటు, బాధాకరం. ప్రజలను భయపెడుతున్నది ప్రత్యర్థి పార్టీ నాయకులు కాదు.. కొద్దిమంది పోలీసు అధికారులే. పోలీసుల నుంచి ప్రజలను కాపాడండి, ఎన్నికల అధికారుల నుంచి ఎన్నికలను కాపాడండి అనే పరిస్థితి ఎందుకు వచ్చింది? పెద్ద అధికారులు వ్యవస్థను గాడిలో పెట్టకుండా వదిలేస్తే చిన్నస్థాయి పోలింగ్ అధికారులు ఏం చేయగలరు? ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు జరిగిన అక్రమాలకు సంబంధించిన ఆధారాలన్నింటినీ ప్రజల ముందుంచుతాం అని శైలజానాథ్, తలారి రంగయ్య స్పష్టం చేశారు.

ఎన్నికల అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరపాలి...బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

నేరరాజకీయాలగురించి మాట్లాడేహక్కుమంత్రికేశవ్‌కులేదు...ఆయన సొంత గ్రామంలోనే దశాబ్దాలుగా స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగలేదు...ఎలక్షన్‌ఏజెంట్లనునిర్భంధించి ఎన్నికలా..ఉరవకొండ,కూడేరుసీఐలను సస్పెండ్ చేయాలి :వైఎస్సార్ సీపీ నేత విశ్వేశ్వరరెడ్డి ఆగ్రహం

అనంతపురం: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా నిర్వహించాల్సిన బాధ్యత ఉన్న పోలీసు వ్యవస్థను కూటమి ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విశ్వేశ్వర రెడ్డి మండిపడ్డారు. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థకే మచ్చగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అనంతపురం జిల్లాలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికార బలంతో వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు, బెదిరింపులు, దౌర్జన్యాలతో ఎన్నికలు జరిపించిన మంత్రి పయ్యావుల కేశవ్ కు ప్రజాస్వామ్యం, నేర రాజకీయాల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ఆక్షేపించారు. కేశవ్ తన సొంత గ్రామంలోనే దశాబ్దాలుగా స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగని పరిస్థితి ఉందని గుర్తు చేశారు. మంత్రి కేశవ్ చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే అబద్ధాలను నిర్భయంగా చెప్పడంలో ఆయనకు ఎవరూ సాటిలేరని ఎద్దేవా చేశారు. అధికార దర్పంతో జరిగిన ప్రతి తప్పునూ సమర్థించుకోవడం ఆయనకు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. గత మున్సిపల్ ఎన్నికల నుంచి ప్రస్తుత ఎన్నికల వరకు జరిగిన నామినేషన్ల అక్రమాలు, దాడులు, దౌర్జన్యాలపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలను కేశవ్ గుర్తు చేసుకోవాలని విశ్వేశ్వరరెడ్డి హితవు పలికారు. న్యాయస్థానాలు తీవ్రంగా స్పందించిన అంశాలను పక్కనపెట్టి, రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందు నుంచే రాష్ట్ర ఎన్నికల కమిషన్, ఎస్పీ, డీఐజీ తదితర ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, ఆచరణలో కఠిన చర్యలు తీసుకోకపోవడంతోనే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెన్నుపోటు కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యతను విస్మరించి, అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులను అణచివేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఏజెంట్లను నిర్భంధించి ఎన్నికలా..?

ఉరవకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని వందలాది మందిని పోలీసులు అరెస్టు చేశారు. రాత్రి రెండున్నర గంటల సమయంలో కూడా మా నాయకులను అదుపులోకి తీసుకున్నారు. హైకోర్టు నుంచి ఇబ్బందులు పెట్టవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా అరెస్టులు చేయడం దారుణం. మా పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు వ్యవహరించిన తీరు చూస్తే అధికార పార్టీకి అనుకూలంగా పనిచేసినట్లు స్పష్టమవుతోంది. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన వారిని వదిలేసి, ఎన్నికల ఏజెంట్లను, పార్టీ నాయకులను అరెస్టు చేయడం ఏ విధమైన న్యాయం? ఉరవకొండ సీఐ, కూడేరు సీఐల వ్యవహారశైలిపై సమగ్ర విచారణ జరపాలి. ఎన్నికల ఏజెంట్లను నిర్బంధించిన ఘటనపై సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించాలి. రాత్రివేళల్లో అక్రమంగా అరెస్టులు చేసిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలి. టీడీపీకి చెందిన ఎంతమందిని అరెస్టు చేశారో ప్రభుత్వం లెక్కలు బయటపెట్టాలి. మా పార్టీకి చెందిన ఉరవకొండ నియోజకవర్గ నాయకులు, మండల స్థాయి ప్రతినిధులు, ఎన్నికల ఏజెంట్లను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేశారు. మండల వైస్‌ప్రెసిడెంట్ కుటుంబ సభ్యులను కూడా నిర్బంధించడం ఎంతవరకు సమంజసం? ఉండబండ, రాయంపల్లి, కొటాలపల్లి, జనార్ధనపల్లి తదితర గ్రామాల్లో మా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులపై విచారణ జరగాలి. రాయంపల్లిలో మా మండల పార్టీ అధ్యక్షుడిని ఎందుకు అరెస్టు చేశారు? ఆయనపై ఉన్న కేసులేమిటి? ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల కుటుంబ సభ్యులను సైతం నిర్బంధించడం వెనుక ఉద్దేశం ఏమిటి? ఈ ప్రశ్నలకు పోలీసులు సమాధానం చెప్పాలి.

మళ్లీ ఎన్నికలు నిర్వహించే ధైర్యం ఉందా?

ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారి ఓట్లు, విదేశాల్లో ఉన్నవారి ఓట్లు, మరణించిన వారి ఓట్లు కూడా వినియోగించారనే ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపించాలి. మేము ఆరోపించిన ప్రతి అంశంపైనా విచారణ జరిపించి, అక్రమాలు నిర్ధారణ అయితే సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి. కొనకొండ ప్రాంతంలో మా ఏజెంట్లను పోలింగ్ కేంద్రాల నుంచి బయటకు పంపించారనే ఆధారాలు ఉన్నాయి. ఉరవకొండ రూరల్ సీఐ మా ఏజెంట్లతో దురుసుగా ప్రవర్తించారని, చేయి పట్టుకుని బయటకు తీసుకొచ్చారని ఫిర్యాదులు ఉన్నాయి. ఇలాంటి ఘటనలపై ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించాలి. ఎన్ని నిర్భంధాలు ఎదురైనా, ఎన్ని బెదిరింపులు వచ్చినా, ఒక్క రూపాయి కూడా పంచకుండా, నిబద్ధతతో ఎన్నికల్లో నిలబడిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు మా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం చేస్తుంది. అధికార పార్టీ బెదిరింపులకు, పోలీసుల నిర్బంధాలకు మా నాయకులు, కార్యకర్తలు భయపడరు. ప్రజల మద్దతుతో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మా పోరాటం కొనసాగుతుంది అని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత విశ్వేశ్వర రెడ్డి స్పష్టం చేశారు.

పరిషత్ ఎన్నికల్లోనూ కూటమి సర్కార్ బరితెగింపు...పోలీసుల అండతో యథేచ్ఛగా బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్

సుప్రీంకోర్టు ఆదేశాలను తుంగలో తొక్కిన ప్రభుత్వయంత్రాంగం...వైఎస్సార్‌సీపీ ఏజెంట్ల నిర్బంధం, నేతలపై దాడులు దారుణం...నిబంధనలు ఉల్లంఘించి పోలింగ్ బూతుల్లో చొరబడ్డ మంత్రులు, ఎమ్మెల్యేలు...ఆ బూతుల్లో తక్షణమే రీపోలింగ్ నిర్వహించాలి..మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్.

నెల్లూరు :మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల తరహాలోనే నిన్న ముగిసిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ పరిషత్ ఎన్నికల్లోనూ కూటమి ప్రభుత్వం తీవ్రస్థాయిలో అరాచకాలు, అక్రమాలకు పాల్పడి అధికార దుర్వినియోగానికి ఒడిగట్టిందని నెల్లూరు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

నెల్లూరులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజల మద్దతు లేని అధికార పక్షం ఎన్నికల్లో గెలవడానికి సర్వశక్తులూ ఒడ్డి పోలీసు యంత్రాంగాన్ని తమ ప్రైవేట్ సైన్యంగా వాడుకుందని ఆయన ధ్వజమెత్తారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిన్నటి ఎన్నికల్లో అధికార పార్టీతో కాకుండా, అంతా తామై వ్యవహరించిన పోలీసు వ్యవస్థతోనే పోరాడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని, వైఎస్సార్‌సీపీ పోలింగ్ ఏజెంట్లను అక్రమంగా నిర్బంధించి, కనీసం ఓటు హక్కు కూడా వినియోగించుకోకుండా స్టేషన్లలో బంధించారని మండిపడ్డారు.

మంత్రులు, ఎమ్మెల్యేలు నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ బూతుల్లోకి చొరబడి వైయస్సార్సీపీ ఏజెంట్లను నెట్టివేసి రిగ్గింగ్‌కు పాల్పడ్డారని ఆధారాలతో సహా ఎత్తిచూపారు. ఈ మొత్తం ఉదంతాలపై జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్, జిల్లా ఎస్పీ తక్షణమే స్పందించి నిష్పక్షపాత విచారణ జరపాలని, నిబంధనలు ఉల్లంఘించిన పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలను రద్దు చేసి తక్షణమే రీపోలింగ్ నిర్వహించాలని గట్టిగా డిమాండ్ చేశారు.

అధికార పార్టీతో కాదు.. పోలీసు వ్యవస్థతోనే పోరాడాం:

నిన్న జరిగిన పరిషత్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాడింది అధికార పార్టీతో కాదు.. సర్వస్వం తామై నిలిచిన పోలీసు వ్యవస్థతో, అధికారులతోనే పోరాడాం. ప్రజల్లో కూటమి ప్రభుత్వానికి ఎలాంటి ఆదరణ లేదు. వైఎస్సార్‌సీపీని నేరుగా ఎదుర్కొనే దమ్ము లేక పోలీసులను అడ్డుపెట్టుకుని దాడులకు తెగబడ్డారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకుండా సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ అంటూ కంటితుడుపు చర్యలు చేపట్టి, జిల్లా అధికార యంత్రాంగం అంతా సజావుగా జరిగిందంటూ నాటకమాడింది.

ముందురోజు సాయంత్రం ఎన్నికల అధికారుల వద్ద ధ్రువీకరణ పత్రాలు తీసుకుని బ్యాడ్జీలు తెచ్చుకున్న మా పోలింగ్ ఏజెంట్ల వివరాలు సేకరించి, రాత్రికి రాత్రే వారిని పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఏదో అంతర్జాతీయ ఉగ్రవాదులను తరలించినట్లు ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు మారుస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. ఏజెంట్ల ఫోన్లు లాక్కుని, ఎవరికైనా చెబితే అక్రమ కేసులు బనాయిస్తామని బెదిరించారు. పొదలకూరు మండలం చెన్నారెడ్డిపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఐదు రోజుల పాటు స్టేషన్లలో అక్రమంగా కూర్చోబెట్టి కనీసం ఓటు కూడా వేయనీయలేదు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాసే అధికారం పోలీసులకు ఎవరిచ్చారు?

పోలీసుల సమక్షంలోనే కార్యకర్తలపై రక్తపాతం:

వెంకటాచలంలో ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటరు ఐడెంటిటీ కార్డు అడిగినందుకు దినేష్ అనే మా బూత్ ఏజెంట్‌పై టీడీపీ రౌడీలు విచక్షణారహితంగా దాడి చేసి గాయపర్చారు. పోలీసులు అతడిని కాపాడాల్సింది పోయి, బలవంతంగా బయటకు పంపే క్రమంలో టీడీపీ మూకలు అతనిపై దాడి చేసినా ఆపే ప్రయత్నం చేయలేదు. తీవ్ర గాయాలతో ఆ యువకుడు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయబోతుంటే స్టేషన్ ఎదుటే మళ్లీ దాడి చేస్తుంటే పోలీసులు చేష్టలుడిగి చూశారు తప్ప ఒక్కరిపైనా కేసు పెట్టలేదు. గాయపడిన మా కార్యకర్తలను బయటకు తరిమేసి, టీడీపీ గూండాలకు కొమ్ముకాస్తూ శాంతిభద్రతలను అంపశయ్యపైకి చేర్చారు.

మంత్రులు, ఎమ్మెల్యేల బూత్ క్యాప్చరింగ్:

సాక్షాత్తు మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు పోలింగ్ బూతుల్లోకి చొరబడి బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడ్డారు. ఎన్నికల నిబంధనల ప్రకారం పోలింగ్ కేంద్రంలోకి అభ్యర్థి లేదా ఆయన తరఫు ఎలక్షన్ ఏజెంట్ మాత్రమే వెళ్లాలి. ఎలాంటి అధికారిక హోదా లేని మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మా పార్టీ ఎలక్షన్ ఏజెంట్‌గా బూత్‌కు వెళ్తే సీఐ గంగాధర్ అమర్యాదగా గల్లా పట్టుకుని బయటకు నెట్టేశారు. అదే సమయంలో మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి మాత్రం యథేచ్ఛగా బూతుల్లోకి ఎలా వెళ్తారు? వెంకటాచలం, కావలి, ఉదయగిరి, కందుకూరులలో మంత్రులు, ఎమ్మెల్యేలు స్వయంగా వెళ్లి కూర్చుని మా ఏజెంట్లను తరిమేసి రిగ్గింగ్ చేయించారు.

పోలీసులే దగ్గరుండి రిగ్గింగ్ చేయించిన దౌర్జన్యం:

గూడూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ బి.గురవయ్య ఇంటిపై టీడీపీ గూండాలు పడి విచక్షణారహితంగా దాడులకు యత్నించారు. మర్రిపాడు మండలం తిక్కవరంలో ఎస్సై బలరాంరెడ్డి మా ఏజెంట్ కాలర్ పట్టుకుని బయటకు లాగేసి, తలుపులు వేసి పది మంది టీడీపీ వ్యక్తులతో రెండు వందల దొంగ ఓట్లను రిగ్గింగ్ చేయించారు. పెళ్లకూరులో సీఐ స్వయంగా మా ఏజెంట్లను బయటకు పంపించి రిగ్గింగ్‌ను ప్రోత్సహించారు. పచ్చ చొక్కాలు వేసుకున్న పోలీసులను మాత్రమే బూత్‌లలో నియమించుకుని వ్యవస్థను ఇంత దారుణంగా భ్రష్టుపట్టించడం చరిత్రలో ఎన్నడూ చూడలేదు.

రీపోలింగ్ నిర్వహించి.. రేపటి కౌంటింగ్ నిలిపివేయాలి:

జిల్లాలో జరిగిన ఎన్నికల ఉల్లంఘనలు, హింసాత్మక ఘటనలకు సంబంధించిన అన్ని వీడియో ఆధారాలను జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు అందజేశాం. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి, నిబంధనలకు విరుద్ధంగా మంత్రులు, ఎమ్మెల్యేలు చొరబడిన బూతుల్లో సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించాలి. ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరిగిన అన్ని కేంద్రాల్లో ఎన్నికలను తక్షణమే రద్దు చేసి, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదించి రీపోలింగ్ నిర్వహించాలి. అప్పటివరకు రేపు జరగాల్సిన కౌంటింగ్ ప్రక్రియను నిలిపివేయాలి.

ప్రజాస్వామ్యంపై నమ్మకం కలిగించాలి...

ఈ నేపథ్యంలో రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా ఎన్నికల ప్రక్రియ సాగడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని కాకాణి గోవర్ధన్ రెడ్డి తేల్చి చెప్పారు. అవసరమైతే ఎన్నికలను మరో రోజు నిర్వహించి, సాయంత్రం నుంచి కౌంటింగ్ పూర్తి చేయాలన్నారు. లేదంటే ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోయే ప్రమాదం ఉందని తేల్చి చెప్పారు. మరోవైపు ఎన్ని బెదిరింపులు, అక్రమ కేసులు, దాడులు ఎదురైనా ప్రాణాలకు తెగించి పోరాడిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులందరికీ శిరస్సు వంచి హృదయపూర్వక ధన్యవాదాలు, అభినందనలు తెలియజేశారు.

అభిషేక్‌బెనర్జీ ఇంటిపై దాడి

తనను చంపేందుకేనన్న టీఎంసీ ఎంపీ

మొదటి పేజీ తరువాయి...

జరిగినా వారు జోక్యం చేసుకోలేదని ఆరోపించారు. కోల్‌కతా పోలీసులు, కలకత్తా హైకోర్టు, సుప్రీంకోర్టుల తీరుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో జూన్ 19న సోనాపూర్‌లో తనపై హత్యాయత్నం జరిగిందని, ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు.అయితే, అభిషేక్ బెనర్జీ ఆరోపణలను బీజేపీ నేతలు కొట్టిపారేశారు. బెంగాల్ బీజేపీ నేత దిలీప్ ఘోష్ ఈ ఘటనను ఒక ‘డ్రామా’గా అభివర్ణించారు. ఫుట్‌పాత్‌పై పుట్టినరోజు వేడుకలు జరుపుకుంటే నిరసనలు రావడం సహజమని అన్నారు. అభిషేక్‌కు హాని తలపెట్టే సమయం, ఉద్దేశం ఎవరికి ఉంటుందని ప్రశ్నించారు. భావోద్వేగపూరిత మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని ఆయన విమర్శించారు.అభిషేక్ బెనర్జీ నివాసం వెలుపల తెల్లవారుజామున 2 గంటల నుంచి 3:30 గంటల మధ్య ఘర్షణలు జరిగాయని పోలీసులు ధ్రువీకరించారు. ఇరువర్గాల వారికి గాయాలైనట్లు నివేదికలు ఉన్నాయని, అయితే దీనికి ఏ రాజకీయ పార్టీ కారణమన్నది ఇంకా నిర్ధారించలేదని తెలిపారు. తన కార్యాలయం, నివాసంపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నిఘా పెట్టారని అభిషేక్ ఆరోపించిన మరుసటి రోజే ఈ ఘటన జరగడం గమనార్హం.

స్నేహం పేరుతో మోసం... కిలోల కొద్దీ బంగారం, వెండి చోరీ

ఒక కళాశాలలో వార్డెన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు, అదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆమె పిన్ని కుమారి మానే పద్మావతి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారం ఉన్నట్లు నిందితుడు గుర్తించాడు. తనకు అప్పులు ఉన్నాయని, బంగారం తాకట్టు పెట్టి తీర్చేసి తిరిగి ఇచ్చేస్తానని ఆ విద్యార్థినిని నమ్మించి, ఆమె వద్ద నుంచి ఇంటి తాళాలు సంపాదించాడు.గత అక్టోబరు 20న పద్మావతి తన ఇంటికి తాళం వేసి మార్కెట్‌కు వెళ్లిన సమయంలో చంద్రశేఖర్ ఈ చోరీకి తెగబడ్డాడు. ఇంట్లోని 556 గ్రాముల బంగారం, 2.9 కిలోల వెండి వస్తువులను దోచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. బాధితురాలి సోదరి కుమార్తె ద్వారా చంద్రశేఖర్‌పై అనుమానం వ్యక్తమైంది. దీంతో సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు, నిందితుడిని తిరుమలగిరిలో అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అపహరించిన బంగారంలో కొంత భాగాన్ని గుంటూరు, చార్మినార్ ప్రాంతాల్లో విక్రయించి రూ.25 లక్షలు పొందినట్లు వెల్లడించాడు. నిందితుడి నుంచి 429 గ్రాముల బంగారం, రూ.25 లక్షల నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి ఈ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

ట్రంప్ హత్యకు కుట్ర?.. వైట్‌హౌస్ వద్ద భారీ ఆయుధాలతో వ్యక్తి అరెస్ట్



అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ సమీపంలో తీవ్ర కలకలం రేగింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేస్తానని బెదిరించిన ఓ వ్యక్తిని భారీ ఆయుధాలు సహా యూఎస్ సీక్రెట్ సర్వీస్ అధికారులు అరెస్ట్ చేశారు. తన తలలోని స్వరాలు ట్రంప్‌ను చంపమని ఆదేశించాయని, అందుకే ఇక్కడికి వచ్చానని నిందితుడు చెప్పడం సంచలనం సృష్టిస్తోంది.గురువారం రాత్రి వాషింగ్టన్ డీసీలోని కాన్‌స్టిట్యూషన్ అవెన్యూలో పార్క్ చేసి ఉన్న వాహనంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో సీక్రెట్ సర్వీస్ అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతడిని వెనిజులాకు చెందిన రోనీ యోడ్రిక్స్ గువానిపా క్రినోస్‌గా గుర్తించారు.

ట్రంప్‌ను హత్య చేయాలనే ఉద్దేశంతోనే తాను రాజధానికి వచ్చినట్లు అతడు అధికారులతో చెప్పాడు.అనంతరం అధికారులు అతడు ఉన్న వాహనాన్ని తనిఖీ చేయగా, అది దొంగిలించబడినదని తేలింది. వాహనం లోపల ఏఆర్-15 తరహా రైఫిల్, మ్యాక్-10, గ్లాక్ 43ఎక్స్ వంటి మూడు శక్తిమంతమైన తుపాకులతో పాటు వందల సంఖ్యలో బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.క్రినోస్ 2024 మార్చిలో టెక్సాస్ సరిహద్దు ద్వారా అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించాడని, అప్పటి నుంచి ఎలాంటి చట్టపరమైన పత్రాలు లేకుండా ఇక్కడే ఉంటున్నాడని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) వెల్లడించింది. “మా సీక్రెట్ సర్వీస్ అధికారుల చొరవతో పెను ప్రమాదం తప్పింది. అతడు ఎవరికైనా హాని కలిగించేలోపే మూడు తుపాకులు కలిగి ఉన్న అతడిని వైట్‌హౌస్ సమీపంలో అరెస్ట్ చేశాం” అని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ సెక్రటరీ మార్క్‌వేన్ ముల్లిన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.నిందితుడిపై ఆయుధాల చట్టాల ఉల్లంఘన, వాహనం అక్రమ వినియోగం, దొంగతనం, రిజిస్ట్రేషన్ లేని ఆయుధాలు కలిగి ఉండటం వంటి పలు అభియోగాలపై కేసులు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరచగా, అతనికి బెయిల్ నిరాకరించి కస్టడీకి తరలించారు. దొంగిలించిన ట్రక్కులోనే తాను నివసిస్తున్నట్లు క్రినోస్ విచారణలో అంగీకరించినట్లు కోర్టు పత్రాల ద్వారా తెలిసింది. ఈ కేసును ఫెడరల్ ప్రాసిక్యూటర్లు కూడా సమీక్షిస్తున్నందున, కేసు ఫెడరల్ కోర్టుకు బదిలీ అయ్యే అవకాశం ఉంది.

ముంబైలో మళ్ళీ బాంబు బెదిరింపులు..

అమితాబ్ బంగ్లా సహా పలు ప్రాంతాలు టార్గెట్



ముంబై మహానగరంలో మరోసారి బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. బాలీవుడ్ సూపర్ స్టార్ అమితాబ్ బచ్చన్ నివాసం 'జల్సా' సహా నగరంలోని పలు కీలక ప్రాంతాలను పేల్చివేస్తామంటూ ఆగంతుకులు ఈ-మెయిల్ ద్వారా హెచ్చరించారు. ఈ మెయిల్ నేరుగా బాంబే హైకోర్టుకు రావడంతో భద్రతా ఏజెన్సీలు తక్షణమే అప్రమత్తమయ్యాయి.న్యూస్ ఏజెన్సీ ఐఏఎన్ఎస్ కథనం ప్రకారం... బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (దీూజు), వర్లీ రేస్‌కోర్స్, అమితాబ్ బచ్చన్ బంగ్లాను పేల్చివేస్తామని ఈ-మెయిల్‌లో పేర్కొన్నారు. "ఈ బెదిరింపును తీవ్రంగా పరిగణిస్తున్నాం. ముంబై పోలీసులు, ఇతర భద్రతా ఏజెన్సీలు దీనిపై దర్యాప్తు చేస్తున్నాయి. ఈ-మెయిల్ పంపిన వారిని గుర్తించే పనిలో ఉన్నాం" అని ముంబై పోలీసులు తెలిపినట్లు ఐఏఎన్ఎస్ వెల్లడించింది. బెదిరింపు నేపథ్యంలో బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌లు, స్థానిక పోలీసులు ఆయా ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇటీవల కాలంలో ముంబైలో ఇలాంటి బెదిరింపులు ఎక్కువయ్యాయి. అక్టోబర్ 23న అమితాబ్ బచ్చన్ ఆస్తిని లక్ష్యంగా చేసుకుని ఓ స్కూల్‌కు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. అంతకుముందు బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (దీవీజ) ప్రధాన కార్యాలయానికి కూడా ఇలాంటి హెచ్చరికే అందింది. అయితే, తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు.తాజా ఘటనతో సైబర్ సెల్ పోలీసులు రంగంలోకి దిగారు. ఈ-మెయిల్ పంపిన వారి ఐపీ అడ్రస్, డిజిటల్ ఆధారాలను ట్రేస్ చేసి నిందితులను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వరుస ఘటనల వెనుక ఒకే ముఠా ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

రాహుల్ గాంధీ టీ మీటింగ్‌కు సిద్ధరామయ్య గైర్హాజరు



కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఏర్పాటు చేసిన కీలక సమావేశానికి దూరంగా ఉన్నారు. ఈరోజు రాహుల్ గాంధీ టీ మీటింగ్‌కు తాను హాజరుకాలేనని, ముందుగా నిర్ణయించుకున్న పర్యటన ఉందని ఆయన పార్టీకి తెలియజేశారు. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కర్ణాటక పీసీసీ అధ్యక్షుడు బీకే హరిప్రసాద్ ఈ సమావేశానికి హాజరవుతారని తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం సిద్ధరామయ్య ఈరోజు హాసన్ జిల్లా పర్యటనకు వెళ్లారు. అక్కడ చారిత్రక హసనాంబ ఆలయంలో జరుగుతున్న వార్షిక జాతర మహోత్సవంలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకోనున్నారు. పెుయసల కాలం నాటి ఈ ఆలయం అక్టోబర్ 29న భక్తుల కోసం తెరుచుకోగా, నవంబర్ 11న ఉత్సవాలు ముగియనున్నాయి.ఇదిలా ఉండగా, ఇటీవల తనపై వచ్చిన నకిలీ స్టింగ్ ఆపరేషన్ వీడియో వ్యవహారంపై చర్చించేందుకు సిద్ధరామయ్య ఈనెల 3న ఢిల్లీలో రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ఈ భేటీ తర్వాతే ఆయన రాహుల్ సమావేశానికి గైర్హాజరు కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది.మరోవైపు, సిద్ధరామయ్యను లక్ష్యంగా చేసుకుని రూపొందించిన స్టింగ్ వీడియోపై బెంగళూరు పోలీసులు కీలక ప్రకటన చేశారు. ఈ వీడియోలో ఉన్న లైంగిక వేధింపుల ఆరోపణలు 'కల్పితం, ఉద్దేశపూర్వకంగా సృష్టించిన కథనం' అని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని తెలిపారు. వీడియోలో కనిపించిన వ్యక్తులందరినీ విచారించామని, వారి వాంగ్మూలాలు, సేకరించిన ఆధారాల ప్రకారం ఆ ఆరోపణలు కట్టుకథ అని తేలినట్లు పోలీసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వీడియో సృష్టి, రికార్డింగ్, సర్కులేషన్‌పై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని వారు స్పష్టం చేశారు.

కృష్ణుడిపై వివాదాస్పద వ్యాఖ్యలు.. ధీరేంద్ర శాస్త్రిపై ఆగ్రాలో క్రిమినల్ కేసు



ప్రముఖ ఆధ్యాత్మిక ప్రబోధకుడు, బాగేశ్వర్ ధామ్ పీఠాధిపతి ధీరేంద్ర శాస్త్రి మరో వివాదంలో చిక్కుకున్నారు. శ్రీకృష్ణుడిపై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యల కారణంగా ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో క్రిమినల్ పరువునష్టం కేసు నమోదైంది. కృష్ణుడిని ఆరాధించే భక్తుల మనోభావాలను దెబ్బతీశారంటూ ఓ న్యాయవాది కోర్టును ఆశ్రయించారు.అజయ్ ప్రతాప్ సింగ్ అనే న్యాయవాది ఆగ్రా సివిల్ కోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని శివపురిలో జరిగిన ఓ రామకథ కార్యక్రమంలో ధీరేంద్ర శాస్త్రి ప్రసంగిస్తూ శ్రీకృష్ణుడిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. "శ్రీకృష్ణుడు మోసగాడు, ఆయన నిలబడినప్పుడు మూడు వైపులకు వంగి ఉంటాడు" అంటూ శాస్త్రి చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది భక్తులను బాధించాయని ఆరోపించారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడి శారీరక భంగిమలపై కూడా ఆయన పోలికలు తెచ్చినట్లు తెలిపారు.ఇదే కార్యక్రమంలో ధీరేంద్ర శాస్త్రి మాట్లాడుతూ... ద్వాపరయుగంలో మానవ రూపంలో జన్మించిన శ్రీకృష్ణుడి వారసులు ఇప్పటికీ భారతదేశంలో ఉన్నారని తెలిపారు. జాదూన్లు, జడేజాలు, భట్టీలు కృష్ణుడి వంశానికి చెందినవారేనని, తన తండ్రి వైపు నుంచి తాను కూడా ఆ వంశస్థుడినేనని ఆయన పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను స్వీకరించిన సివిల్ జడ్జి కాంచన్ కుమార్... దీనిపై విచారణను డిసెంబర్ 14వ తేదీకి వాయిదా వేశారు.

టీవీకే ఎమ్మెల్యేకు రూ.30 కోట్లు ఎర.. ఏఐఏడీఎంకే నేత అరెస్ట్



చెన్నై: తమిళనాడులోని అధికార టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఆ పార్టీ ఎమ్మెల్యేకు ఏఐఏడీఎంకే నేత రూ.30 కోట్లు ఆశ చూపినట్లు ఆరోపణలు వచ్చాయి. త్వరలో జరుగనున్న అవిశ్వాస తీర్మానం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు ఆ టీవీకే ఎమ్మెల్యేను ప్రలోభానికి గురి చేసినట్లు ఆయన సహాయకుడు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేసిన పోలీసులు ఏఐఏడీఎంకే నేతను అరెస్ట్ చేశారు. మదురై సెంట్రల్ టీవీకే ఎమ్మెల్యే మధర్ బద్రుద్దీన్ అలియాస్ ముస్తఫాకు, మాజీ డిప్యూటీ మేయర్, ఏఐఏడీఎంకే నేత పీఎం మన్సన్ రూ.15 కోట్ల నుంచి రూ.30 కోట్ల వరకు లంచం ఆఫర్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు జరుగనున్న అవిశ్వాస తీర్మానం సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయాలని ఆ ఎమ్మెల్యే సహాయకుడు కనీ ద్వారా ఈ ఆఫర్ పంపినట్లు సమాచారం.కాగా, టీవీకే ఎమ్మెల్యే మధర్ బద్రుద్దీన్ సహాయకుడు కనీ ఫిర్యాదుపై మదురై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) పోలీసులు దర్యాప్తు చేశారు. నాలుగు గంటలకుపైగా మన్సన్‌ను విచారించారు. శుక్రవారం ఆయనను అరెస్ట్ చేశారు. రిమాండ్ కోసం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుచనున్నారు. మన్సన్ అరెస్ట్ నేపథ్యంలో అన్నాడీఎంకే మద్దతుదారులు పెద్ద సంఖ్యలో మదురై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ వద్ద గుమిగూడారు. దీంతో పోలీసులు ఆ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు.మరోవైపు ఈ ప్రలోభ ఆరోపణలపై అధికారిక ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే సహాయకుడు కనీని కూడా పోలీస్ దర్యాప్తు అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఆరోపిత టెలిఫోన్ సంభాషణలు, ఆడియో సాక్ష్యాలను పరిశీలిస్తున్నారు. టీవీకే ప్రభుత్వాన్ని కూల్చేందుకు జరిగిన ఆరోపిత కుట్రకు సంబంధించిన ఇతర కీలక వ్యక్తులను గుర్తించేందుకు కూడా పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

2026.. రెండో అత్యంత వేడి సంవత్సరం

న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయి. 2026 ఇప్పటివరకు నమోదైన అత్యంత వేడి సంవత్సరాల్లో రెండో స్థానంలో నిలిచే అవకాశం ఉందని యూరోపియన్ యూనియన్ వాతావరణ పర్యవేక్షణ సంస్థ కోపర్నికస్ వెల్లడించింది. 2024 ప్రస్తుత రికార్డుల్లో అత్యంత వేడి సంవత్సరంగా ఉంది. 2026లోనూ ఉష్ణోగ్రతలు అదే స్థాయికి చేరే లేదా దానిని అధిగమించే అవకాశం 20 శాతం వరకు ఉందని కోపర్నికస్ అంచనా వేసింది. ఈ ఏడాది సగటు పారిశ్రామికీకరణకు ముందుకాలం(1850-1900)తో పోలిస్తే ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం దాదాపు ఖాయమని తెలిపింది. 2026 అక్టోబర్ ప్రపంచ చరిత్రలోనే అత్యంత వేడి అక్టోబర్ నెలగా నమోదైంది.

సమాధి తవ్వి యువతి తలను ఎత్తుకెళ్లారు



భువనేశ్వర్: సమాధిలో నుంచి యువతి మృతదేహాన్ని బయటకు తీసి అనంతరం మొండాన్ని అక్కడి ఉంచే తలను తీసుకెళ్లిన సంఘటన ఒడిశా రాష్ట్రం నవరంగ్ పూర్ జిల్లా నందహండి సమితిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... నరసింహగూడలో నీలాద్రి మఝి అనే యువతి(27) చికెన్ పాక్స్ సోకడంతో సెప్టెంబర్ 26న చనిపోయింది. అమ్మవారు సోకడంతో మృతదేహాన్ని దహనం చేయకుండా గోతి తీసి పాతిపెట్టారు. సమాధి వద్ద 21 రోజులు కుటుంబ సభ్యులు శ్మశానం వద్ద కాపాలా ఉన్నారు. గురువారం రాత్రి మృతదేహాన్ని బయటకు తీసి మొండెం నుంచి తలను వేరు చేశారు. అనంతరం తలను ఎత్తుకెళ్లారు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పెళ్లి కానీ యువతి కావడంతో చేతబడి కోసమే తలను తీసుకెళ్లి ఉంటారని గ్రామస్థులు ఆరోపణలు చేస్తున్నారు.

"ఓటు పోతే పథకాలూ పోయినట్లే" - 'సర్'తో కేంద్రం భారీ కుట్ర



ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) లో దాదాపు 13 కోట్ల ఓట్లు తొలగించిన వ్యవహారంలో ఎన్నికల కమిషన్ తో సమానంగా విమర్శలు ఎదుర్కొంటున్న కేంద్ర ప్రభుత్వం .. తాజాగా మరో సంచలన నిర్ణయం ప్రకటించింది. సంక్షేమ పథకాల కోసం ఆధార్ కార్డు కాకుండా ఓటరు కార్డునే ప్రామాణికంగా తీసుకోబోతున్నట్లు కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేసిన ప్రకటన దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఎస్ఐఆర్ ద్వారా చేస్తున్న కుట్రను అర్థం చేసుకోవాలంటూ విపక్ష నేత రాహుల్ గాంధీ ఇవాళ ట్వీట్ చేశారు.

చివరికి ఇలా..

పథకాల ప్రయోజనాలు ఇకపై ఆధార్ ద్వారా కాకుండా, ఓటర్ ఐడీ ద్వారా నిర్ణయిస్తామన్న కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ వీడియోను షేర్ చేసిన రాహుల్ గాంధీ.. .ఈ కుట్ర చాలా లోతుగా పాతుకుపోయిందన్నీ. దీన్ని అర్థం చేసుకోవాలని ప్రజల్ని కోరారు. ఎస్ఐఆర్ ముసుగులో, లక్షలాది పేర్లను ఓటర్ల జాబితాల నుండి తొలగిస్తున్నారని, దీన్ని ఆపకపోతే, ఇంకా ఎన్నో పేర్లను తొలగిస్తారన్నారు. బీజేపీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నవారి పేర్లను ఇలా టార్గెట్ చేసుకుంటున్నారని ఆరోపించారు. ఓటర్ల జాబితాలు నిష్పక్షపాత ఎన్నికల సంఘం చేతిలో ఉండాలి-కానీ ఇప్పుడు అవి మోదీ ప్రభుత్వ ఉద్యోగి జ్ఞానేష్ కుమార్ చేతిలో ఉన్నాయన్నారు. ఓట్ల దొంగతనంలో బీజేపీతో ఆయన కుమ్మక్కైన తీరును తాము ఆధారాలతో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు.

కేంద్రం అభ్యర్థనకు నో..

ఎల్లప్పుడూ బీజేపీకే మెజారిటీ ఉండేలా ఒక జాబితాను రూపొందించడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పుడు అదే జాబితా మీకు పథకాల ప్రయోజనాలు అందుతాయో లేదో నిర్ణయిస్తుందన్నారు. నిన్న బీజేపీని గద్దె దించాలని నిర్ణయించుకున్న వారి పేర్లను ప్రత్యేకంగా ఎంపిక చేసి జాబితా నుండి తొలగిస్తారని రాహుల్ తెలిపారు. పేరు తొలగిస్తే ఓటు పోయినట్లే. ఓటు పోతే హక్కులు పోయినట్లే అన్నారు. అలాగే, మీరు పైజామా చేసిన ప్రజాస్వామ్యంలో అదృశ్య పౌరులుగా మారిపోతారన్నారు. ఇక్కడ ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోరు, ప్రభుత్వమే తన మనుషులను ఎన్నుకుంటుందన్నారు. ఈరోజు పంచాయతీ రాజ్ పథకాలు, రేపు, రేషన్లా? పెన్షన్లా? ఎంజీఎన్ఆర్ఈజీఏనా? గృహప్రవేశ్? స్కాలర్‌షిప్‌లా? రిజర్వేషన్లా? అని ప్రశ్నించారు. ఇది ఎన్నికలలో గెలవడానికి చేసే రాజకీయం కాదని, ఎన్నికలను దొంగిలించడానికి చేసిన ఒక ఏర్పాటు, అధికారాన్ని అంటిపెట్టుకుని ఉండటానికి వేసిన శాశ్వతమైన ఏర్పాటే అన్నారు. ఓటు వేయడం మీ హక్కు, షరతు కాదన్నారు. ఒక పేద వ్యక్తి పెన్షన్‌ను వారి ఓటర్ కార్డుకు బానిసగా చేయలేరన్నారు. ఇది కేవలం ఓట్ల దొంగతనం కాదని, ఇది హక్కుల దొంగతనం అన్నారు. తాము దీనిని జరగనివ్వబోని రాహుల్ హెచ్చరించారు.

సామాజిక మాధ్యమాలకు చట్ట 'రక్షణ' తొలగింపు?

కంటెంట్‌పై యూజర్లతోపాటు కంపెనీలకూ బాధ్యత...చట్టంలో కీలక సవరణలకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు

న్యూఢిల్లీ : ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు కల్పించిన చట్టపరమైన రక్షణను తొలగించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన కథనం ప్రకారం సోషల్ మీడియా నిబంధనల్లో మార్పులపై ఐటీ మంత్రిత్వశాఖ చర్చలు ప్రారంభించింది. ప్రతిపాదిత మార్పుల ప్రకారం వినియోగదారుల పోస్టులు, వీడియోలు, కామెంట్లకు కూడా ప్లాట్‌ఫామ్‌లు బాధ్యత వహించాల్సి రావచ్చు. ప్రస్తుతం ఐటీ చట్టంలోని సెక్షన్ 79 ఈ కంపెనీలకు సంపూర్ణ రక్షణను అందిస్తున్నది. ఈ నిబంధన ప్రకారం వినియోగదారులు పోస్టు చేసిన కంటెంట్‌కు లేదా చేసిన వ్యాఖ్యలకు కంపెనీలు నేరుగా బాధ్యత వహించవు. సోషల్ మీడియా కంపెనీలకు ఉన్న ఈ రక్షణను తొలగించి దానిని ఇంటర్నెట్, టెలికం, మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లకు మాత్రమే పరిమితం చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది.

రక్షణతో లబ్ధి


వినియోగదారు సృష్టించిన కంటెంట్ ఆధారంగా ప్రధాన వ్యాపారాలను నిర్మించుకోవడానికి మెటా, గూగుల్, ఎక్స్ వంటి కంపెనీలకు చట్టపరమైన ఈ రక్షణ సహాయపడింది. వినియోగదారుడు పోస్టు చేసిన ప్రతి పోస్టు, వీడియో లేదా వ్యాఖ్యకు ఈ కంపెనీలు చట్టపరమైన బాధ్యత వహించాల్సిన అవసరం లేదు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు ఇకపై కేవలం సమాచారాన్ని వ్యాప్తి చేసే మాధ్యమంగా మాత్రమే లేవని ప్రభుత్వంలోని ఒక వర్గం భావిస్తున్నది. ఇవి కంటెంట్ ర్యాంకింగ్, సిఫార్సు, వ్యాప్తిని నిర్ధారించడానికి పరిష్కార మార్గాన్ని ఉపయోగిస్తున్నట్లు వాదిస్తున్నది. ఈ ప్లాట్‌ఫామ్‌లు తమ కమ్యూనిటీ మార్గదర్శకాల ఆధారంగా పోస్టులను తొలగిస్తాయి లేదా పరిమితం చేస్తాయి. ఈ నియమాలు కొన్నిసార్లు భారతీయ చట్టాలకు భిన్నంగా ఉండవచ్చు.

భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు

సామాజిక మాధ్యమ వేదికల్లో చట్టవిరుద్ధ కంటెంట్ వ్యాప్తిని అడ్డుకోవడంలో ఈ ప్రతిపాదన సంస్థల జవాబుదారీతనాన్ని పెంచవచ్చు. అయితే ప్రభుత్వాన్ని విమర్శించే పోస్టులపై నిఘా, సెన్సార్‌షిప్ పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రతిపాదనపై కేంద్రం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.

మరో ప్రభుత్వ రంగ సంస్థకు 'ఉరి'... యూపీలోని పోలియో వ్యాక్సిన్ ఉత్పత్తి ప్లాంట్ మూసివేత

నాలుగేండ్లుకార్మికులకుజీతాలుచెల్లించని మోదీ సర్కార్...కుటుంబ పోషణకు మంగళసూత్రాలు అమ్ముకుంటున్న ఉద్యోగులు



బులంద్‌షహర్: ఒకప్పుడు కోట్లలో పోలియో వ్యాక్సిన్ డోసులను ఉత్పత్తి చేసిన ఉత్తరప్రదేశ్ బులంద్‌షహర్‌లోని భారత్ ఇమ్యునోలాజికల్, బయోలాజికల్స్ కార్పొరేషన్ లిమిటెడ్(బీఐబీసీవోఎల్) ఫ్యాక్టరీని నరేంద్ర మోదీ ప్రభుత్వం శాశ్వతంగా మూసివేయడంతో పదుల సంఖ్యలో ఉద్యోగులు రోడ్డునపడ్డారు. 2022 డిసెంబర్‌లో ఫ్యాక్టరీ వ్యాక్సిన్ల ఉత్పత్తిని నిలిపివేసిన తర్వాత దాదాపు 100 మంది ఉద్యోగులకు జీతాల చెల్లింపు నిలిచిపోయింది.తమ వేతన బకాయిలను డిమాండ్ చేస్తూ కోర్టులను ఆశ్రయించారు. సీబీఐ, లోకాపాల్ జోక్యం కోరారు. ప్రభుత్వ అధికారులకు లేఖలు రాశారు. నిరసనలు సైతం చేపట్టారు. అప్పటికీ ఆ ప్లాంట్‌ను ప్రభుత్వం పునరుద్ధరిస్తుందనే ఆశను వారు వదులుకోలేదు. అయితే ఆ ఆశ ఇప్పుడు అడియాసగా మారింది. ఈ ఏడాది సెప్టెంబర్ 17న కేంద్ర ప్రభుత్వం బీఐబీసీఓఎల్‌ను మూసివేయడానికి ఆమోదం తెలపడంతో ఫ్యాక్టరీ మళ్లీ పుంజుకుంటుందనే అవకాశాలన్నీ పూర్తిగా మూసుకుపోయాయి. తమకు రావలసిన వేతనాలు, ఇతర ప్రయోజనాల విషయంలో కార్మికులకు ఇప్పటికీ ఎటువంటి స్పష్టత లేదు. అలాగే వారిని ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో సర్దుబాటు చేస్తారా లేదా అన్న దానిపై కూడా ఎటువంటి సమాచారం లేదు.1989లో భారత్‌ను వ్యాక్సిన్ల విషయంలో స్వయం సమృద్ధి చేసే లక్ష్యంతో స్థాపించిన ఈ ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ) కోసం వారు వెచ్చించిన దశాబ్దాల జీవితం ఇప్పుడు అర్థరహితంగా మిగిలిపోయింది. దేశాన్ని పోలియో రహితంగా మార్చిన పీఎస్‌యూను అవినీతిపరులైన అధికారులు మింగేశారు అని ఫ్యాక్టరీ మాజీ ఉద్యోగి 58 ఏండ్ల సునీల్ కుమార్ శర్మ పేర్కొన్నారు. ఉపాధి కోల్పోయిన పలువురు ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందుల వల్ల మరణించారని, మిగిలిన వారు ఆకలి చావుల అంచున ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ పోషణ, ఆరోగ్య ఖర్చుల కోసం కొందరు తమ మంగళసూత్రాలను అమ్ముకునే దయనీయ పరిస్థితి ఏర్పడింది. ఒకప్పుడు లక్షలాది మందికి కలల ప్రజా ఆరోగ్య కేంద్రంగా వెలుగొందిన ఈ సంస్థ ఇప్పుడు ఒక విఫలమైన వాగ్దానంలా నిలిచింది. ఇది పాత ప్రభుత్వ రంగ సంస్థల అవశేషాలను కాపాడటానికి మోదీ ప్రభుత్వం సుముఖంగా లేదని సూచిస్తున్నది.

అన్ని ప్రయత్నాలూ విఫలం

ఫ్యాక్టరీ మూసివేతను నివారించే ప్రతి ప్రయత్నమూ విఫలమైంది. 2025 మార్చిలో ఒక పార్లమెంటరీ స్థాయి సంఘం ఈ సంస్థ పునరుద్ధరణ ప్యాకేజీని సిఫార్సు చేసింది. అదే సంవత్సరం డిసెంబర్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వేతన బకాయిల విషయమై సంస్థ ఉద్యోగుల ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. కానీ ఆ రెండు చర్యలూ ఆ సంస్థను మూసివేత నుంచి కాపాడలేకపోయాయి. ఈ ఫ్యాక్టరీ ప్రాంగణం ఇప్పుడు కోతులకు ఆటస్థలంగా మారింది. ప్రస్తుతం కార్మికులు తమకు రావలసిన బకాయిలను తిరిగి పొందాలని మాత్రమే ఆశిస్తున్నారు.కంపెనీ మూసివేత, ఉద్యోగాల తొలగింపు లేదా బకాయిల చెల్లింపు గురించి ఎవరికీ ఎటువంటి అధికారిక సమాచారం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం ఏండ్ల తరబడి కొనసాగుతుండగా ఇప్పుడు ఈ మౌనం కార్మికుల పరిస్థితిని మరింత దుర్భరంగా మార్చింది. నిరసన తెలుపుతూ తీవ్ర వేదనలో ఉన్న సంస్థ ఉద్యోగులకు ఢిల్లీలోని మంత్రిత్వ శాఖ అధికారులు ఎటువంటి సమాచారం కూడా అందించలేదు. ఫ్యాక్టరీ మూసివేత తర్వాత కార్మికుల పరిస్థితి ఏమిటని అడిగినప్పుడు మేము ఆ ప్రక్రియను చేపడుతున్నాము అని బయోటెక్నాలజీ విభాగం(డీబీటీ) సంయుక్త కార్యదర్శి ఏక్తా విష్ణోయ్ చెప్పారు.

పాట్నాలో పోలీసుల కాల్పుల్లో ముగ్గురు మృతి

పాట్నాలోని మనేర్ ప్రాంతంలో శుక్రవారం పోలీసులు, నేరచరిత్ర ఉన్న వ్యక్తుల మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు నిందితులు మృతిచెందారు. ఈ ఘటనలో ఓ పోలీసు అధికారి యూనిఫాంను తూటా రాసుకుంటూ వెళ్లడంతో తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారని పోలీసు అధికారి తెలిపారు. నేరస్థులు 24 రౌండ్లకు పైగా కాల్పులు జరపగా, పోలీసులు 18 రౌండ్లు ఎదురుకాల్పులు జరిపారు. నిందితుల్లో ఒకరు జయప్రకాశ్ పై 9 కేసులు, మిగతా ఇద్దరిపై 2 చొప్పున కేసులు ఉన్నాయి.

మృతుల కుటుంబ సభ్యులు ఇది 'ప్రణాళికాబద్ధ హత్య' అని ఆరోపించారు. మరోవైపు, పోలీసు ఎన్‌కౌంటర్ల ద్వారా ఒక ప్రత్యేక వర్గం ప్రజలను బిహార్ ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరి లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆర్జేడీ ఎంపీ మీసా భారతి అన్నారు. మృతుల మృతదేహాలను పోస్టుమార్టం కోసం తరలించిన దానాపూర్ సదర్ ఆసుపత్రి వెలుపల కుటుంబ సభ్యులు, స్థానికులు నిరసన తెలిపారు. హత్యలు ముందే పన్నినవేనని వారు ఆరోపించారు. నిరసనలో జరిగిన ఘర్షణలో ఎఎస్పి అజిత్ కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. భోజ్‌పూర్‌లో జరిగిన మరో ఘటనలో పవన్ యాదవ్ అనే నేరస్థుడు పోలీసుల కాల్పుల్లో గాయపడ్డాడు.

తిరుమల కొండ ఖాళీగానే.. స్వామి వారి దర్శనం సులువు



తిరుమలలో భక్తుల రద్దీ తక్కువగానే ఉంది. నేడు శనివారం అయినా భక్తుల రద్దీ పెద్దగా లేదు. శనివారం సహజంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయితే తుపానులు, పండగలు, ఎన్నికల సమయం కావడంతో భక్తుల రద్దీ తక్కువగా ఉన్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. గత వారం నుంచి తిరుమలలో భక్తుల రద్దీ తక్కువగానే ఉంది. వరస సెలవులు వచ్చినప్పటికీ తిరుమలకు భక్తుల సంఖ్య తక్కువగా ఉంది. తిరుమలకు వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లను తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు చేస్తున్నారు. వసతి గృహాలు కూడా సులువుగానే లభ్యమవుతుండటంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

సెలవులు వచ్చిన వెంటనే...

తిరుమలకు వచ్చే భక్తులు ఏ మాత్రం సెలవులు వచ్చినా వెంటనే ఏడు కొండల వాడి దర్శనానికి వస్తుంటారు. తమ మొక్కులు చెల్లించుకునేందుకు దేశం నలుమూలల నుంచి వస్తుంటారు. అయితే దీపావళి పండగ ఇంట్లో జరుపుకోవాల్సిన పండగ కావడంతో ఎక్కువ మంది ఇంటికే పరిమితమవుతున్నారు. దీపావళి పండగ తర్వాత తిరిగి తిరుమలలో భక్తుల రద్దీ పెరుగుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు వెల్లడించారు. ఇక వరసగా వచ్చే నెలలో వైకుంఠ ఏకాదశితో పాటు సంక్రాంతి సెలవులు కూడా వస్తుండటంతో తిరుమలకు ఈ నెల రెండో వారం నుంచి జనవరి చివరి వరకూ భక్తుల రద్దీ కొనసాగుతుందన్న అంచనాలు వినపడుతున్నాయి.

నాలుగు గంటల సమయమే...

ఈరోజు తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని పది కంపార్ట్ మెంట్లలో భక్తులు స్వామి దర్శనం కోసం వేచి ఉన్నారు. సర్వదర్శనం క్యూ లైన్ లోకి ఉదయం టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం నాలుగు గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. శీఘ్రదర్శనం టోకెన్లున్న భక్తులకు గంట సమయంలో పూర్తవుతుంది. నిన్న తిరుమలకు 65,467 మంది భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. వీరిలో 22,462 మంది భక్తులు తమ తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నిన్న తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం 4.17 కోట్ల రూపాయలు వచ్చిందని అధికారులు తెలిపారు. నిన్న శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు 3.49 లక్షలు జరిగాయి. అలాగే నిన్న అన్న ప్రసాదాన్ని 1.54 లక్షల మంది స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.